1993 నుంచి 2013 వరకు వెలువడిన **నడుస్తున్న చరిత్ర** కు నేటి రూపం

సంపుటి : 9
సంచిక : 8,9
పుటలు : 52
రు. 25లు
ISSN NO: 2582-8738
యు.జి.సి. గుర్తింపు పొందినది

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

నుడి నాడు నెనరు

అక్టోబరు/నవంబరు 2023



ఆచార్య తుమ్మపూడి కోటేశ్వరరావు మరణంతో
తెలుగులో తాత్విక స్థాయి విమర్శల లోటు ఏర్పడింది.
కనుమరుగు 24 ఆగస్టు, 2023



తమ ఆత్మాహుతితో భాషాప్రాతిపదికపై రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియను
త్వరితం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు
కనుమరుగైన తేదీ: 15.డిసెంబరు 1952






ఆచార్య ఎస్.గంగప్ప సాహిత్యపురస్కారాన్ని తెలుగు భాషోద్యమకారుడు డా. [illegible]

## జాతీయత - ఉపజాతీయత: జస్టిస్ వి.ఆర్.కృష్ణయ్యర్

# తెలుగు భాషోద్యమకారుడు డా.సామల రమేష్‌బాబుకు
# ఆచార్య గంగప్ప స్మారక సాహితీ పురస్కారం

## గుంటూరు శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం, అన్నమయ్య కళావేదికపై
## 6-11-2023న జరిగిన కార్యక్రమ దృశ్యాలు

వివరాలు 6 వ పేజీలో...

















◆ తెలుగు అభివృద్ధి, సాధికారతల కోసం...
◆ తెలుగు భాషోద్యమ నిర్మాణం కోసం...
◆ ఆంధ్ర, తెలంగాణ, ఇతర రాష్ట్రాలు, విదేశాల్లోనూ ఉన్న తెలుగువారి కోసం...

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

సంపాదకుడు : డా॥ సామల రమేష్‌బాబు *9848016136*

తోడ్పాటు : డా॥ గారపాటి ఉమామహేశ్వరరావు, డా॥ వెన్నిసెట్టి సింగారావు, డా॥ సుందర్ కొంపల్లి, రహ్మానుద్దీన్ షేక్, సరస్వతుల రామనరసింహం(సరసి), తమ్మా శ్రీనివాసరెడ్డి

**అక్టోబరు/నవంబరు 2023**



## రచయితలకు సూచనలు

తెలుగు భాష, సాహిత్యం,సాంస్కృతికతలతో పాటు తెలుగువారి చరిత్రకూ, సంస్కృతికీ, సాధికారతకూ, ప్రగతికీ చెందిన సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై రచనలకు స్వాగతం. రచనలను వ్యాసం, కథ, వచన కవిత, పాట – ఏ రూపంలోనైనా పంపవచ్చు.

1. వ్యాసాలు, కథలు ముద్రణలో 1 నుండి 3 పుటలకు మించకూడదు. కవితలు 20 నుంచి 30 పంక్తులకు మించకూడదు. విమర్శలు విషయం పైనే ఉండాలి. వ్యక్తులపై గురిపెట్టి చేయరాదు. సరళమైన తెలుగులో వ్రాయాలి.

2. రచనలను యూనికోడ్‌లో గాని, అనుఫాంట్స్‌లో గాని టైప్ చేసి పి.డి.ఎఫ్ మరియు పి.ఎం.డి. రెండింటిలోనూ పంపాలి. లేదా ఎ4 సైజు కాగితంపై వ్రాసి, స్కాన్‌చేసి *editorammanudi@gmail. com* కు పంపాలి. కొరియర్ / రిజిష్టర్డ్ / సాధారణ పోస్టులో కూడా పంపవచ్చు.

3. రచనతో పాటు పోస్టల్ చిరునామా, ఫోన్ నంబరు, ఉంటే ఇ-మెయిల్ చిరునామా కూడా ఇవ్వాలి. ఈ వివరాలు లేని రచనల్ని తీసుకోలేము.

**4.** <u>హామీపత్రం తప్పనిసరి:</u> **రచన సొంతమేనని, ఇతర పత్రికలకుగాని, ఇంటర్నెట్ పత్రికలకుగాని పంపలేదని, ఇంతవరకు ఎక్కడా ప్రచురణ కాలేదని హామీ పత్రాన్ని తప్పనిసరిగ రచనతో జోడించాలి. హామీ పత్రంలేని రచనలను, ముందుగా సామాజిక మాధ్యమాల్లో పెట్టిన రచనలను ప్రచురణకు స్వీకరించలేము.**

**5.దయచేసి ప్రచురణ కోసం పంపే రచనలను, వార్తలను ప్రతి నెల 15వ తేదీలోపుగా మాకు చేరునట్లు పంపండి. 20వ తేదీ దాటిన తరువాత చేరే వాటిని వెంటనే పరిశీలించడం వీలుకాదు. వ్యాసాలను ప్రచురించడానికి కనీసం 1-2 నెలల వ్యవధి పట్టవచ్చు.**

## లోపలి పుటలలో....


| | | | |
|---|---|---|---|
| శ్రద్ధాంజలి | తాత్త్విక విమర్శక రచయిత .. | రాచపాళెం చంద్రశేఖర రెడ్డి | 07 |
| భాషాపరిరక్షణ | తెలుగుభాషా డాక్యుమెంటేషన్. | రహ్మానుద్దీన్ షేక్ | 09 |
| ప్రసంగపాఠం | పాఠ్యప్రణాళిక సమస్యలు... | రమేష్ పట్నాయక్ | 11 |
| ప్రసంగపాఠం | పాఠశాల విద్యారంగం... | వి.బాలసుబ్రహ్మణ్యం | 13 |
| ప్రసంగపాఠం | ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యారంగం.. | కె.యస్.లక్ష్మణరావు | 16 |
| ప్రసంగపాఠం | ప్రభుత్వ పాఠశాలలో... | గుంటుపల్లి శ్రీనివాస్ | 17 |
| పరిశోధనా పత్రం | నీళ్ళు కళల పరిమళం..... | శ్రీనివాస్ అంకె | 20 |
| పరిశోధనా పత్రం | బహుప్రకార సహజ భాషా ప్రకియ... | కటికెల శ్రీహర్ష కిషోర్ | 25 |
| పరిశోధనా పత్రం | సంచారజాతి ఏనదులు | పప్పుల వెంకటరమణ | 27 |
| పరిశోధనా పత్రం | మాండలికాలను...... | టేకుమళ్ళ వెంకటప్పయ్య | 29 |
| పరిశోధనా పత్రం | స్వభాష.... | శివయ్య రాజులపాటి | 31 |
| చరిత్ర పుటలనుండి | జాతీయత–ఉపజాతీయత | జస్టిస్. వి.ఆర్.కృష్ణయ్యర్ | 34 |
| | చంద్రిక కథ | సుబ్రమణ్యభారతి–బంగోరె | 42 |
| సాహిత్య రంగం | హర్షణీయం..... | మధురాంతకం నరేంద్ర | 44 |
| వారసత్వ సంపద | శంకరన్ గారి తరం–3.... | 'శక్తి' శివరామకృష్ణ | 46 |
| పుస్తక సమీక్ష | కలం యోధుడు..... | 'ఆరా' | 48 |
| వెలిసిపోతున్న పదాలు | అర్భత్తుల న్యాయం | జి.వి.పూర్ణచందు | 49 |
| కవితలు: | బండి చక్రం, | నాంపల్లి సుజాత | 19 |
| | పోస్ట్‌మ్యాన్ | గోపి | 50 |



| ముఖచిత్రం, | కార్టూన్లు | ఫొటోలు | కంప్యూటర్ |
|---|---|---|---|
| చిదంబరం రావు | సరసి, శేఖర్ | రాజేంద్ర | యన్.రాజారావు |


ammanudi.org వలగూటిలో **అమ్మనుడి పాత సంచికలను చదువగలరు**

**రచనలను, వార్తలను, వాట్సాయాప్‌లో పంపవద్దు:** 'అమ్మనుడి'లో ప్రచురణకై వార్తలు, ఫోటోలు, రచనలను కొందరు వాట్స్‌యాప్(WhatsApp) లో పంపుతున్నారు. వాటిని ప్రచురణకు స్వీకరించలేము. దయచేసి కొరియర్‌లో / రిజిస్టర్డ్ పోస్టులో, లేదా **editorammanudi@gmail.com** కు పంపించండి. – సంపాదకుడు

రచనలు, ఉత్తరాలు పంపుటకు చిరునామా:
సంపాదకుడు: **అమ్మనుడి**, జి–2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం,విజయవాడ–520004.
సంపాదకుడు : *9848016136* *e-mail* : editorammanudi@gmail.com

రచయితల అభిప్రాయాలు వారి స్వంతం. వారితో పత్రిక యాజమాన్యం, సంపాదకుడు ఏకీభవించవలసిన అవసరం లేదు.

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

నుడి నాడు నెనరు మాసపత్రిక

**చందా వివరాలు: జీవిత చందా: రూ.5000**

**4 సం॥: రూ.1000, 1 సం॥ :రూ.300**

ఎం.ఓ. లేదా తెనాలిలో చెల్లునట్లు బ్యాంకు చెక్కు లేదా డి.డి.ని **'తెలుగుజాతి'** పేర పంపాలి.

## • బ్యాంక్‌ఖాతా, ఫోను వివరాలు •

ఆన్‌లైన్ ద్వారా చందాను పంపేవారు NEFT / RTGS ద్వారా **'తెలుగుజాతి'**-యాక్సిస్ బ్యాంకు, తెనాలి శాఖకు పంపాలి.

**TELUGU JAATHI - AXIS BANK, TENALI**

అక్కౌంట్ నెం. **914020020387880**

**IFSC Code : UTIB0000556**

Telugu Jaathi
+91 94929 80244

9492980244@okbizaxis

ఈ **QR**కోడ్‌ను స్కాన్ చేసి లేదా **QR**కోడ్ క్రింద ఇచ్చిన యుపిఐ ఐడి నెంబరుకు మీరు విరాళాలు, చందాలు పంపవచ్చును.

ఆన్‌లైన్‌లో చందాను పంపేవారు వెంటనే ఇంటినెంబరు, వీధి పేరు, పోస్టాఫీసు, ఊరిపేరు, పిన్‌కోడ్ నెంబరుతో సహా తమపూర్తి చిరునామాను, ఫోన్‌నెంబరు, మెయిల్‌ఐడి తదితర వివరాలను జాబు ద్వారా తెలుపగలరు.

**94404 48244** లేదా **94929 80244** ఫోన్‌కు సందేశం గాని, వాట్స్‌యాప్ ద్వారా గాని తెలుపగలరు.

చందాలు పంపడం, దానికి సంబంధించిన ఉత్తరప్రత్యుత్తరాలకు చిరునామా

**డా॥ సామల లక్ష్మణబాబు,** ప్రచురణకర్త, 'అమ్మనుడి'
8-386, జీవక భవనం, అంగలకుదురు పోస్టు, **తెనాలి,**
గుంటూరు జిల్లా - 522 211.
ఫోన్ : 94404 48244, 94929 80244,
ఇ-మెయిల్ : ammanudi2015@gmail.com

## • చందాదారులకు సూచనలు •

1. చందా కాలం, ముగింపు తేదీ- పత్రిక కవరుమీద మీచిరునామా పై భాగంలోనే ఉంటుంది. గమనించండి.
2. చందా కాలం ముగిసిపోయిన తర్వాత పత్రిక పంపబడదు. దయచేసి వెంటనే చందా పైకం పంపి, చందాను కొనసాగించుకోగోరుతున్నాము.
3. చందా పూర్తయ్యేందుకు ఒక నెల ముందే దయచేసి మీ చందాను పంపించండి.
4. మీ ఇంటి నెంబరుతో సహా పూర్తి చిరునామాను, పిన్‌కోడ్ నెంబరుతో సహా తెలియపరచాలి. మీ ఫోన్ నెంబరును, వుంటే మీ మెయిల్ ఐడి ని తెలుపండి.
5. మీ చిరునామా మారినట్లయితే దయచేసి వెంటనే తెలియజేయండి.
6. 'అమ్మనుడి' పత్రికను చందాదారులకు మాత్రమే పోస్టులో పంపించగలము. బయట ఎక్కడా అంగళ్లలో అమ్మకమునకు పెట్టడంలేదు. కనుక కావలసినవారు దయచేసి చందాదారులుగా చేరవలసిందిగా కోరుతున్నాము. చందాదారులు కోరినట్లయితే ఆన్‌లైన్‌లో కూడా పత్రికను పంపగలము. మీ ఇ-మెయిల్ ఐడిని తప్పక తెలియజేయండి.

గమనిక

పత్రికకు చందాదారులుగా చేరినవారి రచనలను తప్పనిసరిగా ప్రచురిస్తామనే హామీ ఏమీలేదు. ఏ రచనలను ప్రచురించాలో ఎంపిక చేసే బాధ్యత కేవలం పత్రిక సంపాదకుడిదే. దయచేసి ఎవ్వరూ వత్తిడి తేవద్దు. -ప్రచురణకర్త

## • ప్రోత్సాహకులుగా చేరండి •

రు. 10,000/-లు, ఆపైన- విరాళంగా పంపి, 'తెలుగుజాతి ట్రస్టు'కు ప్రోత్సాహకులుగా మాతో చేరి సహకరించగోరుతున్నాము. అట్టి 'ప్రోత్సాహకులకు' పత్రికను శాశ్వతంగా పంపుతూ, ట్రస్టు ప్రచురించే ఇతర పుస్తకాలను కూడా వారికి సాదరంగా పంపగలము. దయచేసి మీరు ప్రోత్సాహకులుగా చేరి మా కృషికి తోడ్పడగోరుతున్నాము.

**తెలుగుజాతి(ట్రస్టు) ప్రచురణ**

# రచయితలకు సూచనలు

**ఈ కింద సూచించిన లక్షణాలు కలిగిన వ్యాసాలు మాత్రమే అమ్మనుడిలో ప్రచురణ పొందుతాయి:**

1. **అమ్మనుడి** ప్రాథమికంగా భాషోద్యమ పత్రిక. భాషావిషయాలకు ప్రాముఖ్యతను కల్పిస్తాం. ప్రత్యేకంగా ప్రజలభాషల హక్కులను కాపాడేటటువంటి వ్యాసాలకు అధిక ప్రాధాన్యతను ఇస్తాం.
2. ఆధునిక వైజ్ఞానిక, సాంకేతిక, సామాజిక, ఆర్థిక రంగాలలోని ఆవిష్కరణల గురించి తెలుగులో స్వతంత్ర రచనలకు ఆహ్వానం.
3. వీటితోపాటు తెలుగుజాతి చరిత్ర, సంస్కృతి, అంతరించిపోతున్న తెలుగు కళలూ, జానపద సాహిత్యం మొదలైనవాటికి ప్రాధాన్యం.
4. తెలుగు ప్రజల సామాజిక జీవన విధానంలో, కుటుంబ జీవనంలో భాష, తెలుగూ తదితర అమ్మనుడులకు సంబంధించిన విషయాల ఆధారంగా రాసిన రచనలను పంపవచ్చు.
5. వ్యాసాలు ప్రాథమికంగా పరిశోధనాత్మకంగా, ఆధునిక భాష అవసరాలను తీర్చేవిగాఉండాలి.
6. వ్యాసంలో పేర్కొన్న విషయంలో కొత్తదనం ఉండాలి.
7. ఆ చెప్పే విషయం ఎక్కువమందికి అవసరమైనదిగా, ప్రయోజనకరంగా ఉండాలి.
8. వ్యక్తి ప్రాధాన్యత కంటే విషయ ప్రాధాన్యత గలిగిన వ్యాసాలకే ప్రాధాన్యం.

**పరిశోధనా వ్యాసాలు ఈ కింద పేర్కొన్న సూచనలను విధిగా పాటించాలి.**

1. ప్రచురణ కోసం పంపే పరిశోధనా వ్యాసాలు ఐదుపుటలకు గానీ 3000 పదాలకుగానీ మించకుండా యూనీకోడులో ఉండాలి.
2. వ్యాసాలు ఆధునిక తెలుగులో ఉండాలి. మాండలికతపై ఎలాంటి నిర్బంధమూ లేదు.
3. బాగా వాడుకలో ఉన్న సమాసాలు తప్ప మిగిలిన చోట్ల పదాలను సంధి చేయకుండా వీలైనంతమేరకు విడిగా రాయండి.
4. వ్యాసంలో మొదటిసారిగా ప్రస్తావించిన ప్రత్యేక విషయాలకు రచయిత లేక గ్రంథకర్త పేర్లను సంక్షిప్తరూపంలో కుండలీకరణాలలో సూచించండి.
5. వ్యాస రచనలో తోడ్పడిన రచనల సూచిని చేర్చండి.
6 .అచ్చు తప్పులతో ఉన్న వ్యాసాలను తిప్పి పంపవలసి వస్తుంది.
7. మీ వ్యాసం మీ సొంత సృజన అనీ ఇంతకుమునుపు వేరెక్కడా అచ్చుకాలేదనీ హామీ పత్రాన్ని జతపరచండి.
8. మీ రచనలతోపాటు, పేరు, ఉపాధి, చిరునామా, ఈమెయిలుఐడి, చరవాణి అంకెలు తెలియజేయండి.
9. వీటిని గురించిన ఉత్తర ప్రత్యుత్తరాలు అన్నీ తెలుగులో జరపండి.
10. వ్యాసాలు పైన పేర్కొన్నవాటికి అనుగుణంగా లేనప్పుడు ప్రచురణకు వీలుపడదు.
11. మీ వ్యాసాలనూ వాటికి సంబంధించిన ఫొటోలనూ, బొమ్మలనూ, ఇతరాలను editorammanudi@gmail.com_కే పంపాలి. వాట్సప్‌లో పంపినవి తీసుకొనజాలము.

**సంపాదకుడు-అమ్మనుడి**

# డా.సామల రమేష్‌బాబుకు ఆచార్య గంగప్ప సాహితీ పురస్కారం




తెలుగు సాహిత్య మూలస్థంభాలైన నాటక పద జానపద ప్రక్రియలపై ప్రొఫెసర్ గంగప్ప చేసిన పరిశోధన అజరామరమని మాజీ ఉప సభాపతి డాక్టర్ మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. గుంటూరులో నవంబరు 6వ తేదీన వెంకటేశ్వర స్వామి దేవస్థానం లో తెలుగు భాషోద్యమ సమాఖ్య గౌరవ అధ్యక్షులు, అమ్మనుడి సంపాదకులు డాక్టర్ సామల రమేష్‌బాబుకు ఆచార్య గంగప్ప సాహితీ పురస్కార ప్రదాన సభలో మండలి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తెలుగు సాహిత్యంపై తనకు ఆసక్తిని కలిగించడంతో పాటు తనతో వ్యాసాలు కూడా వ్రాయించిన మూలశక్తి ఆచార్య గంగప్ప గారేనని మండలి పేర్కొన్నారు. ప్రామాణికతతో కూడిన పరిశోధన వ్యాసాలు వ్రాయడంలో గంగప్ప అగ్రగణ్యులని వివరించారు. గొప్ప ఆచార్యుడైన ఆ మహనీయుని వద్ద చదువుకోవడం తన అదృష్టమని మండలి తెలిపారు. గత రెండున్నర దశాబ్దాలుగా గంగప్ప గారి పేరున సాహితీ పురస్కారాలను అందించడం ప్రశంసనీయమని అభినందించారు. ఉభయ రాష్ట్రాలలోని విశ్రాంత విశ్వవిద్యాలయ విశ్రాంత ఆచార్యులలో ఇంత సుదీర్ఘ కాలంగా గంగప్ప పేరున మాత్రమే పురస్కారాలను ప్రదానం చేస్తున్నారని చెప్పారు. తెలుగు భాష పునరుజ్జీవానికి ప్రతి ఒక్కరు ఉద్యమించాలని ఆయన పిలుపు నిచ్చారు.

పురస్కారస్వీకర్త డా.రమేష్‌బాబు ప్రసంగిస్తూ ఆంధ్రప్రాంతంలో తెలుగుభాషోద్యమానికి ఆద్యులలో ఆచార్య గంగప్ప ప్రముఖులని చెప్పారు. 2003లో తెలుగు భాషోద్యమ సమాఖ్య మొదలుకావడానికి ముందే గుంటూరులో ఇతర శిష్యబృందంతో కలిసి తెలుగు రక్షణకోసం గుంటూరులో ప్రజాచైతన్యాన్ని కలిగించే కార్యక్రమాలు నిర్వహించారని, ఆయన పేర పురస్కారాన్ని తనకివ్వడం ఎంతో ఆనందన్ని కలిగిస్తున్నదని అన్నారు. ఇందుకు ఆచార్య గంగప్ప పురస్కార కమిటీ వారికి గంగప్పగారి కుటుంబసభ్యులకు తన ధన్యవాదాలు తెలియజేశారు. తెలుగు రాష్ట్రాలలోని ప్రభుత్వాలు తెలుగుపట్ల పట్టనితనంతో వ్యవహరించడం, అన్ని రంగాల్లో తెలుగు వాడకానికీ, అభివృద్ధికీ ఆటంకంగా మన ప్రభుత్వాలే వ్యవహరించడాన్ని మనం సహించకూడదని, రానున్న ఎన్నికల సందర్భంగా అన్ని పార్టీల నేతలను, పోటీచేసేవారినీ నిలదీసి ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. నిరంతర ఉద్యమాలతోనే తెలుగును కాపాడుకోగలమని, అభివృద్ధి చేసుకోగలమని ఆయన అన్నారు.

ఈ సభకు పోలవరపు కళాసమితి అధ్యక్షులు గోళ్ళ నారాయణరావు అధ్యక్షత వహించారు. సభలో రాష్ట్ర అధికార భాషా సంఘ మాజీ సభ్యులు ఆచార్య షేక్ మస్తాన్, భాషోద్యమనేత శ్రీమోదుగుల పాపిరెడ్డి, దేవస్థాన కమిటీ అధ్యక్షులు సి.హెచ్. మస్తానయ్య, పురస్కార కమిటీ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్.గుమ్మా సాంబశివరావు, డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు కోశాధికారి డాక్టర్ వి. సింగారావు, ఉపాధ్యక్షులు డాక్టర్ యస్ మురళీ మోహన్ తదితర ప్రముఖులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా అదే వేదికపై నవ్యాంధ్ర రచయితల సంఘం, మైత్రీ సాహిత్య సేవా సంఘం, ఆత్మీయ ఆర్ట్ థియేటర్స్, భారతి సాంస్కృతిక సంగీత కళావేదిక, అల్లు రామలింగయ్య కళాపరిషత్, యోగా కేంద్రం(గుంటూరు) బండికల్లు జమదగ్ని ఫౌండేషన్, తాపీ ధర్మారావు వేదిక (గుంటూరు), సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ (గుంటూరు డివిజన్), పెదకాకాని సాంస్కృతిక వేదిక ప్రతినిధులు కూడా సామల రమేష్‌బాబును సత్కరించారు.

--కందిమళ్ళ సాంబశివరావు

రాచపాళెం చంద్రశేఖర రెడ్డి
9440222117

# తాత్త్విక విమర్శక రచయిత- తుమ్మపూడి



**కనువెలుగు: 10-2-1934**
**కనుమరుగు: 24-8-2023**

ఏది మాట్లాడిన నేది వ్రాసినను, తానేకావ్యముంబల్కినన్
హృదయాహ్లాదిత కాస్పదంబనుటయే పెద్ద రాద్ధాంతమా?
పదునౌ మేధకు వాణి వీణ మధుర ప్రాకార వారాకృతిన్
మది నాహ్లాదపు బుగ్గలన్ పొడుచుచునన్నన్ కాదొ సిద్ధాంతమున్
(ఆచార్య శలాక రఘునాథ శర్మ, అభినవ భారతి)

**ఆచార్య ముళ్ళపూడి కోటీశ్వరరావుగారు తెలుగు ఆచార్యుడు, కవి, సంస్కృత పరిశోధకుడు, సాహిత్య విమర్శకుడు, ఉపన్యాస తత్త్వవేత్త, వ్యాఖ్యాత. ఆయన సాహిత్య రంగంలో సమన్వయవాది. ప్రాచ్య, పాశ్చాత్య, తత్వ, సాహిత్య శాస్త్రాలను, మార్క్సిస్టు సౌందర్య శాస్త్రాన్ని ఆపోసన పట్టినవారు. ఆయన పైకి చూచుటకు సాంప్రదాయవాదిగా కనిపించే యోగితత్వానికి చెందినవారు. తంత్ర విద్యోపాసకులు.**

'మనిషి జీవితంలో మూడు రకాల జీవితం వుంటుంది. 1. భౌతిక జీవితం 2. సౌందర్యాత్మక జీవితం. 3. తాత్త్విక జీవితం. ఈ మూడింటిని సమన్వయం చేయగలిగేది సాహిత్యం మాత్రమే అని 18-08-2023 సాయంకాలం నాతో అన్నారు. ఆయన అరవింద ఘోష్, ఆనంద కుమార స్వామి వంటివారి ప్రభావానికి లోనైనవారు. యోగపరంగా రామకోటయ్య, సాహిత్య పరంగా విశ్వనాథ, సౌందర్య పరంగా అభినవ గుప్తపాదులను ఆయన గురువులుగా గౌరవించారు.

తుమ్మపూడి వారు 1934 ఫిబ్రవరి 10వ తేదీన జన్మించారు. 2023 ఆగష్టు 24 న కన్నుమూశారు. తొంబయ్యవ సంవత్సరం ముగుస్తున్న సమయంలో తాను ఉద్యోగం చేసిన అనంతపురం వచ్చి శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని తెలుగు శాఖను చూచి, కొందరిని కలుసుకొని, కొందరిని పిలిపించుకొని మాట్లాడి, 24 ఉదయం నిద్రలో నిశ్శబ్దంగా కన్నుమూశారు. తుమ్మపూడివారిది గుంటూరు జిల్లా, దుగ్గిరాల మండలంలోని ఈమని స్వగ్రామం. రాఘవమ్మ, వెంకటస్వామిగారలు వారి అమ్మా నాన్నలు. వారిది వ్యవసాయ కుటుంబం. 1953 లో ఇంటర్ చదివిన తుమ్మపూడివారు 1956లో బి. ఎ. పూర్తిచేశారు విజయవాడలోని ఎస్.ఆర్.ఆర్. అండ్ సీ.వీ.ఆర్.కళాశాలలో, అక్కడ వారికి విశ్వనాథ సత్యనారాయణ ధూళిపాళ శ్రీరామమూర్తి అధ్యాపకులు. 1958 లో ఉస్మానియా విశ్వ విద్యాలయంలో ఎం.ఏ. తెలుగు చదివారు. అక్కడ ఖండవల్లి లక్ష్మీ రంజనం, దివాకర్ల వేంకట అవధాని, బిరుదురాజు రామరాజు వంటి పండితులు గురువులు. అక్కడ 1966లోఆముక్తమాల్యద మీద వారు పరిశోధన చేశారు. ఎం.ఏ. పూర్తి అవ్వగానే కరీంనగర్‌లో తుమ్మపూడివారు డిగ్రీ కళాశాలలో లెక్చరర్‌గా చేశారు. అక్కడ ఒకనాటి గురువులు విశ్వనాథ ధూళిపాళలు సహ అధ్యాపకులు అయ్యారు. అక్కడే వారికి జువ్వాడి గౌతమ రావు, వెలిచాల కొండలరావు పరిచయం అయ్యారు. ఈ రకంగా విద్యార్థి దశనుంచి తుమ్మపూడివారిపై విశ్వనాథ ప్రభావం పడుతూ వచ్చింది. 1967 లో తుమ్మపూడివారు శ్రీకాళహస్తి క్షేత్ర కళాశాలకు బదిలీపై వచ్చారు. 1968 లో శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం, తెలుగు శాఖలో లెక్చరర్‌గా చేరారు. 1976 ఫిబ్రవరిలో రీడర్‌గా అనంతపురం పీ. జి. సెంటర్‌కు వచ్చారు. అక్కడ ప్రొఫెసర్‌గా 1994 ఫిబ్రవరిలో ఉద్యోగ విరమణచేశారు. అక్కడ తెలుగు శాఖ అధ్యక్షులు, పాఠ్య ప్రణాళిక సంఘం అధ్యక్షులు, మానవీయ విభాగం డీన్, కళాశాల ప్రిన్సిపాల్, అకాడమిక్ సెనేట్ సభ్యులు, పాలక మండలి సభ్యులు వంటి అనేక బాధ్యతలు నిర్వహించారు. అనేక విశ్వవిద్యాలయాలలో పాఠ్య ప్రణాళిక సంఘ సభ్యులయ్యారు. తెలుగు అకాడెమీలో కొన్నాళ్ళు లైజన్ ఆఫీసర్‌గా చేశారు.

తుమ్మపూడివారు కవి. కుమార భారతి, చితాభస్మం మొదలైన కావ్యాలను రాశారు. ఆయన ప్రసిద్ధ విమర్శకులు. ఆముక్తమాల్యదా సౌందర్యం, సాలభంజిక, శ్వేతఛత్రం, శ్వేత పద్మం, శేఫాలికలు, పురాణ విద్య, ప్రబంధ విద్య, వేయిపడగలు, మణిప్రభలు, ఎర్రన, సోమనల కవిత్వం తారతమ్య పరిశీలన, సంవిధాన చక్రవర్తి, రామాయణ కల్పవృక్షం, శాంతరసం మొదలైన చాలా విమర్శ గ్రంథాలు ప్రచురించారు, ఆయన గొప్ప వ్యాఖ్యాత. అముక్తమాల్యద, ఉత్తర హరి వంశం, హరివంశాలకు వ్యాఖ్యానాలు రాశారు, నాటక కర్తగా ధర్మాభిషేకము రచించారు. నవలా రచయితగా వసంతోత్సవం, అనువాదకులుగా ద్విజ్నాగుని కుందమాల నాటకాన్ని అనువదించారు. తాత్త్వికులుగా కఠోపనిషత్, ఈశావాస్యోపనిషత్, దుర్గాసప్తశతి, శివసూత్రాలు, వేదోపనిషత్, ప్రత్యభిజ్ఞా హృదయం, కృష్ణంవందే



**ఆచార్యునితో వ్యాస రచయిత**

జగద్గురుం వంటి అనేకగ్రంథాలను రచించారు, వ్యాఖ్యానించారు. టిటిడి శాసన సంపుటాలను అనువదించారు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీకోసం ఆంధ్రమహాభారతం అనుశాసనపర్వానికి సంపాదకత్వం వహించారు. 120 పుటల సంపాదకీయం రాశారు. అలాగే నవనాథ చరిత్ర(గౌరన) ను పరిష్కరించారు. నేను, మామిత్రుడు కలిసి రచించిన సాహిత్యబోధనా పద్ధతులు, సాహిత్యపరిశోధన సూత్రాలకు సంపాదక సలహాదారులుగా వ్యవహరించారు. వారి స్వగ్రామమైన ఈమని చరిత్ర రాశారు. షిరిడి సాయిబాబా జీవితచరిత్ర రాశారు. కేంద్ర సాహిత్య అకాడమీ కోసం బండారు తమ్మయ్యమీద మోనోగ్రాఫ్ రాశారు. ఇంకా చాలాగ్రంథాలు, వ్యాసాలు, అముద్రితంగా ఉన్నాయి. తుమ్మపూడివారు అనేకమంది కవులూ, విమర్శకులూ రాసిన పీఠికలను1970- 72 బ్యాచ్ఎం.ఏ. తెలుగువిద్యార్థులు ఒక సంపుటంగా ప్రచురించి అనంతపురంలో వారి ద్వారానే ఆవిష్కరించారు.

**తుమ్మపూడివారికి భారతీయ సంస్కృతి అంటే ఇష్టం. వారికి ఇష్టమైన సంస్కృతి మానవులను విభజించే సంస్కృతికాదు. ఆయనది యోగతాంత్రికసంప్రదాయం. అందుకే ఆయన పైకి సాంప్రదాయవాదిగా కనిపించినా మౌఢ్యం కనిపించదు. వ్యక్తిగతజీవితంలో ఆయన చాలా సామాజికంగా లౌకికంగా ఉంటారు. పిడివాదులను ఆయన ఎన్నటికీ సమర్ధించలేదు.**

తుమ్మపూడివారికి విజయనగర సామ్రాజ్య చరిత్ర, కళలు, సంస్కృతి అంటే ఎనలేని ఇష్టం. అందుకనే ఆయన సాహిత్యకృషి చాలావరకు ఆ యుగ సాహిత్యం మీదనే సాగింది. ఆముక్తమాల్యద మీద పరిశోధన మొదలుకొని అనువాద ప్రక్రియలో ఆ యుగచరిత్రను సాహిత్యాన్నీ వ్యాఖ్యానించారు. ఆయన దృష్టిలో శ్రీకృష్ణదేవరాయలు ఆదర్శప్రభువు. రాయల కాలంలో జరిగిన సామాజిక సాంస్కృతిక వికాసం పట్ల వారికి మక్కువ ఎక్కువ.

తుమ్మపూడివారు సాహిత్య విమర్శకులుగా సమన్వయవాది, ఆయనఅలంకారశాస్త్రాలను వైజ్ఞానిక మనస్తత్వశాస్త్రాలను సమన్వయించి విమర్శ చేశారు. సాహిత్యవిమర్శలలోకి గణితశాస్త్రాన్నీ, శిల్పాన్నీ, చిత్రకళనూ, నృత్యాన్నీ, వాస్తు శిల్పాన్నీ, తాంత్రికవిద్యనూ తీసుకువచ్చారు. వారు మార్క్సిస్టు సౌందర్య శాస్త్రాన్ని క్షుణ్ణంగా చదువుకొన్న విషయం నాకు తెలుసు. తుమ్మపూడివారు భారతీయ కళ వక్ర శాఖ అనీ పాశ్చాత్యకళ సరళరేఖ అనీచెప్పేవారు. ఆయనకు రస, ధ్వని,వక్రోక్తిత సిద్ధాంతాలంటే అమితమైనగౌరవం. నవరసాలలో శాంత రసం అంటే ఇష్టం. సాహిత్యంలో విచిత్రశైలి, సుకుమారశైలి అనే రెండు రకాల శైలులు ఉంటాయని బోధించేవారు. అనేక కథలతోనిండిన ప్రాచీన కావ్యాలలోని అంతస్సూత్రాన్ని పునర్నిర్మాణం చేయడం ఆయనకు తెలిసిన విద్య. శబ్దం, అర్థం వాటి సంబంధం మీద ఆయన విశేషంగా ప్రసంగించారు. సాంప్రదాయ వాదులతోనే ఆయన వైఖరి భిన్నంగా ఉంటుంది. ఆయన చిన్ననాటి యోగ గురువు రామకోటయ్యగారి ప్రభావం ఆయన జీవించినంతకాలం కనిపించింది.

ఆముక్తమాల్యద సౌందర్యంలో ఆయన అనేక అధ్యయాలలో అనేక సాహిత్య పర్వాలను అన్వేషించి చివర్లో ఆ ప్రబంధంలో సంపన్నుల, సామాన్యుల తారతమ్యాలను గమనించారు. మహాభారతం, ఆముక్తమాల్యదలో బోధింపబడిన రాజనీతి అంటే ఆయనకు చాలా ఇష్టం. శ్వేతచ్ఛత్రం అనే గ్రంథంలో రాజనీతిని పరామర్శించారు.

తుమ్మపూడివారు సాహిత్యైక జీవి. ఏవేళలోనైనా, ఎవరితోనైనా సాహిత్య విషయాలుతప్ప ఇంకేమీ మాట్లాడేవారు కాదు. విద్యార్థులూ, సహఉపాధ్యాయులూ, పెద్దలైన విద్వాంసులతోనైనా ఎవరితోనైనా ఆయన సాహిత్య విషయాలనుచర్చించేవారు. సాహిత్య విమర్శలో పాఠకుని అనుభవము, అతని తర్కము అని రెండు విభాగాలు ఉంటాయంటారు తుమ్మపూడివారు కవి మనస్తత్వం తెలిసి విమర్శకులు. రచనలలోని మర్మాలను వివరించాలంటారు వారు. కవిమనస్థాయిలో తెలియకపోతే కావ్య శబ్దస్థాయి తెలియదంటారు. జానపద సాహిత్యం కావ్యసాహిత్యం వస్తుసాహిత్యం భిన్నమైనవి కావు అంటారు. ముక్కూ మొఖం లేని నిర్గుణమైన వాటికి రమణీయమైన కల్పన చేయుట కళా సృష్టి అన్నది ఆయన సిద్ధాంతం. పరిశోధన విమర్శ స్థాయికి ఎదగడం ఒక జాతి మేధోనైశిత్యానికినిదర్శనం అని ఆయన అభిప్రాయం.

నేను బి.ఏ. రెండవ సంవత్సరం నుండి పిహెచ్.డీ. వరకు ఆయన విద్యార్థిని (1967-1977). అ తర్వాత సహఅధ్యాపకుడిని. ఆయన తరగతి గదిలో బోధన ఒక లయాత్మకంగా ఉంటుంది. మొదటి వరసలో కూర్చున్న విద్యార్థులు కూడా చెవులు నిక్కించుకొని వింటే తప్ప వినబడనంత తక్కువ స్వరంతోపాఠంమొదలుపెడతారు. ఇరవై నిముషాలు గడిచేలోగా ఆయన స్వరం గానంలో పడుతుంది. తీయటి స్వరంతో పద్యం ఆలపించి విద్యార్థులను తనవైపు ఆకర్షిస్తారు. ఆయన తదేకదీక్షతో పాఠం చెప్పేవారు. మేము మైమరచిపోయేవాళ్ళం. నిజానికి ఆయన బోధన మా స్థాయిని మించి ఉండేది. సాహిత్య బోధనలో సర్వ కళలనూ పరిచయం చేస్తారు. ఆయన బోధన ఆయనకే సొంతం.

**50మంది పరిశోధనలకు పర్యవేక్షకుడుగా వ్యవహరించిన ఆచార్య తుమ్మపూడి కోటీశ్వరరావుగారికి నేను మొట్టమొదటి పరిశోధక విద్యార్థిని. 1973 జనవరిలో నేను ఆయన పర్యవేక్షణలో శ్రీ వెంకటేశ్వరవిశ్వవిద్యాలయం తెలుగుశాఖలో పరిశోధనలో చేరాను. 1977 ఫిబ్రవరిలో పరిశోధన పూర్తిచేశాను. ఆదర్శవంతమైన పర్యవేక్షకుడు తుమ్మపూడివారు. సిద్ధాంత గ్రంథాలను పరిశోధకుల చేతనే సంపూర్ణంగా రాయించడం, రాసిన వాటిని తిరిగి రాయించడం, పరిపక్వత వచ్చేదాకా మళ్ళీమళ్ళీ రాయించడం మధ్యలో అవసరమైన**

**తరువాయి 48పుటలో........**

రహ్మానుద్దీన్ షేక్
9493035658

# తెలుగుభాష డాక్యుమెంటేషన్

ఆగస్టు సంచికలో తెలుగు భాషకు పలు నిఘంటువులు కావాలని అనుకున్నాం కదా. అందులో మొదటి కోరిక యంత్రం-మనిషి ఒకే సమయంలో చదువుకోగలిగే వాడుక నిఘంటువు / పదప్రయోగ నిఘంటువు (లెక్సికల్ నిఘంటువు/యూసేజ్ డిక్షనరీ)గురించి. ఈ సంచికలో వాడుక నిఘంటువు గురించి తెలుసుకుందాం.

వాడుక నిఘంటువు పదాల అర్థాన్ని, ఆయా పదాల వాడకాన్ని తెలిపే నిఘంటువు. ఈ నిఘంటువులో ప్రతి పదానికి ఆ పదం సమాచారం మాత్రమే కాక పదం యొక్క అర్థం, పదం నిర్వచనం, నానార్థాలు, విపరీతార్థక పదాలు, పద వ్యుత్పత్తి, ఆ పదాన్ని ఒక వాక్యంలో ఎలా వాడాలి మొదలగు అంశాలుంటాయి. వాడుక నిఘంటువులను విద్యార్థులు, రచయితలు, ఇతరత్రా జనం పదాల అర్థాన్ని, వాడకాన్ని తెలుసుకునేందుకు చదువుతారు. వాడుక నిఘంటువును ఆ మాటకొస్తే ఏ నిఘంటువునైనా సరే మామూలు పుస్తకాలు లేదా పాఠ్యపుస్తకాలు చదివినట్టుగా మొదలు నుంచి చివర వరకూ చదవక్కరలేదు. మనకు కావాల్సిన పదాన్ని, ఆ పదంతో సంబంధమున్న ఇతర పదాలను అంతవరకూ చూసుకుంటే చాలు. అంటే మనకెంత అవసరమో అంతకు మించి ఇలాంటి నిఘంటువులను సాధారణ పరిస్థితిలో తిరగేయం అనమాట. సంగణక భాషాశాస్త్రం (కాంప్యుటేషనల్ లింగ్విస్టిక్స్) సందర్భంలో వాడుక నిఘంటువు ప్రత్యేక భాషలోని ప్రతి ఒక్క పదాన్ని నిక్షిప్తం చేసిపెట్టే డేటా స్ట్రక్చర్ (సమాచారాంశ నిలువ మూస). సంప్రదాయ వాడుక నిఘంటువు లాగానే ఇక్కడ కూడా పదంతో పాటుగా ఆ పదపు అర్థాన్ని, వాడుకను, నానార్థాలను, విపరీతార్థాలను, వ్యాకరణ వివరాన్ని, ఇంకా ఇతర అర్థపరక (సెమాంటిక్) వాక్యపరక(సింటాక్టిక్) సమాచారాన్ని నిక్షిప్తం చేస్తారు.సహజ భాషా ప్రక్రియ (నాచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్) పద్ధతుల్లో, ఉపకరణాలలో ఈ సంగణక వాడుక నిఘంటువులు (కాంప్యుటేషనల్ లెక్సికల్ డిక్షనరీ) పనికొస్తాయి. సహజభాషా ప్రక్రియల్లోని కొన్ని వాడుకోపకరణాలు - యంత్రాధారిత అనువాదం (మషీన్ ట్రాన్స్‌లేషన్), పాఠ్య సంక్షేపీకరణ(టెక్స్ట్‌సమ్మరైజేషన్), ప్రశ్న-జవాబు(క్వెశ్చెన్-ఆన్సరింగ్), మొదలగునవి. పదం యొక్క వాక్యపరక (సింటాక్టిక్) సమాచారం వాక్య నిర్మాణంలో ఆ పదం స్థానాన్ని ఇంకా ఇతర వ్యాకరణ విషయాలను సూచిస్తే, అర్థపరక (సెమాంటిక్) సమాచారం ఆ పదం యొక్క అర్థం మొదలు వ్యుత్పత్తి, నానార్థ-విపరీతార్థాలు మొదలగు అర్థాత్మక సమాచారాన్ని సూచిస్తుంది.

ఆగస్టు సంచికలో వాడుక నిఘంటువు తెలుగుకు తప్పనిసరిగా ఉండాలి అని, అలా వాడుక నిఘంటువు మొదలుకొని కనీసం ఒక పది పన్నెండు వివిధ అవసరాలను తీర్చే నిఘంటువులు వెనువెంటనే తెలుగు కోసం మనం సృష్టించుకోవాలని చెప్పాను. వాడుక నిఘంటువులు సృష్టించి కంప్యూటరీకరించడం వలన తెలుగు భాషను కంప్యూటరుకు నేర్పే పలు చర్యల్లో ప్రాథమిక చర్యలనుకోదగిన వాటిలో ఒక పనిని సాధించినట్టు. మరి తెలుగులో వాడుక నిఘంటువు నిర్మాణం జరగాలంటే చేయాల్సిన పనులేమిటి? ఆ పనులని ఒక్కో మెట్టు రాస్కున్నాక, నాకు తెలిసొచ్చిన విషయాలు కొన్ని ఉన్నాయి. ముందు ఆ విషయాలు ఏకరువు పెట్టుకున్నాక సంగణక వాడుక నిఘంటువు స్వరూపము, దాన్ని తయారు చేసుకునే పద్ధతి గురించి చెప్పుకుందాం. మొదటగా ఆంగ్లభాషకు, తెలుగు భాషకు పోలిక తెచ్చుకుని చూద్దాం. ఒక రెండు వేల పదాల తెలివితో రోజువారీ ఆంగ్ల సంభాషణలు జరిపేసుకోవచ్చు. తెలుగులో రోజువారీ సంభాషణలకు మనం కనీసంలో కనీసం ఐదారువేల పదాలు వాడతాం. ఆంగ్లంలో వాడుకునే పదాలను మాతృభాషగా మాట్లాడేవారు గానీ, రెండవభాషగా మాట్లాడేవారుగానీ పలుకుతున్న పదాల అర్థాన్ని, వ్యాకరణ దోషం లేకుండా పలకటానికి లేదా రాయటానికి ప్రయత్నిస్తారు. తెలుగులో కూడా తెలుగును మాతృభాషగా కలిగినవారు, రెండవభాషగా నేర్చుకుంటున్నవారు దోషరహితంగా మాట్లాడేందుకు, రాసేందుకు ప్రయత్నిస్తారు.

తెలుగుకు, తెలుగు లాంటి ఆంగ్లేతర భాషలకు వాడుక నిఘంటువు రూపొందించేందుకు ఈ కింది సోపానాలను పాటించాలి:

1.పాఠ్యనిధిని(కార్పస్)సమీకరించాలి: ఈ పాఠ్యనిధి లోని పాఠ్యం మొత్తం భాషను ప్రతిబింబించేలా ఉండాలి. పత్రికలు, వార్తాపత్రికలు, పుస్తకాలు, వెబ్సైట్లు, సామాజిక మాధ్యమాలు - ఈ వనరులన్నిటిలో ఉన్న తెలుగు పాఠ్యాన్ని సేకరించాలి.

2.పాఠ్యనిధిలోని పదాలను గుర్తించాలి. ఈ గుర్తింపు కంప్యూటర్ ప్రోగ్రాం వాడి లేదా చేతితోగానీ చేయాలి.

3.పదాలకు ప్రాతిపదికలను తయారు చేయాలి. అంటే పదాలను వాటి మూలపదాలకు జత చేయాలి. ఉదాహరణకు: తింటున్నా, తిన్నాను, తినవచ్చు, తినేస్తాను మొదలగు పదాలకు 'తిను' క్రియ మూలపదం అవుతుంది.

4.పదాలను నిర్వచించాలి.ఈ నిర్వచనాలు అయోమయానికి తావివ్వకుండా స్పష్టంగా, క్లుప్తంగా ఉండాలి. ఈ నిర్వచనాలు తెలుగులోనే ఉండాలి.

5.ఒక్కో పదం వాక్యంలో ఎలా వాడుతామో ఉదాహరణలు ఇవ్వాలి. ఉదాహరణలు సహజమైన సంభాషణలనుంచి రావాలి. రోజువారీ మాటల్లోని పదాలే ఉండాలి తప్ప కృతకంగా ఉండకూడదు.

6.నిఘంటువును ఒక నిర్దిష్ట క్రమ పద్ధతిలో అమర్చాలి. అకారాది క్రమంలో అమర్చవచ్చు, భాషాభాగాల ప్రకారం అమర్చవచ్చు, విషయకమైన క్రమంలో అమర్చవచ్చు.

7.నిఘంటువును తీర్చిదిద్ది, ఎలాంటి అక్షరదోషాలు

లేకుండా నిర్దుష్టంగా, పరిపూర్ణంగా తయారు చేసుకోవాలి.

ఒకసారి నిఘంటువు తయారు చేసుకున్న తరువాత అన్ని మాధ్యమాల్లో అన్ని రూపాల్లో నిఘంటువును పంపిణీ చేయాలి. పుస్తకంగా ముద్రించి, పుస్తక అంగళ్ళలో, గ్రంథాలయాలలో, ఆన్లైన్ పుస్తక అంగళ్ళలో అమ్మాలి. ముద్రిత పుస్తకంతో పాటుగా ఆన్లైన్లో, ఎలక్ట్రానిక్ రూపంలో అందుబాటులో ఉంచాలి. నిఘంటువును రూపొందించేందుకు ఈ కింది అంశాలను దృష్టిలో ఉంచుకోవాలి:

- ♦ సాధారణ, అసాధారణ పదాలు ఈ నిఘంటువులో చేర్చాలి. పదాల సేకరణలో వైరుధ్యమున్న పదాలన్నీ ఉండేలా చూసుకోవాలి.
- ♦ ప్రతి పదానికి ప్రాంతీయంగా, యాసల పరంగా, మాండలికాల్లో ఉన్న ఉచ్చారణలో, అర్థంలో సరిసమానంగా ఉండే పదాలన్నిటినీ జత చేయాలి.
- ♦ పదానికిచ్చే అర్థం లేదా నిర్వచనం స్పష్టంగా, క్లుప్తంగా ఉండాలి.
- ♦ వాక్యంలో వాడుక కోసం ఎన్ని రూపాల్లో వాడితే అన్ని ఉదాహరణలివ్వాలి.
- ♦ నిఘంటువు అమరిక వాడుకునేందుకు సులభంగా ఉండేలా జరగాలి.
- ♦ నిఘంటువు కూర్పులో, అక్షరదోషాలు సరిదిద్దే ప్రక్రియలో జాగ్రత్తలు పాటించాలి.

ఈ వాడుక నిఘంటువును పూర్తి కంప్యూటర్ ఆధారిత జ్ఞప్తిలో తయారు చేసుకున్నపుడు అది యంత్రం చదవగలిగే నిఘంటువు(మషిన్ రీడెబుల్ డిక్షనరీ) అవుతుంది. ఇలా యంత్రం చదవగలిగే నిఘంటువులను రూపొందిస్తే అవి యంత్రం ఆధారిత అనువాదాలకు (యంత్రం ట్రాన్స్‌లేషన్) సహాయ పడతాయి. పదంలో ఉండాల్సిన అక్షరక్రమాన్ని తనిఖీ చేసే ప్రోగ్రామ్(స్పెల్ చెకర్) కోసమూ ఈ యంత్రం చదవగలిగే నిఘంటువులు ఉపకరిస్తాయి. గెల్లిష్ ఇంగ్లిష్ నిఘంటువు ఈ విధానంలో రూపొందించిన నిఘంటువును అలాంటి నిఘంటువు తెలుగుకు మనం ఎంత త్వరితంగా రూపొందించుకుంటే అంత మేలు.

వాడుక నిఘంటువు ఉదాహరణ:

తెలుగు విక్షనరీ(te.wiktionary.org)లో ఋషి అనే పదానికి వాడుక రూపం:

**వ్యాకరణ విశేషాలు**

భాషాభాగం

♦ఋషి నామవాచకం.

వ్యుత్పత్తి

సంస్కృతం నుండి

బహువచనం

♦ఋషులు.



భరద్వాజుని ఆతిథ్యం స్వీకరించుచున్న సీతారాములు మరియు లక్ష్మణుడు

అర్థ వివరణ

వైదికకాలం నాటి కవి, స్తోత్రాలు రచించినవారు.

**పదాలు**

**నానార్థాలు**

♦ద్రష్ట, కవి, బ్రాహ్మణ్, కారూ, కీరి, వాఘత్, విప్ర, ముని ద్రష్ట. 3. జ్ఞానాధికుడు,

**సంబంధిత పదాలు**

. ఋష్యాశ్రమం/

ఋషిపుంగవుడు,

ఋషిపత్ని,

. ఋషికుమారుడు,

. ఋషిప్రోక్తము,

రుష్యపుంగవుడు,

**పర్యాయపదాలు:** అడవినెలవరి, అనుకంప్యుడు, ఉదాస్థితుడు, ఊర్ధ్వరేతసుడు, కచ్చకాడు, కుటపుడు, ఖదిరుడు

**పద ప్రయోగాలు**

1.కావ్యం రాయాలంటే సమదృష్టి కావాలి.(నానృషి కురుతే కావ్యం).అంటే ఋషి కాని వాడు కావ్యం రాయలేడు.

2.కృషి వుంటే మనుషులు ఋషులౌతారు...... ఒక పాటలో పద ప్రయోగము

**అనువాదాలు**

- ♦ ఇంగ్లీషు: · rishi
- ♦ ఫ్రెంచి: · ascète

**మూలాలు, వనరులు**

ఆంగ్ల వికీలో ఋషి పద వ్యుత్పత్తి వివరణ

**బయటి లింకులు**

ఆంధ్రభారతి నిఘంటువులో ఋషి పదం

(వచ్చే నెల సంచికలో పదనిధి, పాఠ్యనిధి, భాషాపరమైన డేటాబేస్‌ల గురించి తెలుసుకుందాం) అ

మాతృభాషలో చదివిన పిల్లల పనితీరు పాఠశాలల పరీక్షలలో మరింత బాగుంటుంది. ప్రతిభా నైపుణ్యాలకు మించి ప్రయోజనాలతో బాటు మెరుగైన ఆత్మనిర్భరత, ఆత్మగౌరవం, ఆత్మధైర్యం అలవడతాయి. –యునెస్కో

విజ్ఞాన శాస్త్రాన్ని అమ్మభాషలో బోధించాలన ఉపాధ్యాయులను కోరుతున్నాను. దానివల్ల చిన్నారుల్లో 'సైన్స్ సృజనాత్మకత' పెరుగుతుంది. పాఠ్యాంశాన్ని త్వరగా అర్థం చేసుకునే శక్తీ సమకూరుతుంది. నేను పదో తరగతి వరకూ మాతృభాషామాధ్యమంలోనే చదువుకున్నా. తర్వాత ఆంగ్లం నేర్చుకున్నా. ప్రాథమిక పాఠశాల స్థాయిలో పిల్లలు చూపించే సృజనాత్మకతే వారి భవిష్యత్తుకు పునాది. ఆ సృజనాత్మకత అమ్మభాషలో చదువువల్లే సాధ్యం

**......డా.ఏ.పి.జె.అబ్దుల్‌కలామ్**

ప్రసంగ పాఠం

రమేష్ పట్నాయక్
7901286396

# పాఠ్య ప్రణాళిక సమస్యలు

పాఠశాల విద్యలో జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో వివిధ అంశాల్లో సమస్యలు కొనసాగుతుండగా లేదా తీవ్రతరం అవుతుండగా, ఇప్పుడు కొత్తగా పాఠ్య ప్రణాళిక సమస్య ముందుకు వచ్చింది. పూర్వ పరాలు పరిశీలిస్తే: 1986 లో "విద్యలో జాతీయ విధానం 1986", దానిననుసరించి 1989లో "జాతీయ పాఠ్య ప్రణాళిక చట్రం 1989" వచ్చాయి. అది ప్రధానంగా కాంగ్రెస్ జాతీయ వాదం, కాంగ్రెస్ సెక్యులరిజం, కాంగ్రెస్ శాస్త్ర దృక్పథంపై ఆధారపడి ఉండిరది. కొన్ని ప్రముఖ ప్రగతిశీల విషయాలు కూడా ఉండినాయి. ఏదేమైనా ఆనాటి విధానాలు భారత రాజ్యాంగ విలువలను స్పష్టంగా పునరుద్ఘాటించి, అట్టి విలువల సాధనకై రూపొందించబడినట్లు ప్రకటించాయి. ఆచరణలో చాలా సమస్యలుండినాయనేది వేరే విషయం. శ్రీ వాజ్‌పేయి మూడవ సారి ప్రధాన మంత్రి అయిన (1999) తరువాత, 2000 సంవత్సరంలో సంఘ్ పరివార్ భావజాలంతో ఒక కొత్త పాఠ్య ప్రణాళిక తీసుకువచ్చారు. అది చాలా వివాదాంశం అయింది. 2004లో యు.పి.ఎ 1 ప్రభుత్వం వచ్చింది. ఆ ప్రభుత్వ కాలంలో 2005 ఒక కొత్త పాఠ్య ప్రణాళిక చట్రం "జాతీయ పాఠ్య ప్రణాళిక చట్రం 2005" విచ్చింది. ఆ ప్రణాళిక చాలా ప్రశంసలందుకున్నది. అయితే, విద్యా వ్యాపారం కూడదని చెప్పకపోవడం, అది తన పరిధిలో లేని సమస్యగా భావించడం వల్ల ఆ పాఠ్య ప్రణాళిక క్షేత్ర వాస్తవికతలో ఎంతవరకు విజయవంతమయింది చెప్పలేం. బి.జె.పి నాయకత్వాన గల ప్రస్తుత ఎన్.డి.ఎ ప్రభుత్వం "జాతీయ విద్యా విధానం 2020", దానిపై ఆధారపడి "జాతీయ పాఠ్య ప్రణాళిక చట్రం 2023 (ముసాయిదా)" తీసుకువచ్చింది. ఈ రెండు విధానాలు కూడా భారత రాజ్యాంగ విలువలకు వ్యతిరేకంగా సంఘ్ పరివార్ అభివృద్ధి నిరోధక విధానాలపై ఆధారపడి ఉన్నాయని ఆ విధాన పత్రాలను చదివిన వారు సులభంగా గ్రహిస్తారు.

మన రాష్ట్రం అనేక దశాబ్దాలుగా 'రాష్ట్ర విద్యా, పరిశోధన, శిక్షణ మండలి' ద్వారా స్వతంత్రంగా పాఠ్య ప్రణాళికను, పాఠ్య పుస్తకాలను రూపొందించే విధానాన్ని అనుసరిస్తూ వస్తున్నది. కొన్ని లోటుపాట్లున్నప్పటికీ ఆ విధానం ప్రయోజనకరమైనదిగానే ఋజువయ్యింది. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం అట్టి విధానాన్ని ప్రక్కన పెట్టి 'జాతీయ విద్యా, పరిశోధన, శిక్షణ మండలి' రూపొందించిన పాఠ్యపుస్తకాలను (సి.బి.ఎస్.ఇ సిలబస్) నేరుగా ఉపయోగించటం 2022-23 విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించింది. గత సంవత్సరం 8వ తరగతికి కేంద్రం తయారు చేసిన సి.బి.ఎస్.ఇ పాఠ్య పుస్తకాలను రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశపెట్టారు. ఎన్ని అభ్యంతరాలు వచ్చినప్పటికీ ఈ సంవత్సరం అదే విధానాన్ని కొనసాగిస్తూ కేంద్రం తయారుచేసిన 9వతరగతి పాఠ్య పుస్తకాలను ప్రవేశపెట్టారు. వచ్చే విద్యా సంవత్సరంలో 6 నుండి 10వ తరగతి వరకు అన్ని తరగతులకు కేంద్రం తయారు చేసిన పాఠ్యపుస్తకాలనే అమలుచేస్తామని చెప్తున్నారు. కేంద్రాన్ని అనుసరించే ఈ విధానం తీవ్ర సమస్యలకు దారితీస్తున్నది. ఇది కాక ఒక వెయ్యి ఉన్నత పాఠశాలలను నేరుగా కేంద్ర బోర్డుకు అనుబంధం చేసింది.

కేంద్రం ఈనాడు శాస్త్రీయ దృక్పథానికి, లౌకిక, ప్రజాస్వామిక విలువలకు వ్యతిరేకంగా పాఠ్యపుస్తకాలను మారుస్తున్నది. అదే విధానాన్ని రాష్ట్రంలో అమలుచేయటం వల్ల మన రాష్ట్రం కూడా యు.పి బీహార్ వలే వెనుకబడటం తప్ప మరొక ప్రయోజనం ఉండదు. పీరియాడిక్ టేబుల్ లేకుండా రసాయనిక శాస్త్రం, జీవ పరిణామ సిద్ధాంతం లేకుండా జీవశాస్త్రం, హక్కుల కొరకు జరిగే ఉద్యమాలు లేకుండా రాజకీయ శాస్త్రం బోధించి ఏం లాభం?. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో, రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర సి.బి.ఎస్.ఇ సిలబస్‌ను రాష్ట్రంలో ప్రవేశపెడతామని అన్నప్పుడు ప్రొ.చక్రధరరావు, ప్రొ.హరగోపాల్ గారి నాయకత్వాన ఆంధ్రప్రదేశ్ విద్యా పరిరక్షణ కమిటి కేంద్ర పాఠ్యపుస్తకాలను నేరుగా ప్రవేశపెట్టటం మంచిది కాదని సి.బి.ఎస్.ఇ సిలబస్‌లో మంచి అంశాలను తీసుకుని రాష్ట్రంలో స్వతంత్రంగా పాఠ్యపుస్తకాలను తయారు చేయాలని సూచించటం జరిగింది. ఆ ప్రతినిధి వర్గంలో ఈ వ్యాస రచయిత కూడా ఉన్నాడు. విద్యా పరిరక్షణ కమిటీ సలహాను అప్పటి ప్రభుత్వం ఆమోదించింది. సారభూతంగా మంచి పాఠ్యపుస్తకాలు తయారుచేయబడ్డాయి. అది గతం. ప్రస్తుత జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానిది కేంద్రాన్ని ప్రశ్నించలేని అసహాయత. స్వతంత్రంగా వ్యవహరించటం ఈ ప్రభుత్వానికి సాధ్యం కాదేమో. సి.బి.ఎస్.ఇ ఏపి పాఠాలను 8వ తరగతి నుంచి తొలగించాలని నిర్ణయించిందో వెంటనే ఒక్క నిమిషం కూడా ఆలోచించకుండా ఆ పాఠాలను సిలబస్ నుండి తొలగిస్తూ ఆదేశాలివ్వటం జరిగిపోయింది. ఈ రాష్ట్ర వర్తమాన, భవిష్యత్ తరాల అవసరాల కంటే కేంద్రం అభీష్టాన్ని అమలుచేయటమే ఈ ప్రభుత్వానికి ప్రధానమైపోయింది.

ఆంగ్లం, గణితం, భౌతిక శాస్త్రం, జీవ శాస్త్రం, సామాజిక శాస్త్రాల నుండి పాఠాలను లేదా పాఠ్య భాగాలను తొలగిస్తూ ప్రభుత్వం సర్కులర్ విడుదల చేసింది. చరిత్రకు సంబంధించిన పాఠాలను ఉదాహరణగా పరిశీలిద్దాం. సామాజిక శాస్త్రం మూడు విభాగాలుగా ఉంటుంది. చరిత్ర అనే విభాగాన్ని 'మన గతాలు' అని వ్యవహరిస్తున్నారు. ఈ విభాగంలో ఉన్న పది పాఠాల్లో 6వ, 10వ పాఠాలను పూర్తిగా తొలగించారు. మిగిలిన పాఠాల్లో ఇతర దేశాలకు చెందిన చారిత్రక సమాంతరాలను తొలగించారు. తొలగించబడిన 6వ పాఠం 'చేనేత కార్మికులు, ఇనుము శుద్ధి చేయువారు, కర్మాగార యజమానులు' అనే మకుటంతో ఉంది. ఈ పాఠంలో ఆంగ్ల దొరల పాలనా కాలంలో విదేశాల నుంచి ముందుగా నూలు, తరువాత బట్ట

దిగుమతి చేసినప్పుడు ఇక్కడ నేత కార్మికుల పరిస్థితి ఏవిధంగా దిగజారిందో, అలాగే ఇనుమును దిగుమతి చేసినప్పుడు ఆ పరిశ్రమల్లో వృత్తి కార్మికుల, యజమానుల పరిస్థితి ఏమైందో సోదాహరణగా వివరించారు. అంత కంటే ప్రధానంగా ఈ పాఠం 17, 18 శతాబ్దాల్లో భారత్ బ్రిటిష్ వ్యాపారంలో భారత్ మిగుల్లో ఉండేదని, అనంతర కాలంలో బ్రిటిష్‌లో ముందుకొచ్చిన ఆధునిక పరిశ్రమలు దానితో పాటు బ్రిటిష్ ప్రభుత్వం భారత్ నుంచి వచ్చిన సరుకులపై నిషేధాలు విధించటం వల్ల లేదా భారత ఉత్పత్తులపై అధిక సుంకాలు వసూలు చేయటం వల్ల భారత పరిశ్రమలు ఏవిధంగా దివాళా తీసాయో బాలబాలికలకు కళ్ళకు కట్టినట్లు వివరిస్తుంది. అంతేకాక, భారత చేనేత కళాకారుల కళా నైపుణ్యాలను కూడా ఈ పాఠంలో చూపించారు. యూరప్‌లో ధనికులు అక్కడ తయారైన మిల్లు వస్త్రాల కంటే భారత చేనేత పరిశ్రమల్లో తయారైన ప్రత్యేక వస్త్రాలనే ఇష్టపడేవారని, బ్రిటిష్ రాణి కూడా ఇక్కడి నుంచి వస్త్రాలు తెప్పించుకునే వారని ఎత్తి చూపారు. తరువాత కాలంలో ముంబైలో మిల్లు వస్త్రాల తయారీ, గాంధీ విదేశీ వస్త్ర బహిష్కరణ ఉద్యమం వంటి వాటిని ఈ క్రమంతో జోడించారు. ఈ పాఠాన్ని నిజానికి 17నుంచి 20వ శతాబ్దం వరకు భారత ఆర్థికరంగ చరిత్రగా, ఆర్థిక రంగం నుంచి పుట్టుకొచ్చిన రాజకీయాల చరిత్రగా చెప్పవచ్చు. సామాజిక శాస్త్రానికి చెందిన చాలా సంక్లిష్టమైన విషయాలను చాలా సరళంగా బాలబాలికల కొరకు ఈ పాఠం అందిస్తుంది. ఇదే పాఠంలో దక్షిణ భారత దేశంలో కుటీర పరిశ్రమల్లో తయారయ్యే నాణ్యమైన ఊడ్జ్ ఐరన్ గురించి కూడా ఉంది. భారత దేశంలో మాత్రమే తయారయ్యే ఒకానొక ఇనుముకు స్థానిక నామం ఉక్కు. దీన్నే ఆంగ్లేయులు ఊడ్జ్‌గా పలికేవారు. ఆ పేరు దానికి అంతర్జాతీయంగా స్థిరపడిపోయింది, ప్రపంచ వ్యాప్తమైపోయింది. ఈ ఇనుముతో ఎంత బలమైన పదునైన ఖడ్గాలు తయారయ్యేవంటే వాటితో సాధారణ ఖడ్గాలను నిలువునా చీల్చవచ్చు. బ్రిటిష్‌వారిని ఎదిరించిన మైసూరు నవాబు టిప్పు సుల్తాను సైన్యం అటువంటి ఖడ్గాలనే వాడేదని పేర్కొన్నారు. నిజానికిది చాలా విలువైన పాఠం. ఈ పాఠం బాలబాలికలకు భారం కాజాలదు. భారత దేశ ఔన్నత్యాన్ని వారు ఆస్వాదించేటట్లు చేయగలదు. ఈ పాఠాన్ని ఎందుకు తొలగించారో అర్థం చేసుకోవటం కష్టం. మొఘలుల పాలనా కాలంలో దేశం సాధించిన ఆర్థిక విజయాలు బాలలకు తెలియకూడదని, టిప్పు సుల్తాను గొప్ప సైనిక పాటవంతో బ్రిటిష్ వారిని ఎదిరించిన విషయాలు బాలబాలికలకు తెలియకూడదని నేటి పాలకులు భావిస్తుండవచ్చు.

'స్వాతంత్ర్యానంతర భారతదేశం' అనే మకుటంతో ఉన్న మరొక పాఠాన్ని (10వ పాఠం) చరిత్ర విభాగం నుంచి తొలగించారు. ఈ పాఠంలో భారత్ పాకిస్తాన్ విభజనను, నాటి బాధాకరమైన పరిస్థితులను క్లుప్తంగా చెప్తారు. తరువాత గాంధీ హత్య గురించి కూడా క్లుప్తంగా చెప్పారు. అవి చెప్పడం అవసరమే. అదే విధంగా ఆ స్థాయిలో విస్తరించి చెప్పకపోవడం కూడా మంచిదే. సున్నితమైన ఈ విషయాలను చాలా జాగ్రత్తగా రచించారు. ఇంకా ప్రధానంగా, భారత రాజ్యాంగ రూపకల్పనలో జరిగిన రాజ్యాంగ పరిషత్ చర్చలను, అందులో ముఖ్యమైనవాటిని, ఈ పాఠంలో సహేతుకంగా వివరించారు. ఎ) అందరికీ ఓటు హక్కు ఇవ్వటంపై జరిగిన చర్చను, బి) భారత దేశం పాకిస్థాన్ వలే ఒక మత రాజ్యంగా కాక, ఒక సెక్యులర్ రాజ్యంగా ఉండాలన్న దానిపై జరిగిన చర్చను, సి) కేంద్ర, రాష్ట్రాల అధికారాల విభజన గురించిన చర్చను, డి) ప్రభుత్వం, చట్టసభలు, న్యాయవ్యవస్థల మధ్య అధికార విభజన గురించిన చర్చను, ఇ) చారిత్రకంగా వెనుక ఉంచబడిన సామాజిక విభాగాలకు ప్రత్యేక రక్షణ గురించిన చర్చను, ఎఫ్) అధికార భాష విషయమై వచ్చిన భావోద్వేగాలను ఈ పాఠంలో వివరించారు. నేటి పాకిస్థాన్, బాంగ్లాదేశ్‌లు ఒకప్పుడు ఒకే దేశంగా ఉన్న విషయాన్ని, పశ్చిమ పాకిస్థాన్‌లో ప్రాచుర్యంలో ఉన్న ఉర్దూను బాంగ్లా భాష మాట్లాడే తూర్పు పాకిస్థాన్ (స్వాతంత్ర్య పూర్వకాలంలో తూర్పు బెంగాల్, అనంతరం తూర్పు పాకిస్తాన్, 1971నుంచి బాంగ్లాదేశ్) ప్రజలపై బలవంతంగా రుద్దటానికి చేసిన ప్రయత్నం బెడిసికొట్టి ఏ విధంగా అది ఆ దేశ విభజనకు దారితీసిందో" అలాగే శ్రీలంకలో సింహళీ భాషను తమిళ భాషపై రుద్దటానికి చేసిన ప్రయత్నం ఆ దేశాన్ని ఎలా విధ్వంసం చేసిందో వంటి గుణాత్మక ఉదాహరణలు ఒకవైపు' ఆంధ్ర రాష్ట్రం కొరకు మహనీయుడు పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం, 1953లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడడం, 1956లో మరిన్ని భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడడం, భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు వలన నెహ్రూ పటేల్ ఆందోళన చెందినట్లు దేశం బలహీన పడలేదని, మరింతగా అభివృద్ధిచెందిందని కూడా ఈ పాఠంలో వివరించారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు వల్ల విభజన భావోద్వేగాలు పెరగవని, భాషాపరమైన గుర్తింపుకు ప్రాధాన్యత కల్పించటం వల్లే ఐక్యత సాధ్యం అవుతుందనే సామాజిక శాస్త్ర విషయాన్ని ఈ పాఠం సోదాహరణంగా వివరిస్తుంది. ఈ పాఠాన్ని మొత్తానికి మొత్తంగా తొలగించారు. సార్వత్రిక ఓటు హక్కు, అధికార విభజన, రాష్ట్రాల ఫెడరల్ హక్కులు, భాషా సాంస్కృతిక వైవిధ్యాల ఔన్నత్యం, సామాజిక న్యాయం, అన్నింటికంటే మతాతీత లౌకిక రాజ్య భావన నేటి కేంద్ర పాలకులకు పడవు. రాష్ట్రంలో అధికార పార్టీ రాష్ట్ర ప్రయోజనాలకు వ్యతిరేకంగా తన రాజకీయ అవసరాల కొరకు కేంద్రం అడుగుజాడల్లో నడుస్తుంది. పాఠ్యాంశాలను మతోన్మాదంతో, మనువాదంతో నింపుతుంది. వచ్చే ఎన్నికల్లో కూడా కేంద్రంలో మతోన్మాద శక్తులు, రాష్ట్రంలో దానికి ఊడిగం చేసే ప్రభుత్వాలే వస్తే మన రాష్ట్రం అనతి కాలంలోనే మణిపూర్ కాగలదు. విద్యను తిరిగి రాష్ట్ర జాబితాకు మార్చే ఉద్యమం ముందుకు రావాలి. విద్య రాష్ట్ర జాబితాలో ఉండాలి, అలాగే పాఠ్య ప్రణాళిక భారత రాజ్యాంగ విలువలైన స్వేచ్ఛ, సమానత్వం, సౌభాతృత్వం, లౌకకవాదరం, సామ్యవాదం, సామాజిక న్యాయం, ఫెడరిజం వంటి విలువలపై ఆధారపడి ఉండాలి. అ

రచయిత, ఆంధ్రప్రదేశ్ విద్యాపరిరక్షణ కమిటీ కన్వీనర్, అఖిల భారత విద్యాహక్కువేదిక అధ్యక్షవర్గ సభ్యులు. ప్రజా వికాస వేదిక విద్యారంగంపై విజయవాడలో నిర్వహించిన సెమినార్‌లో ప్రసంగం.

"అమ్మా, నీ భాష కావాలి. నిప్పులు చెరగడానికి, చెమటను జల్లెడపట్టి సంపదలను తీయడానికి, తెలుగు పౌరషాగ్నిని రాజేయడానికి నా మాతృభాష కావాలి." –ఛాయరాజ్

వి. బాలసుబ్రమణ్యం
9490098912

# పాఠశాల విద్యారంగం - ప్రస్తుత స్థితిగతులు

ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యారంగం చాలా విస్తృతమైంది. రాష్ట్రంలో ప్రభుత్వరంగంలో 44,372, ప్రైవేటు రంగంలో 13,189, ఎయిడెడ్, కేంద్ర స్కూళ్ళు కలిపి మొత్తం 58,645 పాఠశాలలున్నాయి.

దయనీయ ముఖచిత్రం

ఇన్ని ఉన్నా అక్షరాస్యతలో మనం బీహారు, జార్ఖండ్, తెలంగాణ లాంటి రాష్ట్రాల కంటే మాత్రమే ముందున్నాం. జాతీయ సగటు 74.4% కాగా మనం 67.2% వద్దనే నిలిచిపోయాం. దీనికి ప్రధాన కారణం లక్షలాది మంది పిల్లలు బడికి వచ్చినా నిరక్షరాస్యులుగానే మిగలడం, వీరిలో అత్యధికులు గిరిజనులు, దళితులు. అందరూ బడిలో చేరుతున్నట్టు, డ్రాపవుట్స్ బాగా తగ్గుతున్నట్టు కనిపిస్తున్నా అభ్యసన ప్రమాణాలు ఘోరంగా ఉంటున్నాయి. ఊరి ప్రాథమిక బడి అత్యంత బలహీనంగా వుండటమే దీనికి కారణం.

ప్రాథమిక పాఠవాలల్లో పిల్లలు తగ్గడం, టీచర్లను సర్దుబాటు లేదా, రేషనలైజ్ చేయ్యడం, స్కూళ్ళను విలీనం చేయడం లేదా మూసెయ్యడం లేదా మూత పడటం, తల్లిదండ్రులకు నమ్మకం సడలిపోవడం ప్రస్తుతం రాష్ట్రంలో పెద్ద సమస్య.

కేంద్ర ప్రాయోజిత పథకాలతో, ప్రపంచబ్యాంకు నిధులతో అందుబాటు కోసం ఏ ప్రణాళికా లేకుండా పెట్టిన స్కూళ్ళ ఫలితంగా అన్నీ 20- 30 లోపు పిల్లలకు 1-2 టీచర్లు పాఠశాలలుగా మారాయి. తరగతికి ఒక టీచరు, ఒక గదీ గలవి 10-15 శాతం కూడా లేని పరిస్థితి. ఇవి ప్రైవేటు పాఠశాలలతో ఏ మాత్రం పోటీ పడలేవు సరికాదు గదా కనీస అక్షర జ్ఞానం కూడా అందించలేవు.

స్వాతంత్ర్యానంతరం గ్రామాల్లోని పై కులాల వారు తమ పిల్లలకు చదువు ప్రాధాన్యతను గుర్తించి ఊరి బడికి మద్దతుగా నిలబడ్డారు. భూములే కాదు బిల్డింగులు కూడా సమకూర్చి పర్యవేక్షించుకొన్నారు. ప్రస్తుతం నిరుపేద పిల్లలు మాత్రమే వీటిలో మిగలడంతో వీటికి సామాజిక మద్దతు, రక్షణ, పర్యావేక్షణ కరువైంది. ఆలనా పాలనా లేని ఒంటరి వ్యవస్థలుగా ఇవి మారాయి.

**దార్శనికత కరువు**

మనకు ఒక దార్శనికత, దృక్పథం, వాటికి దగ్గ ప్రణాళిక లేకపోవడం వల్ల పరిస్థితి ఇలా దయనీయంగా మారింది. కేరళ, తమిళనాడు లాంటి రాష్ట్రాలు దీనికి భిన్నంగా బలమైన వ్యవస్థ కోసం ప్రణాళికలు రచించుకొన్నాయి. కేంద్ర పథకాల్ని వాడుకొన్నాయి. తరగతికి ఒక్క గదీ, ఒక్క టీచరూలేని ప్రాథమిక పాఠశాల కేరళలో ఒకటి కూడా లేకపోవడం గమనార్హం.

కేంద్ర ప్రాజెక్టులు (సర్వ శిక్షాభియాన్ లాంటివి) నిర్దిష్ట కాలంలో, నిర్దిష్ట ఫలితాల్ని ఆశించి నడుస్తున్నవి. వ్యవస్థాగత, సామాజిక పరమైన స్థితిగతుల్ని అంచనా వేయలేనివి. పైగా ఇవి విద్యాశాఖకు సమాంతరంగా నడుస్తూ, కొత్తకొత్త బోధనా విద్యా విధానాలనూ, పర్యవేక్షణా పద్ధతులనూ ప్రవేశపెడుతూ ఒక స్థిరమైన అకడమిక్ విధానం కూడా లేకుండా చేశాయి. విద్యాశాఖకు లోబడి, దాన్ని బలోపేతం చేసేలా ఉండాల్సిన ప్రాజెక్టులు పుష్కలంగా లభిస్తున్న నిధులతో పెత్తనం చేస్తూ సమాంతర వ్యవస్థలుగా మారి పాఠశాల విద్యారంగాన్ని నిర్వీర్యం చేశాయి. ఇది రాష్ట్ర ప్రభుత్వ విధానాలు ఫలితం.

**బడ్జెట్ స్కూళ్ళ నుంచి కార్పోరేట్ స్కూళ్ళ వైపు**

ఒక వైపు పాఠశాల విద్య పట్ల కనీస రాజకీయ దృక్పథం కరువుగావడంతో పాటు నూతనార్థిక విధానాలు తీసుకొచ్చాయి. దీంతో మార్కెట్ శక్తులు ప్రవేశించాయి. వీటికి మహారాజ పోషకులుగా ఒక ఉన్నత, మధ్య తరగతి వర్గం అవతరించింది. క్రమంగా దేశంలో ఎక్కడా లేనట్టు ఆంధ్రప్రదేశ్‌లో ప్రైవేటు విద్య కార్పొరేట్ విద్యగా కూడా మారి రెండే రెండు బడా యాజమాన్యాల చేతిలో బందీ అయింది. పేదలకు చదువు పట్ల ఆకాంక్షలు పెరగడంతో బడ్జెట్ స్కూళ్ళు వెలిశాయి. వెరసి దాదాపు 50 శాతం విద్యార్థులు వీటినిప్పుడు ఆశ్రయించారు. ప్రైవేటు విద్యా రంగంలోకి ప్రవహిస్తున్న పెట్టుబడులు, వాటి లాభాలు, ఫలితంగా గ్రామీణ, పట్టణ పేదలపైనేగాక దిగువ, మధ్య తరగతి వర్గంతో సహా ఆర్థికంగా కుదేలు కావటం ఒక డాక్టరేట్‌కు సరిపోయేంత అంశం. క్రమంగా ఈ శక్తులు రాజకీయాల్లోకీ ప్రవేశించాయి. ప్రభుత్వ విధానాల్ని శాసించే స్థాయికి చేరుకొన్నాయి. విద్యారంగంలోకి కృతాక బోధనా విధానాలను, పరీక్షాధారిత అభ్యసనాలను, వల్లింపుల ప్రహసనాన్ని ప్రైవేటు సంస్థలు తీసుకొచ్చాయి. విలువలను, శాస్త్రీయ పద్ధతులను కాలరాసి చదువుల్ని సార హీనంగా, సరుకుగా మార్చాయి. విజ్ఞాన శాస్త్రాలకు, సామాజిక శాస్త్రాలకు వీడ్కోలు చెప్పాయి. 'మాతృభాషలో విద్య' అనే ప్రాథమిక శాస్త్రీయతను కాలం చెల్లినదిగా మార్చి ఒక సామాజికామోదాన్ని పొందగల్గాయి. అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ దీనిపై చేసిన అధ్యయనంలో వాస్తవానికి గణితంలాంటి సబ్జెక్టుల్లో ప్రైవేటు విద్యార్థులు ప్రభుత్వ విద్యార్థుల కంటే వెనుకబడి ఉన్నారని నిర్ధారించింది. ప్రైవేటు విద్య మెరుగ్గా ఉన్నట్లు కనిపించడానికి ఆ పిల్లల సామాజికార్థిక నేపథ్యం తప్ప ఆ పాఠశాలల గొప్పదనం ఏమి లేదని కుండలు బద్దలు కొట్టింది. క్రమంగా ఇంటర్నేషనల్ స్కూళ్ళు కూడా వస్తున్నాయి. వ్యక్తిత్వం, విలువలూ ఏమీ అవసరం లేని మార్కెట్ సరుకుగా మన భావితరాల్ని తయారు చేయటం ఆర్థిక దోపిడి కంటే ఇవి తెస్తున్న తీవ్ర నష్టం.

**అసమానతలు - నిధుల కరువు**

దీనితో రాష్ట్రంలో తీవ్రమైన అసమానతలు విద్యారంగంలోకి ప్రవేశించాయి. నిజానికి సామాజిక అసమానతల్ని విద్య తగ్గించాలి. ఒక విముక్తికి దారీ చూపాలి. అలాంటిది చదువులే అన్ని అసమానతల్ని పెంచి, వాటిని స్థిరీకరించే దౌర్భాగ్యం ఏర్పడిరది. ఇదంతా అమాయకంగా, అనుకోకుండా దానికదిగా తోసుకొచ్చె పరిణామమే

కాదు. రాజకీయ విధానాల ఫలితంగానే ఇలా జరిగింది. ఇలాంటి అస్తవ్యస్త ఎగుడు దిగుడు సమాజాన్నే మన పాలకులు కొరుకొంటున్నారు. దానికి తగ్గ విద్యకే వారు పట్టం గడుతున్నారు. బాధాకరం ఏమంటే మన రాష్ట్రంలో ఇది మరీ విస్తృతంగా వుండటం.

రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడూ 10 నుండి 13 శాతానికి మించి విద్య కోసం బడ్జెటులో కేటాయించింది లేదు. రిజర్వుబ్యాంకు లెక్కలు ప్రకారం మన దేశంలో రాష్ట్రాల బడ్జెట్‌లలో సగటు 15.5 శాతం విద్యకు కేటాయింపులున్నాయి. న్యాయానికి 20 శాతం కేటాయింపులుండాలి. ఈ కొద్ది శాతానికే రాష్ట్రం భూమ్యాకాశాలు దద్దరిల్లేలా విద్యారంగానికే ఆకాశమంత పీటవేస్తున్నట్లు ఆర్భాటం చేస్తోంది.

**ఒక్కో వ్యవస్థ నిర్వీర్యం**

ఒకప్పుడు గురుకుల విద్యకు ఆంధ్రప్రదేశ్ ఎంతో ఆదర్శంగా ఉండేది. పేద పిల్లకు ఇవి మంచి విద్యనందించేవి. క్రమంగా పోస్టులు భర్తీ చేయకుండా వీటిని నిర్వీర్యం చేశారు. ఇంగ్లీషు మీడియం కూడా వాటిని డొల్లగా మార్చింది. ప్రస్తుతం అరకొర రెగ్యులర్ స్టాఫ్‌తో నిరుపేదలు మాత్రం మిగిలి ఇవి కునారిల్లుతున్నాయి. హాస్టళ్ళు కూడా పనిగట్టుకొని రెండు వందలు మూసేశారు. మిగిలినవి కాలానికి తగినట్టు లేక వెలవెల పోతున్నాయి.

ప్రభుత్వరంగంలోనే పలు రకాల వ్యవస్థలు, తారతమ్య విధానాలు ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకం. ప్రభుత్వ, పంచాయితీ రాజ్, మున్సిపల్ పాఠశాలలు నేరుగా విద్యాశాఖ కింది నడుస్తున్న పాఠశాలలు. ఇది పెద్ద వ్యవస్థ. గురు కులాలు వాటికి తోడు ఉండనే వున్నాయి. ఇదిగాక మోడల్ హైస్కూళ్ళు, కస్తూర్బా విద్యాలయాలు, కేంద్ర నిధులలో ఏర్పడ్డాయి. కేంద్రం కొత్తగా 'ఏకలవ్య' పాఠశాలల్ని పెట్టడంతో గిరిజన గురు కులాలు ప్రశ్నార్థకం కానున్నాయి. ఇన్ని వ్యవస్థలు ఎందుకవసరమో, వీటిని ఒక గొడుగుకిందకు తీసుకొని రాలేదో ప్రభుత్వం ఆలోచించడం లేదు.

ఆంధ్రప్రదేశ్ వేగంగా పట్టణీకరణ జరుగుతున్న రాష్ట్రం. పట్టణ పేదరికం కూడా అంతే వేగంగా పెరుగుతోంది. కేవలం పిల్లల చదువులకోసమే ఎంతో మంది పట్టణాల బాట పడుతున్నారు. కానీ పట్టణాలలో స్కూళ్ళ సంఖ్య పెరగడం లేదు. టీచర్లు పెరగడంలేదు. పాతికేళ్ళ కిందటి వ్యవస్థే నడుస్తోంది, దీనితో ఉన్న స్కూళ్ళు కిటకిటలాడటం, ఎక్కువ మంది సర్వం వొడ్డి ప్రైవేటుకు పంపడం జరుగుతోంది. ప్రైవేటు స్కూళ్ళు ఇక్కడే కేంద్రికరించి వున్నందువల్ల ఉద్దేశ్యపూర్వకంగానే ప్రభుత్వం పట్టణ విద్యను నీరు గారుస్తోంది.

**చదువుకొన్న నిరక్షరాస్యులు**

ఈ మధ్య కొత్తగా వినబడుతున్న పదం 'పాఠశాల నిరక్షరాస్యత' (School illatericy) ఏ సర్వే ఏ అధ్యయనం ప్రకారం చూసినా మన పిల్లల అభ్యసన ప్రమాణాలు ఘోరంగా ఉన్నాయి. ఈ మధ్య 'తొలిమెట్టు' (ఎఫ్.ఎల్.ఎన్) సర్వే చేశారు. అంటే చిన్న పిల్లల అభ్యసనం గురించి నిమిషానికి తెలుగులో ఒక్క పదమూ చదవలేని వారు 19 శాతం తేలారు. మొత్తం 52 శాతం పిల్లలకు కనీస భాషాసామర్థ్యాలు లేవు. ఇలా ఎందుకు జరుగుతుందో ప్రభుత్వం పరిశీలించడం లేదు. ప్రాణం లేని బడి, ఆంగ్ల మాధ్యమం, సవాలక్ష ప్రయోగాలు దీనికి కారణాలని నేరుగా చెప్పనక్కరలేదు.

దీంతో విద్యార్థులు ప్రైవేటు బాట బడుతున్నారు. పేదలు మాత్రం మిగిలిపోతున్నారు. వారినీ బడి మానకుండా పదవ తరగతి దాటి లాక్కొచ్చే మార్గాల్ని వెతుకుతున్నారు. పది పరీక్షల్లో కూడా గట్టెక్కిస్తున్నారు. వారంతా చదువుకొన్న నిరక్షరాస్యులు. పై తరగతులకు వేటికీ పనికి రానివారు. ఇదొక పెద్ద ప్రహసనం, దుర్మార్గం.

దేశ వ్యాప్తంగా ఎయిడెడ్ విద్యానంస్థలు పేదల విద్యాభివృద్ధిలో గొప్ప పాత్ర పోషించాయి. విద్యారంగంలో ముందున్న తమిళనాడు, కేరళ, మహారాష్ట్ర లాంటి రాష్ట్రాల్లో నేటికీ ఈ వ్యవస్థ చెక్కుచెదరకుండా వుంది. ప్రభుత్వాలు అలా ప్రోత్సహిస్తున్నాయి. కానీ మన ప్రభుత్వం ప్రపంచబ్యాంకుతో ఒప్పందం కుదుర్చుకొని వీటి పోస్టుల భర్తీ నిలిపి వేసింది. దీంతో ఇవి శల్యావశిష్టాలయ్యాయి. ఇటీవల వీటికి పూర్తిగా మంగళం పాడడంతో గొప్ప విద్యా సంస్థలు మూలబడ్డాయి. లేదా వ్యాపారసంస్థలుగా మారాయి. పేదపిల్లలు అన్యాయమయ్యారు.

**పథకాలూ – ప్రయోగాలూ**

ఈ దశలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. వచ్చీరాగానే విద్యారంగం తమ ప్రధాన అజెండా అంటూ బాలకృష్ణన్ కమిటీని నియమించింది. అది ప్రైవేటు విద్య పతాకస్థాయికి చేరుకొందనీ, అసమానతలు విద్యారంగంలో పెరిగిపోవడం దారుణమనీ, ప్రభుత్వ విద్యారంగాన్ని పటిష్టం చేయాలనీ, బడ్జెటును బాగా పెంచాలనీ సిఫార్సులు చేసింది. ఇవేవీ ప్రభుత్వం కోరుకొన్నవి కాకపోవడంతో బాలకృష్ణ కమిటీ సిఫార్సులు బుట్టదాఖలయ్యాయి.

వెంటనే ఎస్.ఎ.ఎల్.టి (Strengthening, Teaching Learning and Results for Study) పేర ప్రపంచబ్యాంకుతో ఒక ఒప్పందం చేసుకొంది. అది శిశు విద్య కోసం గిరిజన ప్రాంతాల్లో కేంద్రాలు ప్రారంభించడం, పాఠశాలల్లో బోధన, పర్యవేక్షణ, నిర్వహణ, మూల్యాంకనం, తదితరాలన్నింటిలోకి సాంకేతిక విజ్ఞానాన్ని చొప్పించడం, బాలికా విద్య, అంతరాలు తగ్గించడం లాంటి లక్ష్యాలు వల్లించడంలో సరిపెట్టుకోక టీచర్ల జీతాలు భారంగా మారుతున్నాయని హెచ్చరించింది. గత ప్రపంచ బ్యాంకు ప్రాజెక్టులు వ్యవస్థను ఎలా కుదేలయ్యేలా చేసిందీ రాష్ట్ర ప్రభుత్వం చూడ నిరాకరించి దీన్ని నెత్తిన పెట్టుకొంది. దేశంలో కేరళ లాంటి రాష్ట్రాల్లో పెద్దఎత్తున పాఠశాలల్ని ఆధునీకరించడం కార్పొరేట్ చదువులకు సవాలు విసిరేలా ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడం జరుగుతోంది. వీటికి గొప్ప ప్రచారం, రాజకీయ ఫలితాలు లభించాయి. వీటిని చూశాక కాబోలు రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లోకి కొత్త కొత్త పథకాలు, ప్రయోగాలు చొప్పిస్తోంది. కానీ ఇవేవీ ఆ రాష్ట్రాల్లో లాగా ప్రభుత్వ విద్యావ్యవస్థను సువ్యవస్థీకృతం చేసేవిగావు. అన్నీ ప్రజాకర్షక పథకాలు. కొన్ని వ్యవస్థను మరింత కుంగదీసేవి కూడా.

నిర్బంధ ఆంగ్ల మాధ్యమం ఇలానే వచ్చింది. తెలుగు మీడియం కూడా ఉండాలన్న వారిపై పేదల వ్యతిరేకులంటూ సాక్షాత్తు ముఖ్యమంత్రి గారే దాడిచేశారు. పేద గ్రామీణ, గిరిజన పిల్లల పాలిట ఇది శాపంగా మారింది. అమ్మఒడి తల్లిదండ్రులకు ఇచ్చే సపోర్టుగా

ప్రభుత్వం చెప్పుకుంటోంది. కానీ అది పిల్లల్ని ప్రైవేటు స్కూళ్ళకు పంపడానికే ఎక్కువ దోహదపడిరది. గోరుముద్ద, విద్యాదీవెన లాంటివి కొంత పిల్లలకు ఉపయోగపడివుండొచ్చు. నాడు-నేడు పాఠశాలలు అందంగా అనిపిస్తుండొచ్చు కానీ తరగతి గదిలో పిల్లలకు ఏమి దక్కుతోందన్నది అసలు విషయం.

ఇవిగాక బైజూస్ పాఠాలు, వాటి కోసం ట్యాబులు తెచ్చారు. మూడో తరగతి నుంచే 'టోఫెల్' కు సిద్ధం చేస్తున్నారు. తరగతి గదుల్లో డిజిటల్ పరికరాలు వెల్లువెత్తుతున్నాయి. చికాగో విశ్వవిద్యాలయం సహకారంతో పి.ఒ.ఎల్,(Personalize objective) కేంబ్రిడ్జి నుండి దిగుమతి అయ్యాయి. త్వరలో అంతర్జాతీయ ఎడ్యుటెక్ సంస్థలు కూడా రంగప్రవేశం చెయ్యనున్నాయి. దాదాపు 1000కి పైగా హైస్కూళ్ళు, సి.బి.ఎస్.సి బోర్డుకు అనుసంధానమయ్యాయి. మిగిలిన పాఠశాలల్లో కూడా సి.బి.ఎస్.సి పాఠ్యాంశాలే బోధించడం మొదలైంది. విద్యారంగానికి సంబంధించిన ప్రతిదీ సమాచార సాంకేతికం చేతిలోకి వెళ్ళిపోయింది. నిఘా పర్యవేక్షణ కూడా ఈ రూపంలోనే సాగుతోంది.

**అసలు లక్ష్యం కుదించడం**

ఈ సంస్కరణలకు మరోకోణం కూడా వుంది. అది మొత్తం వ్యవస్థను కుదించటం. దీనికోసం 117 జీవో, 6 రకాల స్కూళ్ళు, విలీనాలు, పిల్లల తరలింపులు భారీ ఎత్తున మొదలయ్యాయి. ఫలితంగా మొత్తం వ్యవస్థ అస్తవ్యస్తమైపోయింది. ఏబడి ఎన్నాళ్ళు ఉంటుందో, ఏబడిలో ఎందరు టీచర్లు, ఎన్ని తరగతులు వుంటాయో తెలియని గందరగోళం ఏర్పడిరది. దీనితో తల్లిదండ్రులకు ఊరి బడినీ ఉనికి మీదనే నమ్మకం సడలిపోయింది. దీనితో గతంలో ఏప్పుడు లేనంతగా పిల్లలు ప్రభుత్వ స్కూళ్ళలో తగ్గిపోయారు! ఎన్ని నష్ట నివారణ చర్యలు పైపైన చేసినా మొత్తం వ్యవస్థే కుదేలయిపోయింది.

దీనికి తోడు టీచర్ల నియామకాలు నిలిపేశారు. అందుబాటులోని టీచర్లను సర్దుబాటు చేసి సరిపెడుతున్నారు. దీనితో ఏకంగా 12,623 ప్రాథమిక పాఠశాలల్లో ఒక టీచరే మిగిలారు. కొన్ని కేవలం కాంట్రాక్టు టీచర్ల తోనే నడుస్తున్నాయి. 3,4,5 తరగతుల తరలింపు ఫలితంగా కనీసం 5 మంది పిల్లలు కూడా లేని ప్రాథమిక పాఠశాలలు ఇబ్బడి ముబ్బడిగా పెరిగి పోయాయి. ఇవన్నీ మూతపడ్డానికి సిద్ధంగా ఉన్నాయి. ప్రభుత్వం 'మేము ఒక్క బడి మూసెయ్యం' అంటోంది గానీ మూతబడేలా మాత్రం పథకం ప్రకారం చేస్తోంది. దీనివల్ల నష్టపోయింది పేదపిల్లలు, ఒక వైపు బడి దూరమైంది. మరో వైపు ప్రైవేటు విద్య భారమైంది. ఇష్టంవచ్చినట్లు నిర్ధాక్ష్యణంగా ఒకబడి నుండి మరో బడికి లక్షలాది మందిని తరలించడం ప్రాజెక్టుల నిర్మాణ కాలంలో నిర్వాసితులకు మాత్రమే ఇప్పటిదాక అనుభవం! ఈ దయనీయత మన గ్రామీణ పేద పసిపిల్లలకు గత రెండేళ్ళలో ఏ రాష్ట్రంలో ఏ దేశంలో లేనట్లు దాపురించింది. ఇంత మొరటుగా ఆ ప్రజాస్వామికంగా వ్యవహరించిన ప్రభుత్వాన్ని ఇప్పటి దాకా మనం చూడలేదు.

ఒకవైపు కోవిడ్ నష్టం ఇంకా వెంటాడుతోంది. రెండేళ్ళు చదువుల్ని పిల్లలు పోగొట్టుకోవడంతో ప్రమాణాలు అడుగంటిన సందర్భమిది. ఇదే కాలంలో బడి మూతలు, తరలింపులు మాటలకందని విషాదాన్ని మిగిలించాయి.!

ఇదంతా ప్రభుత్వానికి తెలియనిది, ఊహించనిది అనుకోలేము. సాల్ట్ ఒప్పందంలోనే టీచర్ల తగ్గింపు వుంది. నూతన విద్యా విధానంలోనూ 'చిన్న స్కూళ్ళు' కుదింపు ఉంది. ప్రభుత్వ లక్ష్యం కూడా స్పష్టంగా ఇదే! కాకుంటే పాపులర్ పథకాల మాటున ప్రచారార్భటాల చాటున ఇదంతా జరుగుతోంది.

**నూతన విద్యావిధానానికి స్వాగతం**

ఇదే తరుణంలో నూతన విద్యావిధానం వచ్చింది.రాష్ట్ర ప్రభుత్వం దేశంలో బి.జె.పి రాష్ట్రాలు సైతం వెనకాడుతున్నా దీన్ని నెత్తిన పెట్టుకొవడంలో అగ్ర భాగాన వుంది. దీన్ని మాటమాటికీ సగర్వంగా చూపుతోంది. కేంద్ర విద్యాశాఖ పాఠ్యాంశాల్లో తెస్తున్న దుర్మార్గమైన మార్పుల్ని దేశమంతా వ్యతిరేకిస్తుంటే మనరాష్ట్రం మాత్రం రాష్ట్ర సిలబసుకు పాఠ్య గ్రంథాలకు స్వస్తి చెప్పి మొత్తం ఎన్.సి.ఆర్.టి పాఠ్య గ్రంథాలనే దిగుమతి చేసుకొంది. దాదాపు రాష్ట్ర విద్యా పరిశోధనా శిక్షణా సంస్థ ప్రాణం లేనిదిగా మిగిలేలా చేసింది. త్వరలో పరీక్షలు కూడా రాష్ట్రం పరిధిని దాటిపోతున్నాయి. సంస్కృతాన్ని మొదటి భాషగానూ, మూడో భాషగానూ ప్రవేశ పెట్టడం దేనికి? ఇందులో అకడమిక్ కోసం కంటే రాజకీయం కోసమే కీలకమైంది. ఉన్నత విద్యారంగంలో ఈ ధోరణి మరింత తీవ్రంగా కన్పిస్తోంది.

**ఒకవైపు దాపరికాలు మరోవైపు బుకాయింపులు**

తన ప్రయోగాలు వికటించాయని ప్రభుత్వం పసిగట్టింది. పిల్లలు తగ్గిపోవడం, బడులు ప్రాణంలేనివిగా మారడం, ప్రమాణాలు అడుగంటడం కళ్ళ ముందు కన్పిస్తున్న వాస్తవాలు. దీంతో విద్యాశాఖ గణాంకాలేవీ అందుబాటులో లేకుండా చేసింది. టీచర్లకు సవాలక్ష పనులు చెప్పి, చదువులు తప్ప బడిలో అన్నీవున్నాయనిపించేలా చేశారని లోకమంతా కోడైకూయడంతో ప్రభుత్వమే లెక్కల్ని తారుమారు చేసి, మాయచేసి చెపుతోంది. మొత్తం పిల్లల సంఖ్యను అమాంతం పెంచడానికి ఎప్పుడూ లేనట్లు ఇంటర్మీడియేట్ పిల్లల్ని చేర్చి 82 లక్షలుగా చూపడం దీనికి ఉదాహరణ. జననాలు తగ్గిపోయాయని మరో వాదం ముందుకు తెస్తోంది. మరి ప్రైవేటు స్కూళ్ళలో పిల్లలెలా పెరుగుతున్నట్టు? ఒకవైపు 2.29 లక్షల మంది పిల్లలు బడిలో లేరంటూనే, 2023-24 సంవత్సరంలో 62,474 మంది చనిపోయారని తమ జి.ఇ.ఆర్ సర్వేలో తేలినట్టు చెపుతున్నారు. ఉన్నట్టుండి ఈ సంవత్సరమే ఇందరు బడి యీడు పిల్లలు మరణించారా?

మొత్తం పాఠశాల విద్యారంగంలోకి ఒకవైపు వివిధ పథకాల కోసం నాలుగేళ్ళలో 68,607 కోట్ల అదనంగా వ్యయం చేశామని ప్రభుత్వం చెపుతుండగా, ఒక్క సంవత్సరమే 3.50 లక్షల మంది పిల్లలు ప్రభుత్వ పాఠ్యశాలల నుంచి వెళ్ళిపోవడం, మూడవ వంతు ప్రాథమిక పాఠశాలల్లో ఒకే టీచరే మిగలడం కళ్ళ ముందు కన్పిస్తున్న వాస్తవం. పాఠశాలల విలీనం 4,752కు మించి సాగలేదు. దీంతోనే తలబొప్పి గట్టినట్టయింది. ఏది ఏమైనా నాసిరకం చదువులు, విపరీతంగా ప్రైవేటుపరంగావడం, నూతన విద్యావిధానాల్ని హత్తుకోవడం, ప్రభుత్వ విద్యా వ్యవస్థ నిర్వీర్యంగావడం, పేదలకు పేద చదువు అనేవి ప్రస్తుత పాఠశాల విద్యా లక్షణాలు, వాటిని మరింత వేగిరం చెయ్యడం తప్ప నేటి ప్రభుత్వం చేస్తున్నది ఏమీ లేదు. ఇదేదో యాదృచ్ఛికంగా గాక ప్రణాళికా బద్ధంగానే, విధానపరంగానే జరుగుతుంది.

దీన్నిలానే అర్థం చేసుకోవడం, బడిచుట్టూ ఒక సామాజిక కార్యాచరణకు పూనుకోడం ప్రజాస్వామిక శక్తుల తక్షణ కర్తవ్యం. ఇలాంటి ఆచరణ, ఒత్తిడి పెట్టగల సంస్థల నిర్మాణం, ఇప్పటికే ఈ పనిచేస్తున్న వారి మధ్య పరస్పర సహకారం దీనికి కీలకమైనది.

అ

ప్రసంగ పాఠం

కె.ఎస్.లక్ష్మణరావు
8309965083

# ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యారంగం - పరిణామాలు.

భారతదేశంలో ఆర్థిక సంస్కరణలు తరువాత ఉన్నత విద్యారంగంలో అనేక పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఉన్నత విద్యారంగం పెద్ద ఎత్తున ప్రైవేటీకరణ జరిగినది. 2022 నాటికి దేశంలో గల 950 యూనివర్శిటీలలో 51% ప్రైవేట్, డీమ్డ్ యూనివర్శిటీలే. విద్యార్థి నమోదు నిష్పత్తి (జి.ఇ.ఆర్) 26% ఉన్నప్పటికి చైనా, జర్మనీ, ఫ్రాన్స్ వంటి దేశాలతో పోల్చినప్పుడు చాలా తక్కువగా ఉన్నది. స్థూల నమోదు నిష్పత్తి దళితులలో 18.5% గిరిజనులలో 13.3% మాత్రమే ఉన్నది. రాష్ట్రాల మధ్య కూడా చాలా తేడాలు ఉన్నాయి. ఉన్నత విద్యలో విస్తరణ %తత% నాణ్యత %తత% సామాజిక న్యాయం మధ్య సమతుల్యత ఉండాలి.

**ఆంధ్రప్రదేశ్ - విశ్వవిద్యాలయాలు**

రాష్ట్ర విభజన తరువాత ఆంధ్రప్రదేశ్‌లో 17 ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు ఉన్నాయి. వీటిలో ఆంధ్రా యూనివర్శిటీ 1926లో ఏర్పడి మరో మూడేళ్ళలో శతాబ్ది ఉత్సవాలు జరుపుకోబోతున్నది. జిల్లాకి ఒక యూనివర్శిటీ ఉండాలినే నేపథ్యంలో యోగివేమన, నన్నయ్య, విక్రమ సింహపురి, రాయలసీమ వంటి యూనివర్శిటీలు ఏర్పాడ్డాయి. ఈ యూనివర్శిటీల్లో గత 15 ఏళ్ళుగా రిక్రూట్‌మెంట్ లేకపోవటంతో 'అకడమిక్' క్షీణత ప్రారంభమైనది. ప్రొఫెసర్లు, అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లు ప్రస్తుతం 4 వేలకు పైగా ఖాళీలు ఉన్నాయి. కొన్ని చోట్ల కాంట్రాక్ట్, గెస్ట్ ఫాకల్టీ పద్ధతిలో అధ్యాపకులు పనిచేస్తున్నారు. విశ్వవిద్యాలయాల నిర్వహణ లోపభూయిష్టంగా ఉన్నది. వైస్ చాన్సలర్స్, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్స్ నియామకం పూర్తి రాజకీయ కోణంలోనే జరుగుతూ 'అకడమిక్' నిపుణతకు ప్రాధాన్యత లేకుండా పోయినది.

**ప్రైవేట్ యూనివర్సిటీలు**

రాష్ట్రంలో బ్రౌన్‌ఫీల్డ్ యూనివర్శిటీల పేరుతో గీతం, కోనేరు లక్ష్మయ్య, విజ్ఞాన్, విట్, ఎస్.ఆర్.ఎమ్.టి, అమృత, మోహన్‌బాబు, అపోలో మొదలైన ప్రైవేట్, డీమ్డ్ యూనివర్శిటీలు పనిచేస్తున్నాయి. ఈ యూనివర్శిటీలలో టెక్నాలజీ కోర్సులు మాత్రమే ఉంటాయి. రిజర్వేషన్లు ఉండవు. ఫీజులపై, చేర్చుకునే విద్యార్థుల సంఖ్యపై పరిమితి లేదు. ప్రభుత్వ నియంత్రణ లేదు. రాష్ట్రంలో గల 280 ఇంజనీరింగ్ కాలేజీలు 200 ఎమ్.బి.ఏ, ఎం.సి.ఏ కాలేజీలు, 150 బి ఫార్మసీ కళాశాలలలో 90% ప్రైవేట్ కాలేజీలే. వీటిలో విద్యా ప్రమణాలపై తనిఖీ యంత్రాంగం లేదు.

**ఉన్నత విద్యామండలి పనితీరు**

రాష్ట్రంలో ఉన్నత విద్యారంగ కార్యకలాపాలు సమన్వయపరచటానికి, పర్యవేక్షించటానికి ఉన్నత విద్యామండలి ఏర్పడి పనిచేస్తున్నది. విద్యారంగ నిపుణులతో చర్చించకుండా, ఉన్నత విద్యామండలి చేస్తున్న ఏకపక్ష నిర్ణయాలు విద్యార్థులకు నష్టాన్ని కలుగచేస్తున్నాయి. యూనివర్శిటీలలో ప్రవేశాలకు నిర్వహిస్తున్న కామన్ ఎంట్రెన్స్, డిగ్రీ కళాశాలలలో ప్రవేశాలకు నిర్వహిస్తున్న 'ఆన్‌లైన్ అడ్మిషన్ల' విధానం వలన పేదవిద్యార్థులు నష్టపోతున్నారు. ఇటీవల ఉన్నత విద్యామండలి ఏకపక్షంగా, ఎటువంటి సంసిద్ధత లేకుండా డిగ్రీని 4 ఏళ్ల ఆనర్స్ కోర్సుగా చేయటమే కాకుండా, మూడు సబ్జెక్టుల విధానం రద్దుచేసి, మేజర్/ మైనర్ సబ్జెక్టుల విధానం ప్రవేశపెట్టినది. అడ్మిషన్లు బాగా తగ్గిపోయాయి. ఉన్నత విద్యామండలి ధోరణి, పనితీరు పూర్తిగా మారాలి.

**ప్రాధాన్యత కోల్పోతున్న శాస్త్రాలు**

ఉన్నతవిద్య ద్వారా సమాజానికి అవసరమైన అన్ని శాస్త్రాలకు ప్రాధాన్యత యివ్వాలి. ప్రస్తుత పరిస్థితుల్లో ఆంధ్రప్రదేశ్‌లో సామాజిక శాస్త్రాలు, మానవీయ శాస్త్రాలు, జీవ శాస్త్రాలు ప్రాధాన్యత కోల్పోయాయి. కేవలం టెక్నాలజీ కోర్సులకే ప్రాధాన్యతనిస్తున్నారు. ప్రభుత్వాలు కూడా ఈ ధోరణిని ప్రోత్సహిస్తున్నాయి. మానవులు కేవలం సాంకేతిక నిపుణులు, వస్తువుల ఉత్పత్తిదార్లు మాత్రమే కాదు. మానవులు చరిత్రను సృష్టించే సామాజిక, చారిత్రక జీవులు కూడా. మానవ సమాజంలోని విలువలు, నాగరికత, సామాజిక సంబంధాల పట్ల మనిషికి అవగాహన అవసరం. ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధతో విశ్వవిద్యాలయాలలో అన్ని శాస్త్రాలు అధ్యయనం చేసే విధంగా చర్యలు చేపట్టాలి.

**ప్రమాణాలు కోల్పోతున్న డిగ్రీ కళాశాలలు**

రాష్ట్రంలో 1353 డిగ్రీ కాలేజీల్లో 1080 ప్రైవేట్ డిగ్రీ కాలేజీలే. 152 ప్రభుత్వ డిగ్రీ కాలేజీలు ఉండగా అందులో 50 ఎయిడెడ్ డిగ్రీ కాలేజీలుగా ఉన్నాయి. రాష్ట్రంలో ఎంతో చరిత్ర కలిగిన ఎయిడెడ్ డిగ్రీ కాలేజీలు ప్రభుత్వాలు అనుసరించిన విధానం ఫలితంగా గత 2 సంవత్సరాలలో అన్ - ఎయిడెడ్ కాలేజీలుగా 70 కాలేజీలు మారాయి. మిగిలిన 50 ఎయిడెడ్ డిగ్రీ కాలేజీలలో కొద్ది సంఖ్యలో మాత్రమే ఎయిడెడ్ సిబ్బంది ఉన్నారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీలలో కాంట్రాక్ట్ అధ్యాపకులు పనిచేయటం, తగిన మౌలిక వసతులు లేకపోవడం వలన చేరే విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గిపోతున్నది.

**ఫీజు రీఎంబర్స్‌మెంట్ సమస్యలు**

పేదవిద్యార్థులు, ముఖ్యంగా దళిత, గిరిజన, బి.సి. విద్యార్థులు ఫీజు రీ ఎంబర్స్‌మెంట్ సమస్యలు ఎదుర్కొంటున్నారు. జీవో నెం. 77 జారీచేసి డిగ్రీ తరువాత పి.జి. కోర్సులు ప్రైవేట్ సంస్థలలో చేస్తే ఫీజు రీ ఎంబర్స్‌మెంట్ ఉండదు అని ప్రకటించటంతో వేలాది మంది విద్యార్థులు నష్టపోతున్నారు. జీ.వో. నెం 77 రద్దు చేసి పేద విద్యార్థులకు న్యాయం చేయవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నది.

ఆంధ్రప్రదేశ్ విశ్వవిద్యాలయాలలో ఖాళీలన్నింటిని భర్తీ చేయాలి. యూనివర్శిటీలలో విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు ప్రత్యేక శిక్షణ యివ్వాలి. ప్రైవేట్ యూనివర్శిటీలపై నియంత్రణ యంత్రాంగాన్ని ఏర్పరచాలి. డిగ్రీ కళాశాలలను పటిష్ట పరచాలి. జీ.వో.నెం 77 రద్దుచేయాలి. సామాజిక, మానవీయ, జీవ శాస్త్రాలకు ప్రాధాన్యత కల్పించే విధంగా చర్యలు చేపట్టాలి. ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలలో ప్రమాణాలు మెరుగుపరచాలి.

రచయిత విద్యారంగ నేత, ఆంధ్రప్రదేశ్ శాసనమండలి పూర్వ సభ్యులు. విజయవాడలో విద్యావికాస వేదిక నిర్వహించిన సెమినార్‌లో ప్రసంగం.

ప్రసంగ పాఠం

గుంటుపల్లి శ్రీనివాస్
9394810088

# ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు తగ్గటానికి కారణమేమిటి?

## దీనిలో ఇంగ్లీష్ మీడియం పాత్ర ఎంత ?

ఆంధ్రప్రదేశ్ లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిందని గడచిన కొద్ది రోజులుగా మీడియాలో వార్తలు , విశ్లేషణలు వస్తున్నాయి. ఈ విషయంపై సమగ్ర సమాచారం తో, నిష్పాక్షికంగా విశ్లేషణ చేసి 'ప్రజలకు, రాజకీయ పార్టీలకు, మీడియా వారికి వాస్తవాలు 'తెలియజేయాలన్న ఉద్దేశ్యంతో ఈ వ్యాసం వ్రాస్తున్నాను.

**మొదటి భాగం :-**

ప్రభుత్వ బడులలో విద్యార్థుల చేరిక తగ్గటం 1990 లలో నుండే (కొద్ది స్థాయిలో) మొదలయ్యింది. దీనికి ప్రధాన కారణాలు ఏమిటి? అన్న విషయం పై వివిధ సమయాలలో జరిగిన సమావేశాలలోనూ, మీడియా లోని వార్తలపై విశ్లేషణ - వ్యాసాలు, అధికారులు - ఉపాధ్యాయ సంఘాల అభిప్రాయాలు, ఉపాధ్యాయుల వ్యక్తిగత సంభాషణలలో వ్యక్తపరిచిన అభిప్రాయాలలో మొట్టమొదటిది ...ఎక్కువమంది రాజకీయ నాయకులు - వారి వ్యూహకర్తలు నమ్మింది ఇంగ్లీష్ మీడియం .. ప్రభుత్వ బడులలో ఇంగ్లీష్ మీడియం లేకపోవడం వలన పిల్లలను ప్రైవేట్ బళ్ళకు పంపుతున్నారు? అనేది ..

ఈ సాధారణ అభిప్రాయం (General Preception) వివిధ సమయాలలో జనబాహుళ్యం లో బాగా ప్రాచుర్యం పొంది 'అదే వాస్తవంగా, అదే అసలు కారణంగా భావించబడుతుంది'. ఈ సాధారణ అభిప్రాయం లోని వాస్తవాన్ని వెలికితీయడానికి, నిజాలను నిగ్గు తేల్చడానికి గణాంకాలు ఎంతో అవసరం.

20 వ శతాబ్దంలో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన (Statistician) ఫ్రాన్సిస్ గాల్టన్ ఈ విధంగా చెప్పారు "మన సాధారణ అభిప్రాయాలలో ఆశ్చర్యకరమైన విషయానికి అవసరానికి మించిన ప్రాధాన్యత ఇస్తాము. కానీ అనుభవం మనల్ని దానికి వ్యతిరేకంగా హెచ్చరిస్తుంది. శాస్త్రీయ దృక్పథం గల మనిషి తన తీర్మానాలను వాస్తవ సంఖ్యల (actual numbers) మీద ఆధారపడి ఉండేలా జాగ్రత్త పడతాడు. దీర్ఘకాలికంగా ఉన్నటువంటి సాధారణ అభిప్రాయాలు జీవితపు నిశ్చిత నియమాలైపోతాయి, వాటిని ప్రశ్నించకూడదన్నంతగా రూఢమైపోతాయి. అందుచేత అసలు లోతైన ప్రాథమిక విచారణకు అలవాటుపడని వారు, శాస్త్రీయ దృక్పథం లేని వారు వాస్తవ గణాంకాలను ద్వేషిస్తారు. శాస్త్రీయ దృక్పథం గలవారు తమ విశ్వాసాలను పరీక్షించి నిజాన్ని నిగ్గుతేల్చి అసత్యం లేక అవాస్తవం అని తేలిన విషయాలను వదిలేయటానికి సరిపడినంత ధైర్యవంతులై, నైపుణ్యం కలిగి ఉండాలి."

**1. సాధారణ అభిప్రాయం :** ప్రభుత్వ బడులలో ఇంగ్లీష్ మీడియం లేకపోవడం వలన పిల్లలను ప్రైవేట్ స్కూళ్లకు పంపుతున్నారు?

**వాస్తవం -** గడచిన 20 సంవత్సరాలుగా బాగా ప్రాచుర్యం పొందిన ఈ సాధారణ అభిప్రాయం లోని నిజాన్ని నిగ్గుతేల్చడానికి ... ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోని గ్రామీణ ప్రాంతాలలో నివసించే విద్యార్థులలో ప్రైవేటు బడులలో చదువుకునే వారి గణాంకాలను పరిశీలించాలి. ( కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా సేకరించి, ప్రచురించే ప్రామాణిక DISE గణాంకాలతో ఇందులోని వాస్తవాలను పరిశీలిద్దాము).

" 2003-04 విద్యా సంవత్సరంలో, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోని గ్రామీణ ప్రాంతాలలో 9,30,036 మంది విద్యార్థులు ప్రైవేట్ బడులలో చదువుతుండగా 2007-08 విద్యా సంవత్సరానికి ఆ విద్యార్థుల సంఖ్య 17,75,727 కి చేరింది.

ప్రభుత్వ బడులలో ఇంగ్లీష్ మీడియం లేకపోవడం వలన, తల్లిదండ్రులు ఫీజులు కట్టి మరీ తమ పిల్లలను ప్రైవేట్ బళ్ళకు పంపుతున్నారు అని భావించిన అప్పటి ప్రభుత్వం 2008 విద్యా సంవత్సరం నుండి ప్రభుత్వ హైస్కూల్స్ లో తెలుగు మీడియంకు సమాంతరంగా ఇంగ్లీష్ మీడియంను ప్రవేశ పెట్టింది. అయినా ప్రతీ సంవత్సరం ప్రైవేట్ స్కూల్స్ లో చేరే విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతూనే ఉంది.

2007-08 విద్యా సంవత్సరం లో, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోని గ్రామీణ ప్రాంతాలలో 17,75,727 మంది ప్రైవేట్ బడులలో చదువుతుండగా 2010-11 విద్యా సంవత్సరానికి ఆ సంఖ్య 20,70,436 కి చేరింది. అంటే ప్రభుత్వ హైస్కూల్స్ లో ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెట్టిన ' తర్వాతి 2 సంవత్సరాలలో.... సుమారు 3 లక్షల మంది, 'ప్రభుత్వ బడులు వదిలి ... ప్రైవేట్ స్కూల్స్‌లో చేరారు. తదుపరి కూడా అదే ఒరవడి కొనసాగింది.

రాష్ట్ర విభజన తరువాత ఆంధ్రప్రదేశ్ లో 2017 - 18 విద్యా సంవత్సరంలో ప్రాథమిక పాఠశాలలో తెలుగు మీడియంకు సమాంతరంగా ఇంగ్లీషు మాధ్యమాన్ని ప్రవేశపెట్టారు. 2020-21 నుండి అయితే ఏకంగా ప్రభుత్వ బడులలో తెలుగు మీడియంను పూర్తిగా రద్దుచేసి, నిర్బంధ ఆంగ్ల మాధ్యమాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. అయినా కూడా ప్రైవేట్ బడులు పిల్లల చేరిక తగ్గలేదు.

కోవిడ్ ప్రభావం వలన ఆర్థిక రంగం కుదేలయ్యి... ఉపాధి అవకాశాలు తగ్గడం వలన దేశవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో పిల్లలు చేరటం పెరిగింది. పరిస్థితులు కొంత మెరుగు అవ్వగానే, గడచిన రెండు సంవత్సరాలలో ఆ విద్యార్థులు తిరిగి ప్రైవేట్ పాఠశాలల్లోకి చేరారు.

ఈ విద్యా సంవత్సరంలో ( 2023-24) ఆంధ్రప్రదేశ్ లో పట్టణ, గ్రామీణ ప్రభుత్వ బడులు మరియు హాస్టల్ వసతి గల ప్రభుత్వ

పాఠశాలలు అన్నీ కలిపి సుమారు 37,88,000 ల పై చిలుకు మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. అంటే కోవిద్ ప్రభావం ఎక్కువగా ఉన్న 2021-22 లో విద్యార్థుల సంఖ్య 44,29,356 కాగా - అది ఇప్పుడు 37 లక్షల 88 వేలకు చేరింది. అంటే సుమారు 6,41,356 మంది విద్యార్థులు... నిర్బంధ ఇంగ్లీష్ మీడియం అమలు జరుగుతున్న ప్రభుత్వ స్కూళ్లను వదిలి, ప్రైవేట్ స్కూళ్ళలో చేరారు.

ప్రభుత్వ బడులలో 2008 నుండి ఇంగ్లీష్ మీడియం ఉన్నాకూడా, ఇన్ని సంవత్సరాలుగా...ప్రతీ సంవత్సరం లక్షలాదిమంది ప్రభుత్వ బడులను వదిలి వెళ్తున్నా కూడా..." ఇంగ్లీష్ మీడియం కోసమే ప్రైవేట్ బళ్లకు వెళ్తున్నారు అనే వాదనను అసత్యంగా, అబద్ధంగా, అవాస్తవంగా భావించకపోతే ... ఆయా వ్యక్తులకు వాస్తవాన్ని అంగీకరించే ధైర్యం లేనట్లే! వారికి నిష్పాక్షిక శాస్త్రీయ దృక్పథం లేనట్లు మరియు ఇంగిత జ్ఞానం తో కూడిన ఆలోచన లేదని రూఢ అయినట్లుగా భావించాలి.

**సాధారణ అభిప్రాయం -2 :**

**టై కట్టి - బూట్లు తొడిగి పిల్లలను ప్రైవేట్ స్కూళ్లకు పంపడం అంటే తల్లిదండ్రులకు మోజు ... అన్నది ఇంకొక వాదన !!**

**వాస్తవం :-** నిజానికి ఈ వాదన చాలా మంది ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు అందరికీ చెప్తుండేవారు.( ప్రభుత్వంలో అత్యున్నత స్థాయిలో పనిచేసిన వారు కూడా) దీనిని వాస్తవం అని నమ్మి... 2014 నుండి 2019 మధ్య కాలంలో కొద్దిమంది దాతలు రాష్ట్రంలోని కొన్ని ప్రభుత్వ బడులలో పిల్లలందరికీ బూట్లు, టైలు బ్యాగ్,లు బహూకరించారు.

మరికొన్ని పాఠశాలల్లో అయితే... దాతలు పిల్లలందరికీ ఫోటో ఐడి కార్డులు కూడా ఇచ్చారు. అయినా ఆయా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరగలేదు. 2020 తరువాత నుండి రాష్ట్రప్రభుత్వం ప్రభుత్వ బడిలో చదివే విద్యార్థులందరికీ బూట్లు, బ్యాగ్ లు ఉచితంగా ఇవ్వటం మొదలుపెట్టింది.

ఉచిత బూట్లు, బ్యాగ్ లు ఇచ్చినా కూడా , ప్రభుత్వ బడిలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గడం అందరికీ తెలిసివిషయమే. దీనిని మరింత సులువుగా వివరించడం కోసం కొన్ని సంవత్సరాల క్రితం జరిగిన ఒక సంఘటన చెప్తాను. అప్పట్లో విద్యాశాఖలోని ఒక అధికారి 'తల్లిదండ్రులకు పిల్లలు టై కట్టుకుని - బూట్లు తొడుక్కుని బ్యాగ్ వేసుకొని వెళ్తుంటే బాగా ఆనందపడతారు...ఆ మోజుతోనే పిల్లలను ప్రైవేట్ స్కూళ్లకు పంపుతున్నారు' అని వాదించేవారు. ఆఫీసర్ గారి మాటలను 85 సం.ల వయస్సు గల ఒక నిరక్షరాస్యురాలు అయిన ఒక గ్రామీణ మహిళతో చెప్పగా, ఆవిడ ఇంగితజ్ఞానంతో నన్ను సూటిగా ఒక ప్రశ్న అడిగింది ?

" పిల్లలకు మూడు వందల రూపాయలు మాత్రమే విలువ చేసే బూట్లు వేయడానికి..15,000/- ఫీజు కట్టి ప్రైవేట్ బడులకు పంపుతారా? మరీ జనానికి ఆ మాత్రం తెలియదని మీరు అనుకుంటున్నారా ? " అని.

**సాధారణ అభిప్రాయం -3 :**

ప్రభుత్వ స్కూళ్ళలో భవనాలు అందంగా ఉండవు. కార్పొరేట్ ప్రైవేట్ స్కూళ్ళ బిల్డింగ్‌లు చూసి పిల్లలను అక్కడ చదివిస్తున్నారు?

**వాస్తవం :-** నిజానికి ఎక్కువ ప్రైవేట్ బడులు " బడ్జెట్ స్కూల్స్". అవి అంత అందమైన భవంతులలో లేవు మరియు ఇతర మౌలిక సదుపాయాలు (బల్లలు వగైరా ..) కూడా అంత నాణ్యంగా ఉండవు. మరికొన్ని అయితే రేకుల కప్పు కింద నడుస్తున్నాయి... అయినా ఆయా బడులు పిల్లలతో పూర్తిగా నిండుతున్నాయి.

2008 నుండి, మరీ ముఖ్యంగా ప్రభుత్వ ప్రోత్సాహం వలన 2014 నుండి 2019 వరకు చాలా గ్రామాలలో దాతలు - పూర్వ విద్యార్థుల విరాళాలతో బడులకు మౌలిక సదుపాయాలు కల్పించారు. %[jZZ|J•Ÿ= E%a%`Ÿ™•+¬•E%a%•jJ% వలన బడులకు సదుపాయాలు చేకూరాయి కానీ... విద్యార్థుల సంఖ్య మాత్రం పెరగలేదు. ( అతి కొద్ది గ్రామాల్లో మాత్రమే ప్రభుత్వ బడులలో పిల్లల సంఖ్య పెరిగింది).

ప్రస్తుత ప్రభుత్వం ' నాడు- నేడు ' క్రింద వేల కోట్లు ఖర్చు పెట్టి, వేల కొలది బడులలో మరికొన్ని మౌలిక సదుపాయాలు , సుందరీకరణ పనులు చేశారు. అయినా కూడా విద్యార్థుల సంఖ్య తగ్గుతూనే ఉంది.

**సాధారణ అభిప్రాయం: 4**

ప్రభుత్వ బడులలో టాయిలెట్ లు సరిగా ఉండవు. అందువలన తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ బడులకు పంపుతున్నారు .

**వాస్తవం:** తెలుగు రాష్ట్రాలలో ఈ వాదన ముఖ్యంగా 2014 నుండి 2018 వరకు బాగా ప్రచారం లో ఉండేది. అప్పట్లో ఈ విషయంపై సుప్రీమ్ కోర్టు లో కోర్టు ధిక్కరణ కేసు కూడా నడిచింది.

రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విషయం పై దృష్టి సారించి... పూర్తిస్థాయిలో టాయిలెట్లు నిర్మాణం చేసి , రోజువారీ శుభ్రం చేయడానికి కూడా ఏర్పాట్లు చేశారు. Centralised మానిటరింగ్‌లో భాగంగా....ప్రస్తుతం ప్రధానోపాధ్యాయులు ప్రతీ రోజూ స్కూల్ లోని టాయ్లెట్‌ల ఫోటోలు వెబ్సైట్ లోకి అప్లోడ్ చేస్తున్నారు. అయినా కూడా ప్రభుత్వ బడులు వదలి... ప్రైవేట్‌బడులలో చేరడం ఆగలేదు.

**సాధారణ అభిప్రాయం :- 5**

బడుల విలీనం లేదా తరగతుల విలీనం వలన పిల్లలకు ప్రభుత్వ బడి దూరం అయ్యింది. అందుకే తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ స్కూళ్ళలో చేరుస్తున్నారు .

**వాస్తవం :-** స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత నుండి అన్ని రాష్ట్ర - కేంద్ర ప్రభుత్వాల తమ తమ విద్యావిధానంలో అనుసరించినది " పిల్లలకు బడి అందుబాటులో ఉండాలి " .

అయితే ఈ లక్ష్యాన్ని చేరడానికి మొదట్లో ...ప్రాథమిక పాఠశాలలు నెలకొల్పటానికి గ్రామాన్ని యూనిట్‌గా తీసుకునేవారు. తదుపరి గ్రామం లోని వివిధ వివిధ కులాల ఆవాసాలను (పక్క పక్కనే ఉన్న ఆవాసాలను కూడా) వేరువేరు హాబిటేషన్స్‌గా గుర్తించి, ఆయా ఆవాసాలలో ఒకరు లేదా ఇద్దరు టీచర్లతో ప్రాథమిక పాఠశాలలు నెలకొల్పారు. నిజానికి ఇది గ్రామాలకు మాత్రమే పరిమితమైన సమస్య కాదు. పట్టణాలలో కూడా ఇదే సమస్య ... ( దీనికి సమాజంలోని కుల వ్యవస్థ ఏవిధంగానూ కారణం కాదు... ఎందుకంటే హైస్కూళ్లలో లేని కుల వివక్షత... ప్రాథమిక పాఠశాలల్లో ఉండదు కదా!!).

2009 లో విద్యాహక్కు చట్టం వచ్చాక ఇటువంటి చిన్న పాఠశాలలు (ఒకరు లేదా ఇద్దరు టీచర్లతో ఉన్నవి) మరింతగా పెరిగాయి. వీటివలన విద్యార్థులకు నాణ్యమైన బోధన అందడం లేదు... అని గ్రహించిన ప్రభుత్వాలు పాఠశాలల విలీనం ను ఒక విధానంగా తీసుకున్నాయి. ఇందులో రాజస్థాన్, ఒరిస్సాలు ముందు ఉన్నాయి.

2018 లో ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్ర ప్రభుత్వం 10 మంది విద్యార్థుల లోపు ఉన్న ప్రాథమిక బడులను దగ్గర్లోని ( ఒక కిలోమీటరు దూరం లోపు) ఎక్కువ మంది పిల్లలున్న ప్రాథమిక పాఠశాలల్లో విలీనం చేసింది. అటువంటి బడులు రాష్ట్రంలో 1000 పై చిలుకు ఉన్నాయి. అప్పట్లో ఉపాధ్యాయులు, వారి సంఘాలు, రాజకీయ పార్టీలు 'బడులు మూసివేయడం వలన. బడులు అందుబాటులో లేక ప్రైవేట్ స్కూళ్ళ కు వెళ్తున్నారు' అని ప్రచారం చేశారు.

2019 లో ఎన్నికల తర్వాత, 2018 లో విలీనం చేసిన బడులు మరలా తెరిచారు. అయినా అత్యధిక బడులలో కనీసం ఒక్కరు కూడా విద్యార్థులు చేరలేదు. బడుల విలీనం యొక్క ఆవశ్యకతను అర్థం చేసుకున్న రాష్ట్ర ప్రభుత్వం ' జాతీయ విద్యా విధానం అమలు పేరుతో ... 2021 నుండి 3, 4 & 5 తరగతులను హైస్కూల్‌లో విలీనం చేయడం మొదలుపెట్టింది. ఈ తరగతుల విలీనం ప్రాథమిక బడులకు మాత్రమే కాకుండా, ప్రాథమికోన్నత బడులకు కూడా విస్తరించింది. ఈ విధానంలో సుమారు 4,500 బడులలో అమలు చేశారు.

వాస్తవానికి ఎప్పటినుండో... ప్రైవేట్ కు వెళ్ళే పిల్లలు, తమ ఇళ్లకు దగ్గరగా ఉన్న ఈ చిన్న ప్రభుత్వ బడులను దాటుకుంటూనే ప్రైవేట్ బడులకు వెళ్తున్నారు. ఇప్పుడు కొత్తగా ఈ తరగతుల విలీనం వలన ప్రభుత్వ బడులను వదిలి వెళ్తున్నారు అని చెప్పడం .. వాస్తవం కాదు.

**కఠోర సత్యం - చేదు నిజం:**

క్లుప్తంగా తమ పిల్లలను ప్రైవేట్ బడులకు పంపుతున్న తల్లిదండ్రులు “ ఫీజులు కట్టాల్సిన అవసరమే లేని, ఉచితంగా పుస్తకాలు యూనిఫారంలు, బూట్లు, బ్యాగ్‌లు ఇచ్చే... ప్రతిరోజూ పిల్లలకు మధ్యాన్న భోజనం, చిక్కీ, రాగి జావ, 8 వ తరగతిలో ఉచిత ట్యాబ్ ఇచ్చే, డిజిటల్ క్లాస్ రూమ్, ఆర్. ఓ. మంచినీళ్ళు వచ్చే ప్రభుత్వ బడిని కాదనుకొని ... ఫీజులు కడుతూ, పుస్తకాలు, యూనిఫారం లు, బూట్లు, బ్యాగ్‌లు కొని ప్రతిరోజూ పిల్లలకు మధ్యాన్న భోజనం బాక్స్ కట్టి, మంచినీళ్ళ బాటిల్ కూడా బుట్టలో పెట్టి మరీ ప్రైవేట్ స్కూళ్ళకు పంపుతున్నారు ”....ఎందుకు ???

**తల్లిదండ్రులకు ప్రైవేట్ స్కూళ్ళ పై మోజా ? లేక డబ్బులు అంటే లెక్కలేదా / విలువ లేదా ?**

**అసలు కారణం: నమ్మకం లేకపోవడమే**

2017 లోని జాతీయ నమూనా సర్వే (NSS)లో 'మీ పిల్లలను ప్రైవేట్ బడులకు ఎందుకు పంపుతున్నారు అన్న ప్రశ్న కు.... 65% మంది పై చిలుకు తల్లిదండ్రులు చెప్పిన సమాధానం ' ప్రైవేట్ బడులలో లెర్నింగ్ ఎన్విరాన్మెంట్ ఉంటుందని మాత్రమే పంపుతున్నామని . ఈ విషయం పై ప్రపంచ ప్రఖ్యాత ఆర్థికవేత్త అమర్త్య సేన్ ... an uncertain glory: India and its contradictions' అనే తన పుస్తకంలో ఈ విధంగా వ్రాశారు

“ గడచిన 10 సంవత్సరాలలో ప్రభుత్వాలు పాఠశాల విద్యలో ఎంతో చేశాయి... బడులలో మౌలిక సదుపాయాల కల్పన, విద్యార్థులకు ప్రోత్సాహకాలు, వీటికి తోడు విద్యాహక్కు చట్టం కూడా చేశారు.... కానీ ప్రభుత్వ బడులలో జవాబుదారీతనం తీసుకురావడం కోసం తీసుకోవాల్సిన చర్యలను మాత్రం విస్మరించారు (లేక) పక్కదారి పట్టించారు.”

అమ్మ ఒడి లాంటి ఉచిత డబ్బుల పంపిణీ మరియు రెండు దశాబ్దాలుగా రాష్ట్రం లో సాగుతున్న ఉచిత మార్కుల పథకం (వ్యవస్థీకృత మాస్ కాపీయింగ్) వలన ప్రభుత్వ బడులు మరింతగా పతనమవుతాయి. ప్రభుత్వ బడులకు పునర్వైభవం రావాలంటే చేయవలసింది 'జవాబుదారీతనాన్ని పెంపొందించడమే'.

---

రచయిత వైద్యులు, ప్రజా వికాస వేదికలో ప్రసంగం ఇది.

**కవిత**

## బండి చక్రం

**గ**మనించలేదు గానీ
ఎన్నాళ్ళ నుంచో
గోడకు ఒరికి ఉంది
పన్నెండాకులతో కూడిన
ఈ బండి చక్రం
ఎంత అందంగా ఉంది..!
**ఇ**వాళ విశ్రాంతి తీసుకుంటూ
గత దూరాలను
నెమరేసుకుంటుంది
జాతరకు నడిచి
మా మొక్కు తీర్చిందనో
ధాన్యాన్ని మోసుకొస్తూ
దాని బాధ్యతను నిర్వహించిందనో
బండ రాళ్ళని మోస్తూ
ఎండ తొవ్వన నడిచిందనో..
**కా**సేపు ఈ చక్రంతో
సంభాషించాలని ఉంది
దాని జ్ఞాపకాలను వినాలని ఉంది
దాని అనుభవాల నుంచి
పాఠం నేర్చుకోవాలని ఉంది
దాని ఒంటి కంటిన మట్టిని
నొసట తిలకంగా ధరించాలని ఉంది.
ఆ గీరల ధ్వని,
గిట్టల సడీ కలగలిసిన గీతమే
నా బాల్యం ..!
**భూ** భ్రమణానికి ప్రతీకగా నిలిచిన
ఈ పని ముట్టును
రూపొందించిన తొలి శిల్పి ఎవరో
అతని మేధోనైపుణ్యానికి
ప్రణామం..!
**ఇ**ప్పుడు
ప్రపంచీకరణ పయ్యలు
ఈ బండి చక్రాన్ని టక్కరిస్తే
మా ఊరి కమ్మరంజన్నే కాదు
వడ్ల బ్రహ్మయ్యా
వలస బాట పట్టిన్రు.
చెక్కతో చేసిన ఈ చక్రమే
ఇప్పటి యంత్ర వాహన వీల్స్ కు పునాది
ఎంతచెప్పినా ఒడవని దీని కతే
ఓ నాగరికత..!

- నాంపల్లి సుజాత 9848059893

పరిశోధనా పత్రం

శ్రీనివాస్ అంకే
9652471652

# నీళ్ళు కళల పరిమళం

"అప్పిచ్చువాడు వైద్యుడు
ఎప్పుడు నెడతెగక పారు యేరును ద్విజుడుం
చొప్పడిన యూరనుండుము
చొప్పడకున్నట్టి యూరు చొరకుము సుమతీ"

**అప్పు** ఇచ్చేవాడు, వైద్యుడు, నిరంతరం ప్రవహించే వాగు, పురోహితుడు ఉన్న గ్రామంలోనే నివసించాలి. ఇవి లేని గ్రామంలో ఉండ వద్దని శతకకారుని సూచన. నీటి ప్రాధాన్యతను చెప్పిన కవికి కోటిదండాలు. నీళ్ళు జీవసంపద. నీళ్ళు లేని భూమి మరుభూమి.

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన వాటిలో ముఖ్యమైనది 'మిషన్ కాకతీయ' కార్యక్రమం. దీని ప్రధాన ఆశయం చెఱువుల ఆధునీకరణ. చారిత్రక విభాత సంధ్యల్లో చెఱువులు, నదులు పోషించిన పాత్ర చాలా గొప్పది. రాయలసీమలో ప్రవహించే నదులు చాలా చిన్నవి. అయినప్పటికీ చరిత్రలో వాటి పాత్ర కీలకమైనది. పాలేగాళ్ళు సాంప్రదాయ నీటివనరుల చుట్టూ తమ అధికారాన్ని కేంద్రీకృతం చేసుకున్నారు. పాలేగాళ్ళ వ్యవస్థకు ముందు ఈ నీటివనరులు అపురూపమైన సాంస్కృతిక వ్యవస్థను నిర్మించాయి.

బహుమనీ సుల్తానులకు, విజయనగర పాలకులకూ రాయచూరు అంతర్వేది చాలా కీలకమైనది. కృష్ణ, తుంగభద్ర నీటి వల్ల కలిగే సిరిసంపదలతో పాటు వ్యూహాత్మకంగానూ ముఖ్యమైనది. అందువల్ల నీటి నదులతోపాటు నెత్తుటి నదులతోను తడుస్తూ వుండేది. తీవ్ర అశాంతికి నెలవుగా ఉండేది. రాయచూరు అంతర్వేది నిరంతరం ఈ రెండు రాజ్యాల మధ్య చేతులు మారుతూ వుండేది. విజయనగర చక్రవర్తులకు ప్రధాన ఆదాయ వనరు రాయలసీమనే! అందుకే వేలాదిమంది బ్రాహ్మణులు, కవులు ఈ ప్రాంతంలోని గ్రామాల్ని దానంగా స్వీకరించారు. మధ్యయుగ తెలుగుసాహిత్యంలోని భోగలాలసతను ఈ సాంప్రదాయ నీటివనరులే సృష్టించాయి.

ఇక్కడ ప్రవహించే నదులకు కాలువలు తవ్వి నీటిని పొలాల్లోకి పారించేవారు. లేదంటే నదులకు అడ్డంగా కాని, నదినీటిని దారి మళ్లించి గాని చెఱువుల్ని నిర్మించారు. ఈ సాంప్రదాయనీటి వనరులే కరువుల్ని ఎదిరించాయి. అలాగని కరువులే లేవని కాదు.రాయలసీమ భౌగోళికంగా ఏటవాలుగా వున్న ప్రాంతం. మడకశిర, హిందూపురం ప్రాంతాలు సముద్ర మట్టానికి 670 మీ? ఎత్తులో వున్నాయి. కడప ప్రాంతం దాదాపు 360 మీ? ఎత్తులో వుంది. దీనిని బట్టి రాయలసీమ ఏటవాలు తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. దాదాపు 37,000 సాంప్రదాయ నీటి వనరులున్నాయంటే ఇక్కడి సామాజిక జీవితంలో వీటి ప్రాధాన్యత ఎంతో అర్థమవుతుంది.

రాయలసీమ పీఠభూమి ప్రాంతం. తూర్పున తూర్పు కనుమలు, పడమర పశ్చిమ కనుములు పవనాల్ని అడ్డగిస్తాయి. అందువల్ల రాయలసీమలో చాలాభాగం వర్షచ్ఛాయ ప్రాంతంగా వుంది. దేశంలోనే అతి తక్కువ వర్షపాతం కురిసే ప్రాంతాల్లో అనంతపురం జిల్లా రెండవస్థానంలో వుంది. ఇక్కడ కేవలం 530 మి.మీ. సాంవత్సరిక సగటు వర్షపాతం. మిగిలిన మూడు జిల్లాల పరిస్థితి ఇంతే! అందుకే ప్రతిచినుకుని ఒడిసిపట్టి చెఱువు చెఱసాలలో నీటిని బంధించేవారు. కరువుల్ని ఎదిరించడానికి రాయలసీమ ప్రయోగించిన ఆయుధాలు ఈ నీటివనరులు. అందుకే ప్రతి చెఱువు నిర్మాణం వెనుక చారిత్రక సాంస్కృతిక సామాజికాంశాలు దాగివుంటాయి. నాటి కావ్యాలన్నింటా సప్తసంతనాల ప్రసక్తి వుంటుంది.

చెఱువు నిర్మాణం చాలా పవిత్రమైన క్రతువని ప్రాచీన కాలంలో నమ్మేవారు. సప్త సంతానాల్లో చెఱువు నిర్మాణం కూడా ఒకటి! మహాభారతం కూడా చెఱువు నిర్మాణం పవిత్రమైనదని చెబుతోంది. "చెఱువు దేవతలకు, పశువులకు, పక్షులకు, అపురూపమైన స్థావరం. చెఱువులో నీరు తాగి ఆవుమందలు చెఱువు నిర్మాతకూ, అతని వంశానికీ స్వర్గప్రాప్తిని కలిగిస్తాయి. ఈ లోకంలో అష్టైశ్వర్యాలను, గొప్పకీర్తిని కలిగిస్తాయి. మూడుకాలాల్లో చెఱువులో నీఉంటే అగ్నిహోత్రం, వాజపేయం వంటి యాగాలు చేసినంత పుణ్యం లభిస్తుంది. చెఱువు కట్టమీద చెట్లు నాటితే పక్షులు వంటి వాటికి ఆశ్రయమిచ్చినందున అతనికి ఇహపర సుఖాలు లభిస్తాయి. తమ వంశస్థులు చెఱువు తవ్విస్తే పితృదేవతలు పరమానందం పొందుతారు. తమకు ఉత్తమలోకాలు పొందే అవకాశం వుంటుందని చెఱువు నిర్మాణాలను పితృదేవతలు నిరంతరం కోరుకుంటారు (అనుశాసనిక పర్వం 3-330,331) చెఱువు నిర్మాణంలోని గొప్పదనాన్ని హరిభట్టు మత్స్యపురాణం కూడా చెబుతోంది. (5-128).

క్రీ.శ. 1369 నాటి పోరుమామిళ్ళ శాసనం (కడప జిల్లా) చెఱువు నిర్మాణ పద్ధతుల్ని వివరిస్తోంది. బుక్కరాయల కాలంలో భాస్కరుడనే సామంతుడు ఈ చెఱువుని నిర్మించి శాసనం వేయించాడు. చెఱువు నిర్మాణంలో తీసుకోవాల్సిన పన్నెండు జాగ్రత్తల్ని వివరిస్తోందీ శాసనం.

1. చెఱువు కిరువైపులా రెండు కొండలుండాలి.
2. పరివాహక ప్రదేశం విస్తీర్ణం విశాలంగా వుండాలి.
3. చెఱువు గర్భం లోతుగా వుండాలి.
4. ఆనకట్ట నిర్మాణంలో పెద్దపెద్ద బండరాళ్ళను ఉపయోగించాలి.
5. చెఱువు నిర్మాణానికి ఎంపిక చేసిన నేల స్వభావం గట్టిగా వుండాలి.
6. ప్రజాక్షేమాన్ని కాంక్షించే పాలకుడుండాలి.
7. జలవిద్యలో ప్రావీణ్యం వున్న పండితుడుండాలి.
8. కనీసం మూడు ఆమడల పొడవున్న తీయని నీటి ప్రవాహం వుండాలి (దాదాపు 24 మైళ్ళు)
9. ఆనకట్టకు ఇరువైపులా పండ్ల తోటలుండరాదు.

10. కొండరాళ్ళు విస్తారంగా లభించే గని సమీపంలోనే వుండాలి.
11. చెఱువు నిర్మాణంలో నిష్ణాతులైన కూలీలు, మేస్త్రీలు లభించాలి.
12. చెఱువులో నిరంతర జలసమృద్ధి వుండాలి.

ఈ చెఱువు నిర్మాణం చాలా విశిష్టమైనది. తూర్పు కనుమల్లోని రెండు కొండలశ్రేణుల మధ్య నిర్మించారు. ఈ రెండు వరసల మధ్య దూరం దాదాపు 20 కి.మీ. దూరం వుంటుంది. తూర్పు వైపు నున్న కొండలవరుసల్లో కురిసే నీటి ఆధారంగా పడమటి దిక్కుకు అభిముఖంగా నిర్మించారు. పోరుమామిళ్ళకు దాదాపు 70 కి.మీ. దూరంలో ఇవే కొండల శ్రేణుల మధ్యనే కంబం చెఱువుని (ప్రకాశంజిల్లా) నిర్మించారు. అయితే దీన్ని పడమటి కొండల్లోని నీటి ఆధారంగా తూర్పుకు అభిముఖంగా నిర్మించారు. ఇవి చాలా పెద్ద చెఱువులు. పోరుమామిళ్ళ చెఱువు నిండితే దాదాపు 8 కి.మీ. దూరం నీళ్ళు నిలబడుతాయి. అన్నట్టు ఒక విషయం కంబం చెఱువుకి దక్షిణం వైపు ఒక పెద్ద కొండవుంది. రెండు శ్రేణుల మధ్య కొండకు తూర్పు వైపు పెంచికలపాడు, పడమర వైపున తురిమెళ్ళ అనే గ్రామాలున్నాయి. నాచన సోమన కంబం చెఱువుకి సమీపంలోని ఈ గ్రామాలకు చెందినవాడేనని కట్టా నరసింహులు విశ్లేషించారు. తర్వాల కాలంలో బుక్కరాయలు, ప్రౌఢ దేవరాయలు నాచనసోమునికి పుష్పగిరి సమీప గ్రామాల్ని దానం చేశారు. సహజంగానే నాచనసోమన పుష్పగిరి నివాసి అయ్యాడు. తన పూర్వ గ్రామాల పేర్లను, దానంగా స్వీకరించిన గ్రామాలకు పెంచికలదిన్నె, తుడుముల దిన్నె (తురుమెల్లదిన్నె) అని పెట్టుకోవడం ముదావహం.

క్రీ.శ. 1364లో చిత్రావతికి అడ్డంగా బుక్కపట్నం చెఱువుని తవ్వించారు. ఇదీ బుక్కరాయల కాలంలోనే తయారయ్యింది. పోరుమామిళ్ళ చెఱువుకన్నా ఐదు సంవత్సరాలు ముందే నిర్మించారు. అయితే పోరుమామిళ్ళ శాసనంలో వివరించిన చెఱువు నిర్మాణ విధానలన్నీ దీని నిర్మాణంలో అనుసరించారు. ఈ చెఱువు తూముల నిర్మాణం అద్భుతం. వీటిని చూసి ఆధునిక ఇంజనీర్లు సైతం ఆశ్చర్యపడాల్సిందే! ఆధునిక డ్యాముల వాటర్‌గేట్ల కన్నా ఈ చెఱువు తూముల ఏర్పాటు అపురూపం. ఆధునిక డ్యాముల వాటర్‌గేట్లు ఒక్కసారిగా ఎత్తివేస్తే వరద ఉధృతి చాలా ఎక్కువ. కాని బుక్కపట్నం చెఱువు తూములు చెఱువుకట్టకు పై భాగంలో ఒకటి, మధ్యలో ఒకటి, దిగువన ఒకటి నిర్మించారు. చెఱువు పూర్తిగా నిండి వున్నప్పుడు పైన వుండే తూముల్లో మాత్రమే నీటిని వదులుతారు. కొంత తగ్గిన తర్వాత మధ్యలో వున్న తూము, తర్వాత దిగవ తూములను ఉపయోగిస్తారు నదిలోకి ఇన్‌ఫ్లో ఎక్కువగా వుంటే మరవలు ఉండనే ఉన్నాయి.

పెన్నానదిలోకి పండమేరు అనే ఏరు కలుస్తుంది. క్రీ.శ. 1364లోనే పండమేరుకు అడ్డంగా ఒక పెద్ద చెఱువుని నిర్మించారు. దీని నిర్మాత అనంతరస చిక్కవడయారు. సంగమ వంశరాజులకు కులగురువు, సామంతుడు. చెఱువుకి పడమరవైపున ఇతని పేరు మీదుగా ఒక గ్రామం ఏర్పడిరది. దాని పేరు అనంతపురం. ప్రస్తుతం జిల్లా కేంద్రం. తూర్పువైపున చక్రవర్తి బుక్కరాయల పేరు మీదుగా బుక్కరాయసముద్రం అనే గ్రామం వెలసింది. ఇది ప్రస్తుతం మండల కేంద్రం. ఈ చెఱువుకు ముందు భాగంలో దాదాపు 120 చెఱువులున్నాయి. ఆ చెఱువులన్నీ నిండిన తర్వాత ఈ చెఱువు నిండుతుంది. లింక్ చెఱువులన్నమాట. ఈ బుక్కరాయసముద్రం సమీపంలోనే కొండకింద అగ్రహారం అనే గ్రామం వుంది. పుట్టపర్తి నారాయాణచార్యులు నాదిండ్ల అప్పయ కొండకింద అగ్రహార నివాసిగా రాజశేఖర చరిత్రం పీఠికలో వివరించారు. నాదిండ్ల అప్పయ్య ఇతను కృష్ణరాయల ప్రధాని తిమ్మరుసుకు అల్లుడు మరియు మేనల్లుడు. ఇతనికే మాదయ్యగారి మల్లన తన రాజశేఖర చరిత్ర కావ్యాన్ని అంకితం చేశాడు. నాదిండ్ల అప్పయ కొండవీడు ప్రాంతాలకు అధికారిగా ఉన్న సమయంలోనే మల్లనకు 'అయ్యంకి' అగ్రహారాన్ని దానం చేసి వుంటాడు. ఈ గ్రామం ప్రస్తుతం క్రిష్ణాజిల్లా మొవ్వ మండలంలో వుంది. కొంతకాలం ఇతను గుత్తి పాలకుడు గానూ వున్నాడు. నాదిండ్ల అప్పయ సోదరుడు నాదిండ్ల గోపయ "కృష్ణార్జున సంవాదమ" నే ద్విపద రచన చేశాడు. ఆరోజుల్లో ఈ చెఱువు కింద నున్న మాగాణి భూముల్లో సింహభాగం నాదిండ్ల కుటుంబానికి చెంది వుంటుందని స్పష్టంగా చెప్పవచ్చు. వీరు విజయనగర సామ్రాజ్యానికి ప్రధానమంత్రి అయిన తిమ్మరుసు మేనలుళ్ళు. వారికి ఆశ్రితుడు మల్లన. అందువల్ల అనంతపురము చెఱువు కింద వున్న భూములలో మాదయ్యగారి మల్లనకు వీరు మాణ్యం ఇచ్చి వుండే అవకాశం వుంది.

చిత్రావతి నది నీటి ఆధారంగా అనంతపురం జిల్లా ధర్మవరం వద్ద క్రీ.శ. 1398 – 1400 కాలంలో ఒక చెఱువు నిర్మాణం అయ్యింది. నిర్మించిన వ్యక్తి ఈ చంద్రభూష క్రియాశక్తి ఒడయారు. అనంతరస చిక్కవడయారుకు మనమడు. ఈ చెఱువు నిర్మాణం చాలా విభిన్నమయినది. కరావులపల్లి అనే గ్రామం వద్ద చిత్రావతి నదిలో చిన్న ఆనకట్టకట్టి నీరు ఊదుకొనే విధంగా చేశారు. అక్కడ నుండి పెడబల్లి గ్రామం పక్కన ఎనిమిది కి.మీ.లు కాలువ తవ్వి బత్తలపల్లి చెఱువు నింపుతారు. బత్తలపల్లి, జగరాజుపల్లి, లోచర్ల, కనుముక్కల చెఱువులు క్రమంగా నిండుతాయి. చివర పెద్ద చెఱువయిన ధర్మవరం చెఱువు నిండుతుంది. ఈ లింక్ ట్యాంక్ కన్‌స్ట్రక్షన్ 'నీరు పల్లమెఱుగు' అనే సూత్రానుగుణంగా జరిగింది. పై చెఱువులన్నీ ఒకే సమయంలో నిర్మించి వుండే అవకాశం వుంది.

నదుల నుండి చెఱువులకు, చెఱువుల నుండి పొలాలకు నీరు తీసుకురావడం కూడా ఆనాటి ఇంజనీరింగ్ వ్యవస్థలోని గొప్పతనాన్ని వివరిస్తుంది. ఈ కాలువల్ని బ్రిటీష్ పాలనా కాలం నుండి ఫీడర్ ఛానల్ అంటున్నారు. అనంతపురము జిల్లా పెన్నహోబిలం వద్ద ఫీడర్ ఛానల్ వల్ల పొలాలకు అందే నీటిని చూస్తే ముచ్చటేస్తుంది. అనంతపురము నుండి కల్యాణదుర్గం పోయే దారిలో కాలువపల్లి అనే గ్రామం వస్తుంది. పెన్నానది ఒడ్డున వుందీ గ్రామం. అయితే నది ప్రవాహానికి చాలా ఎత్తులో వుంది. ఇక్కడి పొలాలకు నీరు అందడం చాలా కష్టం. కాలువపల్లికి అయిదు కి.మీ. దూరంలో వుండే వెంకటాంపల్లి వద్ద పెన్నానది 20,25 అడుగుల ఎత్తులో ప్రవహిస్తుంది. అక్కడి నుండి నేలవాలుకు అనుగుణంగా అనేక మెలికలతో కాలువపల్లి పొలాలకు నీరు పారించారు. కాలువపల్లిలో పొలాలకు అనుకూలంగా కాలువను తవ్వారు. పెన్నహోబిలంలో కూడా ఇలానే వుంటుంది. కాకుంటే చిన్న మార్పు! దిన్నెల్ని, మట్టిదిబ్బల్ని కొంత తవ్వి! ప్రవాహానికి

అనుకూలంగా పొలాల్ని ఏర్పరచుకొన్నారు. ఈ ఫీడర్ ఛానల్, లింకు చెఱువుల పద్ధతి రెండూ కలిస్తే ధర్మవరం చెఱువు నిర్మాణం.

పెన్నానదికి ఉపనది చిత్రావతి ఒడ్డున చినకోట్ల గ్రామం వుంది (అనంతపురము జిల్లా) చినకోట్ల, ధర్మవరం ప్రాంతాల్ని పోచిరాజు నరసరాజు పాలించాడు. ఇతని ఆస్థానంలోని వాడే అయ్యలరాజు రామభద్రుడు. తన రామాభ్యుదయాన్ని ఇతనికే సమర్పించాడు. అందువల్ల ధర్మవరం చెఱువు కింద మాగాణి భూములలో అయ్యలరాజుకు కూడా నరసరాజు ప్రదానం చేసివుండవచ్చు. రామాభ్యుదయ కావ్యావతారికలో నరసరాజు ప్రదానం చేసిన వాటిలో భూదానం కూడా వుంది. ఆ భూదానం ఇది అయ్యే అవకాశం వుంది.

ఈ కాలువల ప్రస్తావనలు కావ్యాల్లోనూ కనిపిస్తాయి.

"పల్లములు చిక్కనికొయ్యల ద్రవ్వి విత్తుదుర్
గోరికయూరటంబులుగ కొండల కాలువదుడ్డకట్టుదుర్
నీరికి ..... (ఎఱ్ఱన- హ.వ. ఉత్తరభాగం 9-233)

భీమేశ్వరపురాణంలో శ్రీనాథుడు "ఏలేటి మేటికాలువల వలన నదీ మాతృకంబులగు పంటవలంది..." అని ప్రస్తావించాడు. ఈ కాలువల వల్ల సంవత్సరంలో రెండుపంటలు పండేవని కూడా చెప్పాడు చూడండి.

"ఏటేటా విరినీటి నిరుగారుంబండు
బ్రాసంగువరిచేల పసిడిచాయ (బీ.పు. 2-55) ఈ నీటి పారుదల కాలువల్ని "క్రొప్పం గాలయలు" అని పిలచేవారట.

చెఱువుల్ని కాలువల్ని త్రవ్వించిన వారి గురించి మాత్రమే శాసనాలు చెబుతాయి. కాలువల గొప్పదనాన్ని కావ్యాలు చెబుతాయి.

"తలబక్షచ్చట గ్రుచ్చి బాతువులు కేదారంపు గుల్యాంతర
స్థలి నిద్రింపగ జూచి యారెకులుషస్నాత ప్రయాత ద్విజా
వళి పిండీకృత శాలికల్పని దదావాసంబు చేర్పంగరే
వుల దిగ్గన్వెస బారువానిగని నవ్వు శాలిగోప్యోఘముల్"
(ఆ.మా 1-65)

ఈ పద్యంలో చేసిన వర్ణన కంటే చెప్పిన సామాజికాంశాలు గొప్పవి. వరిపంటకు నిరంతరం ప్రవహించేనీరు, నీటిని తీసుకొచ్చే కాలువలు, కాలువల్లో వున్న బాతులు, వరిపంటలకు కావలి వుండే కాపర్లు, ఆ శ్రామికులకు శ్రమలోనూ తోడుగా వున్న వారి భార్యలు, బ్రాహ్మణుల సంధ్యా వందనం - ఎన్ని సామాజికాంశాలు చెప్పాడు రాయలు. ఆ పంటకాలువలకు ఇరువైపులా చెంగల్వపూలు పూసి వుండేవి. (1-27)

కృష్ణరాయలు శ్రామిక కులాలకు చెందినవాడు. పద్యాన్ని సేద్యాన్ని సమానంగా చూసినవాడు.

"దేశ సౌభాగ్య మరసిద్ధికిని మూల
మిల యొకింతైన కుంటకాల్వలు రచించి
నయము పేదకు, అరి, కోరునను నొ
సంగి ప్రబల సేసిన అర్థధర్మముల పెరుగు" (ఆ.మా. 4-236)

కాలువల్ని కూడా కావ్యాల్లాగా రచించడమేనని రూపకీకరణచేశాడు. దేశ సౌభాగ్యానికి ఆధారం చెఱువులు, కాలువలేనని చెప్పాడు. ఈ కాలువలు లోతుగా పెద్దగా వుండేవని శుకసప్తతిలో కదిరీపతి చెబుతున్నాడు.

తటచలిత చలదళచ్యుత
తొటతొట రవశాలి ఫలమిధోరణి కేళా
పటుతర జలచర నికరో
త్కటమూ తనరారు చెఱువు కాలువచేరేన్ (3-393)

చెఱువులు, కాలువల గొప్పదనం ఇలాంటిది మరి! ఆ కాలువల నీటి ఆధారంగా పండే తరిభూముల్ని 'నీరాంబరాలు' అని అనేవారు. వర్షాధారంతో పండేవి 'కడారంబాలు'! రాయల వర్షవర్ణనల్లో 'కడా రంబాల' ప్రస్తావన కూడా వుంది.

రాజంపేట, సిద్ధవటం ప్రాంతాల్ని 'పొత్తపినాడు' అనే వారు. పొత్తపినాడులో చెయ్యేరు (బాహుదానం) పెన్నానదిలో సంగమిస్తుంది. చెయ్యేరు పరివాహంలోనే తాళ్ళపాక అగ్రహారం వుంది. ఈ అగ్రహారం అన్నమయ్య ముందుకాలం నుండీ కూడా ప్రసిద్ధి. క్రీ.శ. 1279లో నరాయ సహస్రమల్లు అనే వ్యక్తి తాళ్ళపాకలో అంతరగంగ గండపెండేర కాలువ తవ్వించినట్లు అత్తిరాళ శాసనం చెబుతోంది. 'గండపెండేర' అనే కన్నడ శబ్దం కాలువ లోతు, విస్తరణను వివరిస్తుంది. అంతరగంగ కాలువలు చాలా విభిన్నమైనవి. నదులు, చిన్నచిన్న వాగులు కొండల్లో పారే ఏర్ల నుండి కాలువలు తవ్వేవారు. ఆ కాలువల నీటిని భూమిలో ఇంకించేవారు. భూగర్భంలో నీటిని నిల్వచేయడం అంతరగంగ కాలువల ప్రధాన ఆశయం. వేసవిలో నదులు చెఱువులు ఎండిపోయినప్పుడు ఈ భూగర్భజలాల్ని ఉపయోగించేవారు. క్రీ.శ. 1558 నాటి పెదశెట్టి పల్లి శాసనం ఊటకాల్వల గురించి కూడా వివరిస్తోంది.

చెఱువులు, కాలువలు, బావుల నుండీ నీటిని తోడడానికి ఉపయోగించే పద్ధతుల్ని కొఱవి గోపరాజు చెప్పాడు (సింహాసన ద్వాత్రంశిక- 26-05-75) గోపరాజు తెలంగాణ ప్రాంతం వాడయినప్పటికీ పీఠభూమి ప్రాంతంవాడే కదా!

ఈ చెఱువులు కాలువలకు చెందిన శాసనాల్ని ప్రసిద్ధకవుల చేత కూడా రాయించేవారు. కడపజిల్లా ఉప్పరపల్లి శాసనాన్ని అల్లసాని పెద్దన రాశాడని కట్టా నరసింహులు గారు నిరూపించారు. క్రీ.శ. 1409 గుంటూరు జిల్లాలోని ఫిరంగిపురం వద్ద పెదకోమటి వేముని భార్య సూరాంబ తవ్వించిన చెఱువు శాసనాన్ని శ్రీనాథుడు రాశాడు. ఈ చెఱువును సంతాన సాగరం అనేవారు.

కడపజిల్లాలో కోకటం గ్రామం వుంది. కృష్ణదేవరాయలు పెద్దనకు కోకటం గ్రామాన్ని ఇచ్చిన విషయం తెలిసిందే! కోకటం పెన్నానది ఒడ్డున వుంటుంది. కోకటానికి 15 కి.మీ. దూరంలో పెద్దనపాడు గ్రామం వుంది. అల్లసానిపెద్దన ఈ రెండు గ్రామాల్లో ఏదోఒక గ్రామానికి చెందినవాడని ఐతిహ్యం! పెద్దనపాడు గ్రామం పక్కన పెద్దన చెఱువనే ఒక చెఱువుంది. దీన్ని పెద్దనే కట్టించాడని జనం వాడుక! అ చెఱువుని ఒక వాగుకి అడ్డంగా నిర్మించారు. ఈ చెఱువులో ప్రస్తుతం ఒక ప్రముఖ సిమెంట్ కంపెనీ వుంది. పెద్దనపాడునుండి ఎఱ్ఱగుంట్ల మీదుగా కోకటానికి వస్తూవుంటే, ప్రాచీనమైన పెద్దకాలువొకటి రోడ్డుకు పక్కనే కొంతదూరం సమాంతరంగా వస్తుంది. ప్రస్తుతం పూడిపోయినప్పటికీ దానిలోతు,

రాతిచప్పిళ్లు నేటికే స్పష్టంగానే వున్నాయి. ఈ కాలువ కోకటం గ్రామ పొలాల్లోకే ప్రవహించేది. బహుశా పెద్దనపాడు చెఱువునుండిగానీ, ఆ వాగు నుండి గానీ ఈ కాలువను తవ్వివుండాలి. పంటకు అవసరం తీరిపోయినాక, మిగిలిన నీళ్లు పెన్నానదిలోకే కలిసేవి. ఈ కాలువనే గోల్కొండ పాలకులు జీర్ణోద్ధరణ చేసినట్లు కైఫీయత్తు సాక్ష్యం వుంది.

కోకటానికి ఆరేడు కి.మీ. దూరంలోనే తిప్పలూరు గ్రామం వుంది. తిప్పలూరుని అష్టదిగ్గజాలకు కృష్ణరాయలు ఇచ్చాడు. కోకటం సమీప గ్రామాన్ని మిగిలిన అష్టదిగ్గజాలకు రాయలు ఇవ్వడాన్ని బట్టి భువన విజయంలో పెద్దన ప్రాధాన్యత చాలా గొప్పగా వుండేదని అర్థమవుతుంది. తిప్పలూరుకీ పెద్ద చెఱువుంది. అల్లసాని పెద్దన చౌడూరు నివాసి అని, చెన్నూరు నాగేశ్వరాలయంలోని శాసనం పెద్దనే రాశాడని కట్టా నరసింహులు గారు విశ్లేషించారు. చౌడూరులో కూడా మంచి చెఱువుంది. కోకటం, పెద్దనపాడు, తిప్పలూరి, చౌడూరు, చెన్నూరు ప్రొద్దుటూరి సమీప గ్రామాలు.

పెన్నానది ఒడ్డునే పుష్పగిరి క్షేత్రం వుంది. ఇక్కడ వైద్యనాథేశ్వరుడు, చెన్నకేశవుడూ వున్నందున శైవవైష్ణవులిరువురికీ పూజ్యనీయమైనది. పుష్పగిరికి కొంతముందుగానే పాపాఘ్ని పెన్నలో కలుస్తుంది. గండికోట వద్ద పెన్నలో చిత్రావతి సంగమిస్తుంది. గోళ్ళపల్లివంక, తిప్పలూరి వంకలు ఉప్పరపల్లి వద్ద పెన్నలో సంలీనమవుతాయి. పాగేరు పెన్నలోనే కలుస్తుంది. ఈ కలయికలన్నీ పెన్నానది పుష్పగిరికి రాకముందే జరుగుతాయి. అందువల్ల పెన్న పుష్పగిరి వద్ద నిరంతర ప్రవాహిని. అందుకే పుష్పగిరి అగ్రహారం చరిత్రలో చాలా ప్రసిద్ధి కెక్కింది. కాబట్టి నాచనసోముడు అక్కడుండటంలో ఆశ్చర్యం లేదు. అక్కడ నందిఘంటకవులు, మాదయ్యగారి మల్లన, నందితిమ్మనలు కవులుగా రూపుదిద్దు కోవడంలో అతిశయోక్తి లేదు. నీళ్ళు ఉంటే అన్ని సుఖాలు ఉన్నట్లే!

కుందూనది జమ్ములమడుగు (కడప) ప్రాంతం నుండి నంద్యాల మీదుగా తుంగభద్రలో కలుస్తోంది. దీని ఒడ్డునే పెద్దముడియం అనే గ్రామం వుంది. ఇక్కడే ఉన్న అహోబల మఠంలో అన్నమయ్య విద్యాభ్యాసం చేశాడు. అల్లసాని పెద్దన కూడా ఇక్కడే విద్యార్జన చేశాడు. నంద్యాల పాలకుడైన కృష్ణమరాజుకే పింగళిసూరన, కళాపూర్ణోదయాన్ని అంకితం చేశాడు.

ఈ చెఱువుల్ని, కాలువల్ని చాలా చక్కగా పరిరక్షించుకుంటూ పర్యవేక్షించు కొనేవారు. దీనికోసం ప్రత్యేకమైన పద్ధతులుండేవి. విజయనగర పాలకులు "దశబంధ" విధానాన్ని పాటించేవారు. పండిన పంటలో పదవవంతు పన్నుగా చెల్లించడమే దశబంధం. ఇది వంశపారంపర్యం. పన్నుగా చెల్లింపులు లేకుంటే చెఱువు, కాలువల కింద భూముల్ని పర్యవేక్షకులకు ఇచ్చేవారు. ఈ దశబంధం పేరుతోనే సాంప్రదాయ నీటివనరులను కూడా పిలిచేవారు. దీనికి కొన్ని వందల నిదర్శనాలున్నాయి. అనంతపురము జిల్లా రాప్తాడు మండలం పాలచెర్లలోని కాలువను "దశబంధం కాలువని" నేటికీ పిలుస్తున్నారు. నార్పల మండలం బొందలవాడ చెఱువుని "దశబంధం రంగప్ప చెఱువు" అని అంటున్నారు. ముదిగుబ్బ మండలంలోని కొడవండ్ల పల్లిలోని చిన్నకుంటను "దశబంధం బావి" గా వ్యవహరిస్తున్నారు. ఇవి మచ్చుకు కొన్ని! దశబంధం ప్రస్తావన వున్న శాసనాలు, కైఫీయత్తులు అనేకం! దశబంధాన్ని "కట్టుంగొడుగు" గా కూడా వ్యవహరించేవారని చెబుతూ దశబంధ విధానాన్ని ఎస్.ఎమ్. బాషా లోతుగా విశ్లేషించారు. వనిపెంట శాసనంలోని "మడిబడి" దశ బంధానికి సమానార్ధకమైనదని ఉమామహేశ్వర శాస్త్రి గారి అభిప్రాయం. దశబంధ విధానంతో పాటు మరొక కట్టుబాటును కంభంపాటి సత్యనారాయణ ఉదహరించారు. 13వ శతాబ్ది ప్రథమార్థంలో యాదవ సింగన కాలం నాటి ఒక వ్యవసాయదారుల సంఘాన్ని కంభంపాటి గారే వివరించారు. ఆ సంఘం పేరు చిత్రమేలి. మేలి అంటే నాగలి. ఇది అనంతపురము జిల్లా బొందలవాడ సమీపంలలో మూడు రాతి పలకలమీద చెక్కివుంది. ఇటువంటి సంఘ ప్రస్తావన భారతదేశంలో ఎక్కడా కానరాదు. చిత్రమేలి ప్రస్తావన వున్న శాసనాలు కూడా ఎక్కువే.

ఈ చెఱువులు కాలువల కింద అనేకరకాల పంటలు పండేవి.

"చెఱకును రాజనంపు వరిచేలును దట్టపుబోక ప్రాకు లుం
దఱచగు పూవ్వదోటలను దమ్మికొలంకులు నేటి కాల్వలుం
బఱపగు నారికేళ వనపంక్తులు మామిడి తోటలుంగడున్
మెఱయుచు నాత్మకున్ ముదము మెచ్చును నచ్చెరువున్
ఘటింపగన్ "

(క.పూ. 2-143)

చెఱకు, వరి, పోక, పొన్న, కొబ్బరి, అరటి, మామిడి, పూలతోటలు, అశోకవృక్షాలు, మద్దిచెట్లు వుండేవి. ఈ తోటల సేద్యంతో పద్యం నిజంగా సారవంతమైన భూములో పండిన పంట. వీటితోపాటు పనస తోటలు పండేవి (ఆ.మా 1-68) పాండురంగ మాహాత్మ్యం రకరకాల పండ్లని వివరించి "పసిమితేట పండే ముక్కారు పసిడికారు సరసధాన్యం" అని నోరూరిస్తుంది (1-118).

రెండవ బుక్కరాయలు ఒక గొప్ప చెఱువుని కట్టించాడని సన్నీజ్ చెబుతాడు. దానివల్ల అరటి, నారింజ, నిమ్మ, గులాబి వనాలు, వరి, నవధాన్యాలు, చెఱకు, పండ్లతోటలు, వుండేవి. ఆ చెఱువు నిర్మాణం వల్ల ప్రభుత్వానికి ప్రతి సంవత్సరం మూడున్నర లక్షల పగోడాల ఆదాయం పెరిగిందని సన్నీజ్ రాశాడు.

రోళ్ళమడుగు, బుక్కపట్నం శాసనాల్లో పత్తి, నూలు, సిల్కు, బియ్యం, చోళ్ళు, రాగులు వంటి కాయధాన్యాలు, బెల్లం, పంచదార, నూనెలు వంటి రసపదార్థాలు' చందనం, కస్తూరి, హారతి, కర్పూరం లాంటి పరిమళద్రవ్యాలు, ఎన్నోరకాల పప్పులు, పళ్ళు, కాయలు పండిరచి ఇతర ప్రాంతాలకు రవాణాచేసేవాడని స్పష్టంగా వుంది.

ఆకులు, కూరగాయలు, టెంకాయల, మాదీఫలాలు, మామిడిపండ్లు, చింతపండు, నువ్వులు, గోధుమలు, పెసలు, వడ్లు, జొన్నలు, నూనె, నెయ్యిం, ఉప్పు, బెల్లం, ఆవాలు, మిరియాలు, తగరం, సీసం, రాగి, చందనం, కస్తూరి, మంజిష్ఠ, దంతం, పట్టు, పసుపు, ఉల్లి, అల్లం, సంతల్లో అమ్మేవారిని క్రీడాభిరామం చెబుతోంది. క్రీడాభిరామంలో వరంగల్ గురించి వర్ణించినప్పటికీ దానికర్త వినుగొండ వల్లభరాయలు పులివెందుల సమీపంలోని వారు. కాబట్టి ఇవన్నీ స్థానిక సంతల్లో నివేనని అర్థమవుతుంది.

క్రీడాభిరామం, బుక్కపట్నం, రోళ్ళ మడుగు శాసనాల ఆధారంగా రాయలనాటి రసికత రాయలసీమ రసికతనేని విదితతోంది. ఇది ఉన్నతవర్గాల జీవితం. కావ్యాలు, శాసనాలు రాజకీయంగా

ఉన్నతవర్గాల జీవితాన్ని చెబుతాయి. కైఫీయత్తులు గ్రామ జీవితంలోని సామాజికతను చెబుతాయి. కావ్యాలకన్నా శాసనాలకన్నా సామాన్యుని గురించి చెప్పేది కైఫీయత్తులే! దాదాపు అన్ని కైఫీయత్తుల్లో గ్రామంలో పండే పంటలు వివరాలున్నాయి.

రాగులు, ఆరుగలు, ఉలవలు, వడ్లు, జొన్నలు, తెల్లజొన్నలు, పచ్చజొన్నలు, తోటజొన్నలు, చిత్తజొన్నలు, ఎర్రజొన్నలు, కొర్రలు, సన్నకొర్రలు, నువ్వులు, కారునూగులు, సజ్జలు, ఆముదాలు, ఉద్దులు, మెంతులు, గోగులు, పసుపు, పెసులు, పచ్చపెసులు, మినుములు, ఆరికెలు, కందులు, సామలు, అలసందులు, అనుములు, పత్తి, తమిదెలు, మిరియాలు, శనగలు, బరిగెలు, కొర్రబరిగెలు, నీలి, గెనుసుగడ్డలు, చామగడ్డల, కందగడ్డలు, కుసుములు, ఎల్లశిశలు, వరిగెలు, ధనియాలు, నీరువుల్లి, ఎర్రవుల్లి, గోధుములు, తోట గోధుమలు, బడిసెలు, అగిశలు, తెల్లగిశెలు, ఎళ్ళగిసెలు, జీలకర్ర, మెంతులు, ఆవాలు, ముల్లంగి, వోమం, భంగి, వంకాయలు, గుమ్మడి, సొరకాయల, బీరకాయలు, బెండకాయలు, కాకరకాయలు, పోళ్ళకాయల, చిక్కుడు కాయలు పండేవని అసంఖ్యాకమైన కైఫీయత్తులు చెబుతున్నాయి.

అరటి, పనస, నారికేళం, చెఱకు, మామిడి, నిమ్మ, కిత్తలి, శీతాఫలం వంటి పండ్లతోటలు, ఆకుపోకతోటలు, దాదాపుగా ప్రతి గ్రామానికి వుండేవి. అనాదిగా జనుము పంటకు బెంగాల్ ప్రాంతం ప్రసిద్ధి. కాని చిట్వేల్ వద్ద జనుము పండేదని చిట్వేలి కైఫీయత్తు చెబుతోంది. ఒంటిమిట్ట సమీపంలోని కొత్తపల్లి, హిందూపురం సమీపంలోని మోదా గ్రామం వద్ద వందల సంవత్సరాల 30,40 ఏండ్ల కిందటి దాకా జనుము పంట విస్తారంగా పండించేవారు.

పదహారవ శతాబ్దిలో దక్షిణ అమెరికా ఖండం నుండి పోర్చుగీసు వారు మిరపపంటను దక్షిణ భారతంలో ప్రవేశపెట్టారు. పదహారవ శతాబ్దం చివరినాటికే రాయలసీమంతా మిరపపంట విస్తరించింది. పోర్చుగీసు వారే బొప్పాయిపంటను పరిచయం చేశారు. అదేవిధంగా పొగాకును పోర్చుగీసులే ప్రవేశపెట్టారు. ఇవి 17వ శతాబ్దం నాటికి రాయలసీమంతా విస్తరించాయి.

బంగారు, వజ్రాలు రోడ్ల మీద రాసులుగా పోసుకొని అమ్మినారనే మాటను వింటూవున్నాం. ఈ సంపదంతా సాంప్రదాయ నీటివనరులు సృష్టించినదే! అందుకే శ్రామిక కులస్థుడైన భట్టుమూర్తి "గంగ రైతుల తోబుట్టువు" అంటాడు (వ.చ. 1-100-4వ పాదం).

"నృపుల పదహల రేఖల కెల్ల మాభు
జాగ్ర హల రేఖలే మూల మనుచుగోటి
కొండలుగా ధాన్యరాశులు పండువీట
సుజన భజనైక శూద్రజాతి (ఆ.మా 2-36)

"రాజు పాదాల్లో వుండే రేఖలు మాభుజాల మీద వున్న నాగేటిచాలులే నని శూద్రరైతులు చెబుతున్నారు" శ్రామిక కులస్థుడు తప్ప శ్రామికేతరుడు ఈ మాట చెప్పలేదు. శ్రమ గొప్పదనాన్ని గుర్తించాడు రాయలు. ఈ పద్యం చదవగానే ఆత్రేయ రాసిన "కారులో షికారు కెళ్ళే" అనే సినిమా పాట స్ఫురిస్తుంది.

సంపదను సృష్టించిన నీటివనరుల ఆధారంగానే విజయనగరరాజ్యం సామ్రాజ్యంగా పరిణమించింది. విజయనగర పతనం తర్వాత పాళేగాళ్ళంతా ఈ నీటివనరులను ఆసరా చేసుకొనే బలపడ్డారు. దాదాపు నూటయాభై ఏళ్ళ కింద సర్ అర్థర్ కాటన్ రాయలసీమలో ప్రాజెక్టుల అవసరం లేదన్నాడు. ప్రాజెక్టులు నిర్మించాల్సిన చోట పెద్దపెద్ద చెఱువులు నిర్మించారన్నాడు.

నాటి సాహిత్య మానవుడైనా నేటి ఆధునిక సాహిత్యకారుడైనా రాయలసీమలో నీటి గురించి మాట్లాడటం యాదృచ్ఛికం కాదు. ఇది ఇక్కడి జీవితం, సంస్కృతి. కానీ నాడున్నట్లు నేడు నీళ్ళు లేవు. కరువుల్లోనే నాడు ఆకటిచావులుండేవి. నేడు అన్ని కాలాల్లోనూ రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.

"నీళ్లు రంగు రుచి వాసన లేని అమృతం".

---

-రచయిత అనంతపురము ప్రభుత్వ కళాశాల (స్వయంప్రతిపత్తి) లో తెలుగు అధ్యాపకులు,

---

## 1982లో తెలుగుదేశం పార్టీ భాషావిధాన ప్రకటన ఇలా వుంది:

1. సచివాలయం మొదలు, సమితి కార్యాలయం వరకు అన్ని స్థాయిల్లో ప్రభుత్వ కార్యాలయాలన్నింటిలో తక్షణం తెలుగు ఏకైక అధికార భాషగా పిరిగణించబడి తెలుగు భాషలోనే రాష్ట్ర ప్రభుత్వ పాలన సాగాలి.
2. దిగువ న్యాయస్థానాలు మొదలు రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం వరకు అన్ని స్థాయిల్లో తెలుగు భాషలోనే కార్యకలాపాలు జరగాలి.
3. ప్రాథమిక పాఠశాలలు మొదలు, విశ్వవిద్యాలయాల వరకు అన్ని స్థాయిల్లో తెలుగుభాషే బోధనా భాషగా గుర్తించబడాలి.
4. గవర్నరు పిల్లలు మొదలు శ్రామికుని బిడ్డలు వరకు బాల బాలిక లందరికీ ఒకే విధమైన ఏక ప్రమాణ విద్యాభాసం జరిగేవిధంగా విద్యావ్యవస్థను సంస్కరించాలి. అంతేకాక తెలుగునాడులో తెలుగు భాష ఒక్కటి మాత్రమే తప్పనిసరిగా నేర్చుకోవలసిన భాషగా అమలుచేయాలి.
5. హిందీ, తమిళం, కన్నడం, మలయాళం లాంటి ఇతర భారతీయ భాషలుగాని, ఆంగ్లీషు, రష్యన్, జర్మన్ జపానీస్ లాంటి విదేశీ భాషలు గాని, నేర్చుకోదలచిన వారికి అవి ఐచ్ఛిక భాషలుగా బోధించ టానికి ఏర్పాట్లు జరగాలి.
6.తెలుగునాడులో వుండే తంతి తపాలా రైల్వే లాంటి ప్రజాజీవన సంబంధిత కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా తెలుగుభాషలోనే కార్యకలాపాలు జరగాలి.
7.తెలుగునాడులో ఉన్న పారిశ్రామిక, వ్యాపారసంస్థలు అవి ప్రభుత్వ సంస్థలైనా, ప్రైవేటు సంస్థలయినా -అన్నీ తమ కార్యకలాపాలను తెలుగులోనే నిర్వహించాలి.
8.కేంద్ర ప్రభుత్వంలోనూ, ఇతర రాష్ట్ర ప్రభుత్వాలలోనూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర ప్రత్యుత్తరాల మేరకు మాత్రమే ఇంగ్లీషుభాష వాడకాన్ని పరిమితం చేయాలి.(ఇంకా రెండు అంశాలున్నాయి.)

**మరి ఇప్పటి తెలుగుదేశం పార్టీ ఇదంతా మర్చిపోయింది.**
**ఇల్లలుకుతూ..... ఈగ తన పేరునే మర్చిపోయిందట !**
**నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు!!!!**

కటికెల శ్రీహర్ష కిషోర్
9963112877

# బహుప్రకార సహజ భాషాప్రక్రియ mNLP

బహుప్రకార సహజభాషా ప్రక్రియ(మల్టిమోడాల్ నాచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్ - mNLP) అనేది సహజ భాషా ప్రక్రియ (నాచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్) లో ఒక కొత్త రంగం. సాధారణంగా సహజ భాషా ప్రక్రియలో భాషల పాఠ్యాలను ఆధారం చేసుకుని పరిశోధన జరుగుతుంది. అదే ఈ రంగంలో సహజ భాషలపైన జరిగే పరిశోధనలకు బొమ్మలు(ఇమేజ్), ఆడియో(శ్రవ్యకం), వీడియో(దృశ్యకం) లాంటి వేరే రూపాలను కలుపుకొని చేస్తాము. mNLP మిగితా సహజ భాషా ప్రక్రియ పరిశోధనలతో పోల్చుకుంటే కొత్త పరిశోధనారంగం. అయితే వ్యక్తులు ప్రపంచంలోని వేరే భాషల వ్యక్తులతో లేదా యంత్రాలతో సంభాషించే తీరుతెన్నులను సమూలంగా మార్చి మెరుగుపరిచే అవకాశం ఈ కొత్త రంగం అందిస్తుంది.

**mNLP అంటే?**

mNLP లో సహజ భాషలను అర్థం చేసుకోవటం(నాచురల్ లాంగ్వేజ్ అండర్స్టాండింగ్), సహజ భాషల పాఠ్యాన్ని సృజన చేయడం(నాచురల్ లాంగ్వేజ్ జెనరేషన్) అనే రెండు ముఖ్యమైన పనులకు పాఠ్యేతర సహజ భాషా వనరులను వినియోగిస్తాము. ఉదాహరణకు, mNLP ఒక బొమ్మకు శీర్షిక రాయవచ్చు లేదా ఒక దృశ్యకానికి ఉపశీర్షికలు సృజించి, వాటిని వేరే భాషలకు అనువాదం చేయవచ్చు.

**mNLP ఎందుకని అవసరం?**

నేడు mNLP అవసరం చాలా ఉంది. mNLP సంగణక యంత్రాలతో మరింత సహజంగా, అవలీలగా సంభాషించే వీలును చేకూరుస్తుంది. ఉదాహరణకు, ఒక ప్రశ్నను టంకించి(టైప్ చేసి) అడిగే బదులు నేరుగా ఒక బొమ్మను చూపిస్తే ఆ బొమ్మలోని వస్తువును సంగణక యంత్రం మనకు వెతికి చూపిస్తుంది. లేదా ఒక పొడవాటి పాఠ్య పత్రాన్ని చదివే బదులు కంప్యూటర్ చదివితే మనం వినవచ్చు.

**mNLP ప్రయోజనాలు:**

ఎచీూా పూర్తి స్థాయిలో తయారు చేసుకుంటే ఎన్నో ఉపయోగాలు, ప్రయోజనాలు ఉన్నాయి. వాటిలో కొన్ని:

1.యంత్రానువాదం: mNLP వాడి యంత్రానువాదాన్ని మెరుగు పరచవచ్చు. బొమ్మలు, శ్రవ్యకాల తోడ్పాటుతో అనువాదం జరుగుతున్న సందర్భం తెలియవస్తుంది. సందర్భంతో కూడిన అనువాదం, సందర్భరహిత అనువాదం కన్నా మెరుగ్గా వస్తుంది.

2.బొమ్మలకు శీర్షికలు: mNLP బొమ్మలకు శీర్షికలను సూచించగలదు. ఈ శీర్షికలున్న బొమ్మలు, బొమ్మలను చూడలేని గుడ్డివారికి లేదా వేరే దృశ్యాన్ని చూస్తూ బొమ్మలో ఉన్న విషయాన్ని తెలుసుకోవాలనే వారికి బొమ్మలోని విషయాలను అర్థమయ్యేలా చెప్పగలవు.

3.దృశ్యక సారాంశం: mNLP వాడి మనం దృశ్యకాలకు సారాంశాలను రాయగలుగుతాం. ఎక్కువ నిడివి ఉన్న దృశ్యకాలు చూడలేని వారికి ఆ దృశ్యకంలో ఉన్న ప్రధానాంశాలు ఈ సారాంశం చదవడం వలన తెలిసి వస్తాయి.

4.ప్రశ్న జవాబు వ్యవస్థ(క్వెశ్చన్ ఆన్సర్ సిస్టమ్): mNLP వాడుకొని పాఠ్యేతర బొమ్మ-శ్రవ్యక-దృశ్యక రూపాల్లో ప్రశ్న జవాబు వ్యవస్థను తయారు చేసుకోవచ్చు. అప్పుడు యంత్రాలకు వివిధ వైకల్యాలున్న వ్యక్తులకు వారి ప్రశ్నలకు జవాబులు అందించే సామర్థ్యం పెరుగుతుంది.

5.బోధన: బోధన కేవలం పాఠ్య రూపంలో ఉంటే విద్యార్థులకు వివిధ పాఠ్యాంశాల ఆకళింపు పరిమితంగా జరుగుతుంది. అదే బోధన దృశ్య-శ్రవణ రూపంలో జరిగితే అది విషయ పరిగ్రహణలో దోహద పడుతుంది. mNLP వివిధ మాధ్యమాలలో(దృశ్యక, శ్రవ్యక, బొమ్మల రూపంలో) పరస్పర సంభాషణల(ఇంటరాక్టివ్)కు సహకరించే బోధనావనరులను సృష్టించడంలో ఎంతో సహాయ పడుతుంది.

**బహుప్రకార సహజభాషా ప్రక్రియ ముందున్న సవాళ్ళు :**

mNLP ప్రక్రియను రూపొందించడంలో పలు సవాళ్ళున్నాయి. కొన్ని సవాళ్ళను ఇక్కడ చర్చించుకుందాం:

✔ సమాచార విరళత(డేటా స్పేర్సిటీ): సహజ భాషల్లో పాఠ్య రూపంలో ఉన్న వనరులతో పోల్చుకుంటే దృశ్యక, శ్రవ్యక, బొమ్మల రూపాల్లో ఉండే సమాచారం చాలా తక్కువ. ఈ తక్కువగా ఉన్న సమాచారం కూడా ఒకే చోట లభ్యమవదు. శ్రవ్యకాలు గ్రామఫోన్ వినైల్ రికార్డుల రూపంలో, ఆడియో క్యాసెట్లుగా, సీడీలుగా, ఇలా వివిధ రూపాల్లో నేరుగా వాడుకునేందుకు అలభ్యంగా ఉన్నాయి. ఈ వనరులను ఒక చోటకు తెచ్చుకొని పని చేయడం పెద్ద సవాలు.

✔ నకలుహక్కుల సమస్య(కాపీరైట్): పాఠ్యం రూపంలో ఉన్న వనరులకు ఉన్నట్టే దృశ్యక-శ్రవ్యక-బొమ్మ రూపంలో ఉండే సహజ భాషా వనరులకు కూడా కాపీరైట్ సమస్య ఉంది. ఆయా దేశాల చట్టాల ప్రకారం ఈ వనరుల వినియోగంపై కట్టడి ఉండటం వలన ఈ వనరులను పరిశోధనకు వినియోగించుకోవటంలో సమస్యలున్నాయి.

✔ అసమానత: వివిధ రూపాల్లో ఉండే వనరులను సమాన స్థాయికి తెచ్చుకోవడం ఒక పెద్ద సమస్య. పాఠ్యంలో వంద పేజీల నిడివి ఉన్న పాఠ్యానికి దృశ్యక రూపంలోనో, శ్రవ్యక రూపంలోనో పది పేజీల వనరు మాత్రమే లభ్యమవుతుంది. మిగితా భాగం ఆ వనరులో అలభ్యం. ఇంకొన్ని సందర్భాలలో ఒక రూపంలో ఉండే వనరులోని సంగతులు మరొక రూపంలో లభ్యమైన వనరులోని సంగతులు సరిపోలవు. ఏది సరైనదో, ఏది మార్పు చెందిందో తెలుసుకోవటానికి వేరుగా పరిశోధనలు చేసుకోవాలి. ఇది శ్రమ, సమయం, ఖర్చుతో కూడుకున్న అంశం.

✔ సందర్భం: కొన్ని వనరులలో, ముఖ్యంగా శ్రవ్యక రూపంలో ఉండే వనరులలో పాఠ్యంతో పోల్చుకుంటే మరింత మెరుగైన సందర్భం కానవస్తుంది. ఉదాహరణకు 'కులాసానా?' అన్న పాఠ్యం

చదివినపుడు చెప్పిన వ్యక్తి స్వభావం, చెప్పిన సందర్భం మనకు అర్ధమవదు. అదే శ్రవ్యక రూపంలో విన్నా, దృశ్యక రూపంలో చూసినా ఒకవేళ చెప్పిన వ్యక్తి నేరుగా కుశలప్రశ్న అడిగాడా లేక వెటకారంతో కూడిన భావనలో అడిగాడా అన్నది తెల్లమవుతుంది. ఇలా సందర్భాన్ని బట్టి భావాలను, ఒకే పాఠ్యానికి ఉండే వేరు వేరు అర్థాలను తెలుసుకోవటానికి యంత్రాలకు ఇంకా సమయం పడుతుంది. అప్పటి వరకూ కొన్ని వనరులలో వచ్చే మాటలకు అసందర్భ అర్థాలను యంత్రం మనకు సూచించే ప్రమాదం ఉంది.

**బహుప్రకార సహజభాషా ప్రక్రియ ఉదాహరణ:**



పై బొమ్మను ఇచ్చినపుడు సాధారణ శీర్షిక జనకం(క్యాప్షన్ జనరేటర్) గుర్రం, మనిషి, నక్షత్రాలున్న ఆకాశం అని జవాబిస్తుంది.

అదే బహుప్రకార సహజభాషా ప్రక్రియ ఈ బొమ్మకు, "నక్షత్రాలతో కూడి ఉన్న నల్లటి ఆకాశం వెనుతలంలో తెల్లని గుర్రాన్ని స్వారీ చేస్తున్న తెల్లని వ్యోమగామి దుస్తుల్లో ఉన్న వ్యక్తి. గుర్రపు కళ్ళేన్ని పట్టుకుని కుడి వైపుకు చూస్తున్నాడు." అని శీర్షిక తయారు చేసి ఇస్తుంది.



పై బొమ్మలో చూపించిన విధంగా మనం ఇచ్చిన బొమ్మలోని వివిధ అంశాలను కన్వల్యూషనల్ న్యూరల్ నెట్వర్క్ గుర్తిస్తే, ఆ అంశాలను ఆధారం చేసుకుని భాషా సృజన చేసే రికరెంట్ న్యూరల్ నెట్వర్క్ పూర్తి శీర్షిక పాఠ్యాన్ని రూపొందిస్తుంది.

**ఉపసంహారం:**

mNLP అనేది కంప్యూటర్లు మరియు మన చుట్టూ ఉన్న ప్రపంచంతో మనం పరస్పర చర్య చేసే విధానాన్ని విప్లవాత్మకంగా మార్చగల సామర్థ్యంతో వేగంగా అభివృద్ధి చెందుతున్న రంగం. ఇంకా పరిష్కరించాల్సిన అనేక సవాళ్ళు ఉన్నప్పటికీ, mNLP ఇప్పటికే విస్తృత శ్రేణి వినూత్న అప్లికేషన్లను అభివృద్ధి చేయడానికి ఉపయోగించబడుతోంది.


మూలాలు, వనరులు, ఉపయుక్త పత్రాలు:

1. 1. Multimodal Natural Language Processing, Jon Gillick, UC Berkely
2. Introducing the modalities, Cem Akkus, Vladana Djakovic, Christopher Benjamin Marquardt, LMU ` München

3. కార్నెగీ మెల్లన్ విశ్వవిద్యాలయ వారి మల్టిమోడాల్ కమ్యూనికేషన్, మెషిన్ లర్నింగ్ లేబరేటొరీ వారి పరిచయ కోర్సు

4` TWIML AI పాడ్కాస్ట్ లో మల్టిమోడాల్ ఎన్ఎల్పి పై జరిగిన చర్చ వీడియో.



వ్యాసకర్త అనువర్తిత భాషా శాస్త్ర, అనువాద అధ్యయనాల కేంద్రం, హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయంలో పరిశోధక విద్యార్థి.




పప్పల వెంకటరమణ
9491811710

# సంచారజాతి ఏనాదులు - సాంఘిక జీవనం

ఏనాదులు ఒక అనాగరిక జాతి. అనగా ఒక సంచార గిరిజన తెగకు చెందిన ప్రజలు. ఏనాది కులము ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ తెగల జాబితాలో 32వ కులము. నల్లమల అడవుల నుంచి నెల్లూరు సముద్రతీరము వరకు, చిత్తూరు జిల్లాలో విస్తరించిన ఏనాదులు సామాజిక పరిణామములో సేకరణ కొరకు అడవులలో జీవిస్తూ అటవీ ఫలసాయం ఆధారంగా బతుకు జీవనం చేస్తూ, కాలక్రమేణా మారుతున్న జీవన వైవిధ్యాన్ని దృష్టిలో ఉంచుకొని అడవులకు దగ్గరగా గ్రామాలను ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్న గిరిజన జాతి. వీరు ఈనాటికి సమాజాభివృద్ధికి దూరంగా సంచారజాతిగా ఉన్నారు.

తెలుగు భాషలోని చాలా పదాల లాగే ఏనాదులు అనేది ఒక సంస్కృతపదం నుండి పుట్టిన పదంగా తెలుస్తున్నది. కానీ దీనిపై భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. ఈ పదాన్ని రెండు విధాలుగా అర్థం చేసుకోవచ్చు. ఏనాది అనేది అనాది యొక్క శబ్ద రూపాంతరం కావచ్చు. అనాది అనగా ఆది లేనిది, అంటే మొదలు లేనిదని అర్థం. అంటే అప్పట్లోని మిగతా తెగలవారికి వీరి యొక్క మూలం తెలిసి అలా వ్యవహరించి ఉండవచ్చు. ఒక విధంగా వీరు పురాతనమైనవారు అని అర్థం వస్తుంది.

యానాదుల ఆహారపు అలవాట్లను బట్టి మరియు వృత్తులను బట్టి వారిని నాలుగు రకాలుగా వర్గీకరించిరి. మంచియానాదులు లేదా రెడ్డియానాదులు, అడవియానాదులు, పాకీయానాదులు, చల్లయానాదులు. 2011 జనాభా లెక్కల ప్రకారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో వీరి జనాభా 5,37,808.

ఏనాదులు చిన్నచిన్న గుడిసెలలో నివసింతురు. సామాన్యంగా ఆ గుడిసెలు రెండు మూడు గజముల మధ్య కొలతలు గలవిగా ఉండును. తెల్లవారుజాముననే వేటకు పోవుదురు. సాయంకాలము నాలుగైదు గంటలకు తిరిగి వస్తారు. వేటకు పోయినప్పుడు వారి గుడిసెలలో పదార్థములు ఏమి కనపడవు. మట్టిముంతలు, చేటలే కనిపించును. గుడిసెలలో జానెడు లోతున మంచి ఇసుక ఉంచుదురు. మెత్తదనం కోసం చేర్చినట్టు తెలుసుకొనవచ్చును. ఆ ఇసుకను తొలగించి చూడగా అడుగున నేలలోనికి పెద్ద పెద్ద కుండలు పాతియుండును. వాని మూతులపై కొయ్యచెక్కలు గాని, సీసా రేకులు గాని మూసి, మీద ఇసుకను కప్పుదురు. సామాగ్రి ఆ కుండలలో నుండును. చిరకాలాభ్యాసం ఏ విద్యలో అయినను చురుకును కలిగించును కదా! మోసగించటంలో ఏనాదులకు చురుకు ఎక్కువ.

వీరు కూలి నాలి చేసుకుని జీవించుటకు సాధారణంగా అంగీకరింపరు. వేటయే ప్రధాన జీవనాధారము. నక్కవేట నేర్చిన గాని పెళ్లి చేసుకోరాదు. పెండ్లికిముందు పెండ్లికొడుకు వేటాడి నక్కనుతెచ్చి దాని మాంసంతో కులము పెద్దలకు విందు చేయవలెను. స్త్రీకి యుక్త వయసు వచ్చిన తరువాతగాని వివాహము జరగదు. పెళ్లాడుటలో పిల్లదే స్వాతంత్రము గాని తల్లిదండ్రుల యంగీకారముతో పనిలేదు. స్వయంవరం వంటిదే. ఆలుమగలు చెట్టపట్టుకుని మండలాకారముగా నృత్యం చేయుట పెండ్లికి ప్రధానతంతు. స్త్రీ యెన్ని వివాహములైన చేసుకోవచ్చును. ఒక మగని విడిచి మరియొకని పెండ్లాడినా నింద పురుషునికిగాని స్త్రీకిగాదు. ఆలిని తిన్నగా నడుపుకోలేక పోయినాడని కులమువారు గర్హింతురు. వ్యభిచారము మిక్కిలి నింద్యము. స్త్రీ కంటే పురుషునికి మిక్కిలి నింద్యము. పురుషుడు తప్పుగా ప్రవర్తించినట్టు తెలిసినచో స్త్రీ మిక్కిలి గోలచేసి వానిని విడనాడను. ఒక పెండ్లామున్నను మరొకరిని పెళ్లి చేసుకోవచ్చును. శవమును దహింతురు. కులమువారందరూ త్రాగి సహభోజనం చేయుట వీరి దైహికకర్మము. గ్రామముల మూలమున కంటే అడవుల మూలమున వీరికి ఎక్కువ జీవనము జరుగును.

నేర్పుతో త్రాచుపాములను పట్టి గరళము పిండుదురు. తేనెతుట్టెలను సులువుగా పట్టగలరు. పొడుగాటి గడకు చివర గుడ్డపీలికలుకట్టి నిప్పు ముట్టించి తేనెతుట్టె దగ్గరగా పట్టుదురు. ఆ సెగకు, ఆ పొగకు తేనెటీగలు ఉక్కిరిబిక్కిరి అయి చెల్లాచెదురుగా పారిపోవును. మరి కొంతసేపటికి ఆ తేనెను సులభముగా తెచ్చుకుందురు.

ప్రొద్దున్న వేటకు వెళ్లి తొమ్మిది పది గంటలు అయ్యేసరికి చల్లని ఆహారము భుజింతురు. అది ఏదనగా ఆరబండిన రక్కెసపండ్లు నూగురాల్చి 15 నుండి 20 వరకు తిందురు. ఎండవేడిమిని రానీయదట. చల్లగాఉండి ఓపికనిచ్చునట. వడదెబ్బ తగిలినవారికి ఈ ఆహారమునే పెట్టుదురు. ప్రసవించిన నాటినుండి కూడా స్త్రీ పనీపాటులు చేసుకొనును. పిల్ల ఒడిలో నుండును. ప్రసవించిననాడు బాలింతరాలు కుంకుడు వేళ్ళు నమలవలెను. అదే వారికి ఔషధము. కారుచేదుగా నుండు కుంకుడువేళ్ళను నమలగలుగుటకు వెర్రి తీపిగానుండు గురివింద ఆకును కూడా తోడు చేయుదురు.

ఏనాదులు ఎలుకలు, ఉడుతలు, పాములు మొదలు వాటిని పట్టడంలో నిష్ణాతులు. వేసవి కాలమందు ఎలుకలవేటలో ఎక్కువగా పాల్గొందురు. బహుచాతుర్యముతో ఎలుకలను పట్టుదురు. పొలములలో వాటి కన్నములను గుర్తించి తవ్వి కుంచెడు రెండు కుంచములుగా ఆ కన్నముల నుండి ధాన్యమును సంపాదించుదురు. గ్రామాలలో రైతుల పొలాలలో కూలికి ఎలుకలు పడుతూ కొంతమంది జీవిస్తున్నారు. ఈతాకులను చాపలుగా అల్లి అమ్ముదురు. నేలగుమ్ముడు, భూశర్కర, ఈశ్వరి మొదలగు ఔషధములు కోరిన వారికి తవ్వి తెచ్చి కొంచెం విలువకే అమ్ముదురు. వసంతఋతువులో తేనె, మైనము, తుమ్మబంక అమ్ముదురు. అద్దపు పెంకులు విరిచి తామే క్షవరము చేసుకొందురు. పురుషుడు ఎంత పాటుపడునో స్త్రీ కూడా అంతే పాటుపడును. స్త్రీకి నాజూకుతనం లేదు. కాబట్టి పురుషునకు కొదిగియుండును. బ్రాహ్మణుల ఇళ్లలో సంతర్పణలు జరిగితే ఆ ఆకులలోని ఎంగిళ్లు తిందురు. పారవేసిన కూరలు, వగైరాలు గారెలవలే చేసి ఎండించి దాచుకొని అప్పుడప్పుడు ఉపయోగించుకొందురు.

ధనము దాచుకొనుట వలన ప్రయోజనము వారెరుగరు. ధనం దాచుకోరు. త్రాగుడుకై వెచ్చింతురు. నక్కలు దొరకనిచో నక్కలమ్మకు జాతర చేయుదురు. తప్ప త్రాగి చిందులు వేయడమే జాతర. వివిధ పురాణ పాత్రలు కూడా ధరిస్తారు ఏనాదులు ః రంగముః అనే దైవచింతనతో వారి పూర్వీకుల లేదా బాధిత పెద్దల ఆత్మలను లేదా వారు కొలిచే కులదైవాన్ని ఆవాహన చేసుకుని నిజాన్ని నిక్కచ్చిగా చెప్పగలరు. ఉదాహరణకు ఏదైనా వస్తువుపోయినా, కనిపించకుండాపోయినా, ఇంటిబాధలకీ, చీడపీడలకు కులదైవం ఎదుట దీపాన్ని వెలిగించి డప్పుకొడుతూ, వాయిద్యంచేస్తూ, నృత్యంచేస్తూ వారిజాడ తెలుసుకుంటారు. దెయ్యాలంటే యానాదులు భయపడిపోతారు. వీరి మాతృభాష తెలుగు అయినప్పటికీ సరిగా మాట్లాడలేరు. తురకము కలియనే కలవదు. సంస్కృతమును చేరదు. ఎరుకలవారి వలె వీరికి అరవపు సంబంధము అంతగా లేదు. ఉచ్చారణలో పదములు మిక్కిలి కుదిరించబడును. కడపటి అక్షరం ఒకటి రెండింటికి ప్లుతస్వరం కలుగును. వీరిభాష భాషాతత్వ పరిశోధకులకు కొన్ని రహస్యములను తెలుపును. యానాదులు లిఖితభాషను నేర్చుకోవడంలో చొరవ చూపకపోవడం వల్ల వారు మిగిలిన సమాజంలో అభివృద్ధి చెందుతున్న దశను అందుకోలేకపోతున్నారు.

యానాదుల సంప్రదాయ విజ్ఞానాన్ని గుర్తించవలసిన బాధ్యత ప్రజలు, ప్రభుత్వంపై ఉన్నది. చదువుకున్న యానాదులు చైతన్యవంతులై ఈ వివరాలు తెలుసుకొని అటు ప్రభుత్వం ఇటు తమ సమాజంలో మార్పు కోసం కృషి చేయాలి. చట్టాలు, సాంఘిక భద్రతకు పథకాల అమలు, వారి సమాజంలో మార్పు సమన్వయంతో సాధించుకోవడానికి అందరూ వయోజనులను ఓటర్లుగా నమోదు చేసుకొని సంఘటితశక్తితో పనిచేయడం యానాదుల మనుగడకు అత్యవసరం.

ఒక యానాదికి, భూస్వామికి మధ్య జరిగిన సంఘర్షణను డాక్టర్ కేశవరెడ్డి ః చివరి గుడిసెః నవలలో చిత్రించారు. ప్రసిద్ధ పరిశోధకులు వెన్నెలకంటి రాఘవయ్యగారు యానాదులపై చేసిన పరిశోధనకు గుర్తింపుగా ఆయనను ః యానాది రాఘవయ్యగాః పిలుస్తారు. ఎన్. విజయరామరాజు ః యానాదుల దిబ్బః అనే కథ రాసి ప్రసిద్ధి పొందిరి.

ఈ విధంగా సమాజానికి దూరంగా అనాగరిక జీవనం సాగిస్తున్న ఆదిమ సంచారజాతి ఏనాదులు.

**ఆధార గ్రంథములు:**


1. యానాదుల సామాజిక ఆర్థిక పరిస్థితులు – డాక్టర్ పి. శివరామకృష్ణ , 2014.

2. వ్యాస మంజరి – వేటూరి ప్రభాకర శాస్త్రి గారు, మణిమంజరి ప్రచురణలు, హైదరాబాద్– 1988.

3. జానపదం – జనపదం – యానాదితెగ జీవన విధానం – శ్రీ భోజన్న.

4. తెలుగు జాతికి ఆద్యులు యానాదుల భాషా సాహిత్య సర్వస్వం – శ్రీ కత్తి పద్మారావు



రచయిత శ్రీకాకుళం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల (పురుషులు)లో తెలుగు విభాగాధిపతి



మండలి ఫౌండేషన్

# తెలుగు జాతీయగీత రచనల పోటీ ఫలితాలు

## మండలి ఫౌండేషన్ చైర్మన్ శ్రీ మండలి బుద్ధప్రసాద్ ప్రకటన

**తెలుగుజాతి మహోన్నతను, తెలుగు భాష తియ్యందనాన్ని చాటే విధంగా తెలుగువారిలో జాతీయాభిమానం ఉప్పొంగేలా మండలి ఫౌండేషన్ ద్వారా గీత రచనలను ఆహ్వానించాం.ఈ ఆహ్వానానికి స్పందించి పెద్ద ఎత్తున 285 గేయాలు రావడం ఆనందించవలసిన విషయం. రచయితలకు అభినందనలు, న్యాయ నిర్ణేతలకు అభినందనలు**

**విజేతలు:**

**ప్రథమ: కృష్ణానదీ గలగలలో....... శ్రీదేవి శ్రీకాంత్ ..... బొబ్బిలి**
**ద్వితీయ: విరబూసిన మల్లె వనం... వై.హెచ్.కె.మోహనరావు.... పిడుగురాళ్ళ**
**తృతీయ: ఆంధ్రభూమికి వందనం....చిటిపోలు వెంకటరత్నం.... . గుంటూరు**

**ప్రత్యేక పురస్కారాలు**

**1. స్వచ్ఛ మైన పునుగు ......... రాంభట్ల నృసింహ శర్మ..... విశాఖపట్నం**
**2. తెలుగు తల్లికి వందనం చేద్దాం .. బులుసు వెంకటేశ్వర్లు ..... చిట్టి వలస - విశాఖపట్నం**
**3. పాలేటి చూలి ......... వలివేటి వెంకట శివరామకృష్ణమూర్తి .. మంగళగిరి**
**4. కళల పందిరి తెలుగు......... డా.మల్లేపూడి రవిచందర్ ..... హైదరాబాద్**
**5. సాటిలేని మేటి భాష ......... పల్లి నల్లనయ్య ..... విశాఖపట్నం**
**6. తెలుగుజాతికి వందనం ......... డా.రాధాశ్రీ ..... హైదరాబాద్**

న్యాయ నిర్ణేతలు: డా.బూదాటి వెంకటేశ్వర్లు, డా. టి.గౌరీ శంకర్, డా.గుడిసేవ విష్ణుప్రసాద్

టేకుమళ్ళ వెంకటప్పయ్య
9490400858

# మాండలికాలను సమాదరిస్తేనే భాషకు అభ్యున్నతి

మాండలిక భాష అంటే ఒక మండలం లేదా ప్రాంతంలో మాట్లాడే భాష అని చెప్పుకోవచ్చు. మానవ జీవన విధానంలో మార్పులు చోటుచేసుకున్న విధంగానే జీవద్భాషకు మార్పులు అనేవి సహజసిద్ధంగానే జరుగుతూ ఉంటాయి. ఈ మార్పుల వలన భాషలో బహురూపత, వైవిధ్యాలు ఏర్పడతాయి. ఈ విధంగా ఏర్పడ్డ భాషలోని వివిధ మార్పులనే మాండలికాలు అని పిలుస్తారు. భాష ఏదైనా దానికి మౌలికమైన ఒక విధానం ఉంటుంది. అయితే పల్లె పట్టులలో అనుశ్రుతంగా వస్తున్న వాక్యాలతో సహజంగా మాట్లాడుకోవడం ఉంటుంది. ఆ భాషా స్వరూపం ఆయా ప్రాంతాలలో వీచే పైరగాలంత స్వచ్ఛంగా, సుమధురంగా వుంటుంది. తెలుగు భాషలో తీసుకొంటే ఒక్కో ప్రాంతానికి ఒక్కొక్క మాండలికం వుంది. భాష లిపి, తీరు ఒకటే అయినప్పటికీ మాటల తీరు, యాస వేరువేరుగా ఉంటుంది. ఇలాంటి తీరునే పండితులు 'మాండలికం' అని పిలుస్తారు. వాస్తవానికి భాషలో మొదట ఉండేది మాండలికమే! ప్రతి రాష్ట్రానికి ఉండే ప్రధాన భాషకు ఆ ప్రాంతంలోని వివిధ మండలాల్లో మాట్లాడుకునే భాషకు కొంత వ్యత్యాసం సహజంగానే ఉంటుంది. కాబట్టి మాండలిక భాషను ఉపభాష లేదా ప్రాదేశిక భాష అని కూడా పిలుస్తూ ఉంటారు.

ప్రతి భాషకీ మాండలిక భేదాలున్నట్టుగానే, తెలుగుకీ చాలా ఉన్నాయి. భౌగోళిక పరిస్థితులను బట్టీ, పాలకుల భాషను బట్టీ, కులమతాలను బట్టీ, వృత్తిని బట్టీ మాండలికాలు సహజంగా ఏర్పడతాయనే విషయం అందరికి తెలిసిందే. ఉదాహరణకి చెప్పుకోవాలంటే తెలంగాణ తెలుగుపై మొదట తమిళ, కన్నడ భాషల ప్రభావమూ, ఆ తరవాత ఉర్దూ ప్రభావమూ పడటం వల్ల ఒక ప్రత్యేకత సంతరించుకున్నది. భౌగోళిక, చారిత్రక కారణాల రీత్యా రాయలసీమ తెలుగుపై తమిళ, కన్నడ భాషల ప్రభావం ఇప్పటికీ చాలా ఎక్కువగా ఉండటం వల్ల అదో భిన్నమైన ప్రత్యేకతను సంతరించుకున్నది. కోస్తాంధ్ర తెలుగుపై సంస్కృతం, ఇంగ్లీషు ప్రభావం ఎక్కువగా ఉండటం వల్ల అదో ప్రత్యేకతను సంతరించుకున్నది. అలాగే నెల్లూరు జిల్లా ప్రాంతంలో తమిళ ప్రభావం చాలా ఎక్కువగా ఉంది. ప్రాంతాలను బట్టి వేరువేరు మాండలికాలు ఉన్నప్పటికీ తెలుగులో ప్రధానమైన మాండలిక భాషలు నాలుగున్నాయి. అవి 'రాయలసీమ భాష' అంటే చిత్తూరు, అనంతపురం, కర్నూలు, కడప, నెల్లూరు జిల్లాల భాష. 'తెలంగాణ భాష' అంటే తెలంగాణ ప్రాంతంలో మాట్లాడే భాష, 'కోస్తాంధ్ర భాష' అంటే కృష్ణా, గుంటూరు, గోదావరి జిల్లాల భాష, 'ఉత్తరాంధ్ర భాష' అంటే విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల భాష. నేడు తెలంగాణా ప్రత్యేక రాష్ట్రంగా విడిపడ్డప్పటికి అక్కడ కూడా తెలుగే ప్రధాన భాష. ఏ భాషా మాండలికాలైనా ఒక దానితో మరొకటి కలుస్తున్న సరిహద్దుల్లోనే కాక అన్యభాషా ప్రాంతాల పొలిమేరల్లో కలిసేచోట పరస్పర ప్రభావం తప్పకుండా వుంటుంది. ఇవేకాక తెలుగువారి వలసల కారణంగా ఏర్పడ్డ మాండలికాలు ఎన్నో వున్నాయి.

తెలుగు భాషా సంపూర్ణ స్వరూపం సాక్షాత్కారం చెయ్యడానికి, భాషకు, ప్రజాజీవితానికి గల పరస్పర సంబంధ పరిణామాలను అర్థం చేసుకోవడానికి, తెలుగు భాషను ప్రామాణీకరించడానికి, దేశ్యపదజాలాన్ని ప్రమాణభాషలో లయం చేయడానికి, తెలుగు పరిసర భాషలతో గల తులనాత్మక సంబంధాన్ని నిరూపించడానికి, వృత్తి మాండలిక పదకోశాలను తయారుచేయడం సామాన్యమైన కార్యమేమీ కాదు. తెలుగు భాషలోని మట్టివాసనలు పట్టివ్వడానికి ఈ మాండలిక పదసేకరణ గ్రంథాలు ఎంతగానో తోడ్పడ్డాయి. భాషకు సంబంధించిన ఎన్నో రహస్యాలు ఈ పదకోశాల వల్ల మనకు పూర్తి అవగాహనకు వచ్చాయి. మన పాత తరం వారు వాడి, ప్రస్తుతం మనం ఎరుగని పదాలు, పదాలు తెలిసినా అర్థాలు తెలియక వదలివేసిన అనేక పదరత్నాలు ఈ సందర్భంగా వెలుగులోనికి వచ్చాయి.

తెలుగు భాష సజీవంగా ఉండాలంటే, మనుగడ సజావుగా సాగాలంటే, వివిధ ప్రాంతీయ మాండలికాలకు, 'యాస'లకు ఊపిరులూది మాండలిక పదసంచయాలను ఎప్పటికప్పుడు కాపాడుకుంటూ ప్రతి తెలుగువాడు ముందుకు సాగవలసిన అగత్యం ఎంతో ఉంది. ప్రాంతీయ సమైక్యతా లోపానికి బాంధవ్య బంధనల బలహీనతలకు ముఖ్యకారణం మాండలికాలను పరస్పరం హేళన చేసుకోవడమే నన్న మాట సత్యం. ఎవరి యాస, ఎవరి మాట, ఎవరి ఉచ్చారణ, ఎవరి వ్యక్తీకరణారీతులు వారికి భవ్యమైన తీరులు. వివిధ మాండలిక సౌందర్యాలనంతటిని ఒడిసిపట్టుకోవడం అంత సులభమేమీ, ఇటు శ్రీకాకుళం నుండి అటు తడవరకు, ఇటు అనంతపురం, అటు ఖమ్మం, అదిలాబాద్, వరంగల్, నిజామాబాద్ వరకు ఎన్నెన్నో తెలుగు మాండలికాలు వాడుకలో ఉన్నై. ప్రతీ మాండలికం లోను ఒక ప్రత్యేకమైన 'యాస' వెన్నుదన్నై, ఆయా మాండలికాలను సజీవంగా నిలిపి వుంచుతున్నాయి. ప్రభుత్వాలు అన్ని విద్యాలయాలలోనూ తెలుగుకు ప్రాధాన్యత ఇవ్వవలసిన అవసరం వుంది. ప్రభుత్వ విద్యాలయాల్లో ఆర్థికనిర్బంధం వల్ల విద్య నభ్యసిస్తున్న పేదప్రజలే తెలుగును బ్రతికిస్తున్నారనడని ఒక భాషావేత్త అనడంలో ఔచిత్యం ఉంది.

తెలంగాణాప్రాంత మాండలికానికి వస్తే ఖమ్మం జిల్లాలో మూడు రకాల యాసలు కాక ఆటవికుల సంచార జాతీయుల తెలుగు భాషోచ్చారణలో ఎన్నో వైవిధ్యాలున్నై. అలాగే నల్గొండ జిల్లాలో నాలుగు రకాలు, వరంగల్ ప్రాంతంలో ఉన్న భాషా రీతికి, కరీంనగర్జిల్లా మాండలిక ఉచ్చారణలో మరెన్నో వైవిధ్యాలు. మెదక్, నిజామాబాదు, మహబూబ్ నగర్ జిల్లాల్లో ఉచ్చారణ అత్యంత వైవిధ్యంగా ఉంటుంది. ప్రపంచీకరణ, అర్బనైజేషన్, ఉపాధికొరకు ఉరుకులు మాండలిక తీరులలో మార్పులకు కారణమైతే, రంగారెడ్డి జిల్లా హైదరాబాద్ జిల్లాల్లో

ప్రాంతీయ మాండలికం తన స్వరూపంలో పెనుమార్పులకు తావిచ్చిందనడం వాస్తవం. ప్రాంతీయ మాండలికం లో తన స్వతః స్వరూపాన్నినిలబెట్టుకున్న జిల్లా గా ఆదిలాబాద్ జిల్లాను ప్రముఖంగా చెప్పుకోవచ్చు. ఇలా రెండు తెలుగు రాష్ట్రాలలోని వివిద మాండలికాలలో ఓ ప్రత్యేకత, ఓ మహత్తర సౌందర్యం ఇమిడి వుంది. దాన్ని ప్రజలు పట్టుకోవాలంటే నిరంతర పరిశీలన, సాధన అవసరం. వాచికం, ఆంగికం, పదాల విరుపులు, పద అర్ధ విన్యాసాలు చాలా మటుకు నిఘంటువులకు అందనివే అవడం గమనించవచ్చు. ఇన్ని రకాల వైవిధ్యాలున్నప్పటికి, మాండలికాలను పరిపోషించే విషయంలో ఆంధ్రప్రదేశ్ కంటే తెలంగాణా రాష్ట్రం ముందు వరుసలో ఉంది. తెలంగాణా పాఠ్య గ్రంధాలలో మునుపటి ప్రామాణిక భాష బదులు తెలంగాణా భాష రంగప్రవేశం చేసింది. అంతే కాదు, ఆంధ్రప్రదేశ్ మాండలికాలలో కథలు, నవలలు, నాటకాలు మాత్రమే వచ్చాయి. తెలంగాణా వారు కవిత్వం విషయంలోను ఆంధ్రప్రదేశ్ కంటే ముందు నిలబడ్డారు. వచన కవితారూపంలో భాషాపరమైన పరిణామం ఇంకా వికాసవంతమై అట్టడుగు వర్గాలకు చేరువవ్వాలనే ఉద్దేశంతో మాండలికాన్ని కవిత్వంలో ప్రయోగించటం జరిగింది. లయాన్వితమైన ప్రజాపోరాట పాటల్లో జనం ఉచ్చారణ విధేయమైన మాండలిక భాష అద్భుతంగా అమరింది. ఇదే విధానాన్ని వచన కవిత్వంలో ప్రవేశపెట్టాలని చేసిన ప్రయోగమే 'మాండలిక కవిత్వం'. ఆంధ్రప్రదేశ్లో ఇంకా బాల్య దశలోనే ఉండగా తెలంగాణలో విస్తృతంగా మాండలిక కవిత్వం రాసిన దేవరాజు మహారాజు 1974లో 'గుడిసె గుండె' పేరుతో, పంచరెడ్డి లక్ష్మణ 1973లో "ఇసిత్రం", తెలిదేవర భానుమూర్తి 1983లో "ఊరోల్లు", టి.కృష్ణమూర్తి యాదవ్ 'తొక్కుడుబండ'ఈ కోవలోవే. 2021 సం.లో తెలంగాణా భాషలో వ్రాసిన "దండకడియం" అనే కవితా సంపుటికి, తగుళ్ళ గోపాల్ అనే యువకవికి, సాహిత్య అకాడెమీ పురస్కారం రావడంతో మాండలిక భాషల్ని ఏవగించుకునే భాషా వేత్తలు ఒక్కసారి ఉలిక్కిపడ్డారు.

ముఖ్యంగా ఒకరి మాండలికాన్ని మరొకరు పరస్పరం గౌరవించుకొనే రీతిన సామాజిక బంధనాలను, బలోపేతం చేయవలసిన ఆవశ్యకతను ప్రభుత్వాలు ,సాంస్కృతిక సంస్థలు గుర్తించి సత్వర చర్యలు చేపడితే తెలుగు భాషకు పూర్వ వైభవం చేకూరుతుందని పెద్దలు అభిప్రాయపడ్డంలో ఎంతో అర్థం ఉంది. అంతర్జాల మాధ్యమం తెలుగు భాషోన్నతికి ఔత్సాహిక యువశక్తికి ప్రోత్సాహాన్నందిస్తూ తనవంతుగా ప్రోత్సహిస్తోంది. మాండలికాలలో మాట్లాడుకోవడం, ఒకరి మాండలికాన్ని మరొకరు హేళన చేయకుండా ఒకరికొకరు మాండలికాల యాసను గౌరవించుకుంటూ వివిధ మాండలిక సౌందర్యాలను ఆస్వాదించడం ప్రసుత కర్తవ్యం. ప్రాంతాలు వేరైనా భాషను సుసంపన్నం చేసుకొని భావసమైక్యత సాధించే దిశగా ముందుకు సాగాలి. ఇటీవల జూలై నెలలో కేంద్ర సాహిత్య అకాడమీ ద్వారా, ఈశాన్య రాష్ట్రాలలోని మిజో, గరో, చక్మా, రభ, కర్బి, హమర్, లెప్చ, ఖాసి, తంగు?ల్, మిస్సింగ్, తెనిడియ, కొక్బొరొక్, జైంతియా తదితర గిరిజన భాషలను ప్రోత్సహించేందుకు సాహిత్య కార్యక్రమాలు నిర్వహించింది. అలాగే సాహిత్యఅకాడమీ ప్రాంతీయ మాండలికాలు, భాషలలో ప్రాచీన సాహిత్యం, మధ్యయుగ సాహిత్యం, గుర్తింపు పొందని భాషల సాహిత్యంలో విశేష కృషి చేసిన వారిని భాషాసమ్మాన్ పురస్కారం ద్వారా ప్రోత్సహిస్తోంది.

పల్లె ప్రజలకు, నిరక్షరాస్యులకు కూడా సులభంగా అర్థమయ్యే విధంగా వాడుకభాషలో సరళమైన రీతిలో వెలువడ్డ వేమన పద్యాలు, బ్రహ్మంగారి సాహిత్యమూ, అన్నమయ్య, కంచెర్ల గోపన్న రాసిన కీర్తనలు ఇప్పటికీ ప్రజల ఆదరణ చూరగొంటున్నాయన్న విషయం విస్మరించరాని సత్యాలు. మాండలికాల కోసం ఉద్యమించడం తెలుగు భాషని ప్రేమించేవారి తక్షణ కర్తవ్యంగా భావించి, మాండలికాల్లో రచనల కోసం, అధ్యయనం కోసం జీవభాషను ప్రేమించేవారు ఉద్యమిస్తేనే భాషకు అభ్యున్నతి. అ



శివయ్య రాజులపాటి
9491647639

# స్వభాష

**భాష**-భావ ప్రకటనకు మాధ్యమం. పలుకుబడుల భాష లేని నాడు కూడా భావ ప్రకటన ఉండేది-సైగలు, అరుపులు, రాతి మీద బొమ్మలు, నేల మీద గీతలు,సంజ్ఞాత్మక వస్తువులు, నింగిలోని చుక్కలు, వాతావరణంలోని మార్పులౌఇలా ఎన్నో విధాలుగా తాము చెప్పదలచుకున్నవిషయాన్ని తెలియజేసేవారు. ఇక భావావేశానికి తగినట్టుగా కోపం, అనురాగం ప్రదర్శించేవారు. ఆ భావాలు, అందుకు తగ్గట్టుగా చేసిన శబ్దాలు...ఒకనాటికి భాషను ఏర్పరిచాయ్. కొన్ని తరాల...వేల సంవత్సరాల పరిణామం ఇది,ఇదిగో ఇదే భాష పుట్టిన కాలంఅంటూ ఏదీ ఉండదు, అదొక క్రమాభివృద్ధి. ఇప్పుడు వేల భాషలు అంతరించిపోయాయనీ, మరిన్ని ఆ వరుసలో ఉన్నాయనీ పరిశోధకులు చెప్తున్నారు కదా, అంటే, ఒకనాటి సంజ్ఞలు భాషగా రూపొందినట్టే, జనం వాడుకలో ఉన్న భాష ఎన్నో అడ్డంకుల్ని, దాడుల్ని, ప్రకృతి విపత్తుల్ని భరించి,తమవి కాని సంస్కృతుల అధిపత్యాల వల్ల. . .కృశించిపోతూ ఉండగా...ఆ పరిస్థితులు మెల్ల మెల్లగా భాషల, సంస్కృతుల అంతర్ధానానికి దారి తీసాయి. కారణాలు తెలిసిన మనం, ఇప్పుడు భాషల పరిరక్షణకు నడుం కట్టాలని సదస్సులు నిర్వహించుకుంటున్నామే తప్ప త్రికరణ శుద్ధిగా కృషి చేయడంలేదని చెప్పడం సాహసమేమీ కాదు.

ఇక్కడ వివరాలు ఉటంకించడం ప్రచురణకు సంబంధించిన సూత్రాలకు భంగకరంగా ఉండొచ్చనే ఆలోచనతో వెల్లడించే పని చేయబోవడం లేదుగానీ, గత కొంత కాలంగా, సుమారు దశాబ్దకాలంగా,జోరందుకున్న సామాజిక మాధ్యమాల్లో తాలుగింజలవంటి వాటి ఊసెత్తకున్నా,అచ్చమైన ప్రయోజనాన్ని చేకూర్చే చర్చలు జరిపే వేదికలు లెక్కకు మిక్కిలిగాలేకపోయినా..బాగానే ఉన్నాయి. ఇప్పట్లో ప్రజలకు చేరువౌతున్నవీ ఇవే.నిక్కంగా భాష ప్రామాణికత, వాడుక, రచనా వ్యాసంగం, ప్రచురణ మాధ్యమాల్లో, పరిపాలనా అంశాల్లో,శాసన-కార్యనిర్వాహక-న్యాయ విభాగాల్లో అంతర్గతంగానూ, ప్రజలకు సమాచారం వెల్లడించే విధంగానూ మాతృభాషను ఉపయోగించమని సూచనలు, సలహాలు, ఉత్తర్వులు జారీ చేయబడుతున్నప్పటికీ పూర్తి స్థాయిలో అమలు కావడం లేదని చెప్పడానికి ఎవరూ సంకోచించనవసరం లేదు. ఈ వ్యాసం కూడా భాష ప్రయోజనం భావ ప్రకటనకా లేక ఉద్యోగ సంపాదనకా లేక ఉనికి కోసం..ఉందంటేఉందని..అనుకోవడం కోసమా అని వితర్కించుకుంటూనే వ్రాయడం జరుగుతోంది. విశ్వవిద్యాలయ విద్యార్థుల్లోనే ఇలాంటి సందిగ్ధత ఉంటే భాష మనుగడ ఎలా?ఇది నా ఇంట్లో వాళ్ళే నన్నడిగిన ప్రశ్న అనిఅనుకోవడానికి లేదు,బహుశా భాష కోసం కృషి చేసే వారి కుటుంబంలోనో,పరిచయస్థుల్లోనో, సదస్సుల్లోనో ఈ ప్రశ్న తరచూ ఎదురౌతూనే ఉంటుందని స్వీయ అనుభవంతో చెప్పాల్సి వస్తోంది.

ఒక సంస్కృతి మాయమైపోతుందని, ఒక జాతికి సొంతమైన గుర్తింపు లేకుండా పోతుందని అనుకుంటే భాష మాత్రమే దాన్ని కాపాడుతుందాఅన్నదీ ఆలోచించాల్సిన అంశమే. ఆదిమానవుడిగా ఉన్నవాడు ఆధునిక మానవుడిగా మారినప్పుడు అతనిని తన పూర్వ తరాల నుంచి వేరు చేసింది, ప్రత్యేకంగా మలిచింది, విశిష్టంగా నిలబెట్టిందీ భాషే కదా! తెలిసినదాన్ని నలుగురితో పంచుకోవడానికీ, దాన్ని ముందు తరాలకోసం భద్రం చేయడానికీ, విజ్ఞానాన్ని అక్షరబద్ధం చేసి తరతరాలకూ అందించడానికీ ఉపయోగపడింది భాషయే. కాల ప్రవాహంలో మార్పుచేర్పులు అన్నిటా ఉన్నట్టే, భాషలోనూ చోటు చేసుకుంటాయి. కానీ దాన్ని అంగీకరించాలా వద్దా? ఎందుకని భాష...భాష అంటూ సభల్లో ఎలుగెత్తి చాటుతున్నాం? ఒక ఇల్లు కట్టడానికి మొదట్లో పుల్లలు, గడ్డి, ఆకులు, తీగలు వాడి ఉంటాం. తర్వాత రాళ్లు, మట్టి, నీరు, ఆకులు, కొమ్మలు,దుంగలు వాడి ఉంటాం. ఆపై రాళ్లు, మట్టి, ఇటుక,పెంకు, చెక్క వాడి ఉంటాం. ఆ మీదట సిమెంటు, ఇసుక, కాంక్రీటు, ఇనుము,ఇంకేవో లోహాలు వాడుతున్నాం. ఇప్పుడు 3డి ప్రింటింగ్ ఇళ్ళు కట్టేస్తున్నాం. ఫైబర్, వివిధ లోహ మిశ్రమాలు ఉపయోగించి అవాసాలు నిర్మిస్తున్నాం. ఇపుడు చెప్పండి ఉ ఏది పర్యావరణ హితం, ఏది మనిషి ఆరోగ్యానికి అనుకూలం, ఏది వాతావరణానికి నిర్మలం? బహుశా ఒక దశలో ఆగిపోయి ఉండొచ్చు. కానీ, మానవ అవసరాలు ఇబ్బడిముబ్బడిగా పెంచుకుంటూ పోతున్న వేళ, తక్షణ ప్రయోజనాలు, దీర్ఘకాలిక అవసరాలు తప్పనిసరైన సందర్భాల్లో, నిలకడగా ఉండాల్సిన ప్రకృతి పట్ల ఉదాసీన వైఖరి అవలంయభిస్తున్నాం. ఆరోగ్యం కంటే అవసరమే ముఖ్యం అనుకుంటున్నాం, సొంత ఉనికి కంటే ఆర్భాటమే ప్రధానం అనుకుంటున్నాం, ప్రకృతికి దూరమైనా ఫర్లేదు మన పని ఇప్పటికి ముగిస్తే చాలనుకుంటున్నాం. అందరూ కాదు..ఎంతో మందిమి ఇలానే ప్రవర్తిస్తున్నాం. భాష కూడా ఆరోగ్య, సౌభాగ్య సూత్రమాలికే.భాష ఉన్నది ఏదో ఒకటి మాట్లాడుకోవడానికి కాదు, అర్థవంతంగా, మనోగతాన్ని బయట పెట్టేందుకు అందుబాటులో ఉన్న అతి విలువైన మాధ్యమం ఇది. భాష అక్షరమాలిక కాదు, అది మనోభావాల అల్లిక. దాని పరిమళం ప్రాంతానికొకలాగు. ఈ సుగంధం భాషలన్నిటికీ ఉండుగాక, మాతృభాష లోని పొందిక మాత్రం మరోదానికి రాదు. ఆ సొబగు అమ్మభాషకే సొంతం.

చాలు, ఇక మనం భాష వైపు మరలుదాం నేల నాలుగు చెరగులామనుషులున్నప్పుడు భౌగోళిక, పర్యావరణ, ఆచార వ్యవహారాల రీత్యా వైవిధ్యమైన అలవాట్లు ఉంటాయి. ప్రకృతి ఒక సమయంలో అన్ని చోట్లా ఒక్కలానే ఉండదు. భౌతికశాస్త్రం చెప్పినట్టు భూభ్రమణ, పరిభ్రమణాలు వెలుగు చీకట్లను, ఋతువులను ఏర్పరుస్తూ ఉన్నప్పుడు అవి ఒకేసారి భూగోళమంతటా ఒక్కలానే ఉండవు..లేవు. అదే విధంగా జీవ వైవిధ్యమూ ఉంది. సంస్కృతుల్లో వైవిధ్యమూ విలసిల్లింది. ప్రతిదీదేనికదే ప్రత్యేకం, ఆ వైవిధ్యమే ఆకర్షణ. మనిషికి కుతూహలాన్ని

కలిగించి, ఆ జిజ్ఞాసయే మనిషి మేధో వికాసానికి దోహదం చేసింది. మనిషి తన మేధను, విజ్ఞానాన్ని, భావాన్ని ఆవేశంగానో, అందంగానో వెల్లడించే ప్రయత్నాల పరంపరలో చేస్తూ వచ్చిన శబ్ద రూప ప్రకటన కొన్నాళ్ళకు సంస్కరించబడి భాషగా ఏర్పడింది. లిపి రూపుదిద్దుకుంది. స్థలకాలాలను బట్టి ఎన్నో భాషలు, వాటి లిపులు సృష్టించిన వాఙ్మయం మన వరకూ అందుతూ వచ్చింది. ఇది ఆయా సంస్కృతుల తాలూకూ సౌందర్యం. మనిషి ఉల్లాసానికి, భావ వ్యక్తీకరణకు ఉపయోగపడిన శాబ్దిక ఉపకరణం, అయితే ఇది వాగ్రూపకం-లిఖిత రూపకం రెండు రకాలుగానూ ఉంది. నిజానికి భాష అంటే వర్ణమాల మాత్రమే అనుకునేరు..కానేకాదు. అది ధ్వని.

ఇప్పుడు అసలు విషయానికి వద్దాం, భాష ఎందుకని ఒకటే లేదు? ఉండదు. ఒకటే ఉంటే, మనిషి కూడా ఒక యంత్రం లేదా పనిముట్టుగానే ఉండిపోయేవాడు. భౌగోళిక, రాజకీయ, సంస్కృతుల, పర్యావరణ ప్రభావాల వల్ల తాను తతిమ్మా వారికంటే భిన్నంగా ఉండాలి..అదిప్రత్యేకమైనదై ఉండాలనే కదా, ఒక వస్తువుతో అవసరం పూర్తిగా తీరిపోయినా సరే, కొత్త కొత్తవి కనిపెడుతూ ఉన్నాడు మనిషి. భాష,అందులోప్రాంతానికో మాండలికం, జాతికొకయాస, సమూహానికో పలుకుబడి. ఇవన్నీఅలానే పుట్టాయి. ఇప్పుడు..ఏదో ఒక భాషలో ప్రావీణ్యం ఉంటేనే వెలిగేనుబ్రతుకు..అది రాకుంటే లేకుండెను ఇక మెతుకు - అనిభావిస్తున్నామంటే అది ఖచ్చితంగా పర భాష పెత్తనం అనే కంటే,స్వభాష పట్ల చిన్నచూపు, స్వాభిమానం పట్ల విరక్తి కారణమని చెప్పుకోక తప్పదు. వెలివిద్యలెన్నియున్ననుకులవిద్యకు సాటి రావు గువ్వలచెన్నా-అన్నారు పెద్దలు. అసలు మనకు వైవిధ్యం లోని గొప్పదనమే తెలియడం లేదు. పంట పొలంలో ఎప్పుడూ ఒకే పంట వేయరు, వరి కోసిన తర్వాత, ఏ అపరాలో వేస్తారు, ఆపై పశుగ్రాసం వేస్తారు, మళ్ళీ ఎప్పటిలాగే వరి వేస్తారు. ఎందుకు? భూసారం పెరగడానికి? కానీ తినేది అన్నమే, గోధుమలే, జొన్నలే. మన భాష మనదే, అయితే,ఆదానప్రదానాలు ఉండాలి, పలు రుచులు ఉండాలి, పర భాషల సౌందర్యం తెలియాలి, అందులోని భావ వ్యక్తీకరణ అర్థం కావాలి, అన్నింటికంటే మిన్నగా ఇద్దరి మధ్య సమాచార మార్పిడి జరగాలి కనుక పర భాషలు ఎన్నయినా నేర్చుకోవచ్చు. బుద్ధి వికాసానికి పలు భాషలు నేర్చుకోవడం మంచిదని శాస్త్రజ్ఞులూ చెప్తున్నారు. అయితే, మాతృ భాష ద్వారా నేర్చుకున్న విజ్ఞానమే మనిషి మస్తిష్కాన్ని ఎంతో చురుగ్గా ఉంచుతుంది. ఇది ఏ భాషీయులకైనా వర్తిస్తుందని విజ్ఞానశాస్త్రం నిరూపించినదే.

ఇపుడు, పర భాషలు నేర్చుకోవడం ఎంత అశాస్త్రీయంగా తయారైనదంటే, మాతృభాష అసలు అక్కరలేదని అనుకునే కాడికి జనం గందరగోళంలో పడ్డారు. ఇంట్లో ఎలాగైనా మాట్లాడుకుంటారు చాలులెమ్మని,బ్రతుకంతా ఆ పరభాషలో నేర్చుకున్న శాస్త్రాలలోనే ఉందనే భ్రాంతికి జనసామాన్యం లోనవుతోంది, ఇందుకు రాజకీయ-పరిపాలనా రంగాలు చేస్తున్న విన్యాసాలు ఆలోచనాపరులకు ఆవేదననే మిగులుస్తున్నాయి. భాష అంటే మాట్లాడ్డానికి వచ్చేస్తేచాలునా,గణిత-భౌతిక-రసాయన-జీవ-సాంఖిక శాస్త్రాల్లో కూడా అంత గొప్ప శాస్త్రీయ పరిజ్ఞానం అబ్బుతోందాఅన్నది పరిశీలిస్తున్నారా, మదింపు చేస్తున్నారా, ఇందుకు తగిన పరామితులు ఉన్నాయా, అంతా సంపూర్ణ మేనా, పరిమితులతో కూడిన పరిధుల్లోనే తిరుగాడుతున్నామా-విజ్ఞులు ఈ దిశగా ఆలోచించడం మొదలు పెట్టారని అప్పుడప్పుడూ వెలువడే వార్తల ద్వారా తెలుస్తోంది. అయితే, భాషాభివృద్ధి ప్రభుత్వాలకు సంబంధించిన అంశమా, ప్రజలకు పొసగని విషయమా, మేధావులకు మాత్రమే దీని గురించి చింతయా, భాష పట్ల కవులకు మాత్రమే అక్కరా, భాషలోనే పుట్టి పెరిగిన మనకు మన అందరికీ బాధ్యత లేదా అంటే, ప్రత్యేకంగా ఏ బాధ్యతా వహించకుండానే భాష మనుగడ మనిషితో పాటే కొనసాగుతుంది. నిజమే కానీ.. ఎంతవరకూ? పర భాషల, పర సంస్కృతుల దాడి జరగనంతవరకే.

ప్రాచీన హోదాలు, భాష కోసం పరిశోధన పీఠాలు ఏర్పాటు చేసుకున్నాకఏం జరుగుతోంది-వివిధ ప్రాచీన రచనల్ని, కొత్త రచనలని భద్రపరచి, అందరికీ అందుబాటులో ఉంచడం జరుగుతోంది. అది ఉపకరించేది ఆయా పరిశోధకులకు. అసలు ఇదంతా దస్తావేజు రూపకమైన సాక్ష్యం. మనకు కావలసింది అచ్చులో వేసుకుని, అల్మరాలో దాచుకునే పత్రం మాత్రమే కాదు. జనం నాలుకల మీద నిలిచే జీవ భాష కావాలి. అచ్చమైన భాష బ్రతికుండే సాధారణ జనంలోనే స్వభాషనుమర్చిపోయేంతలా జరుగుతున్న సాంస్కృతిక దాడిని పెద్దగా ఎవరూ పట్టించుకోవడం లేదు. మనం కొనే వస్తువుల పొట్లాల మీద స్వభాషలో పేర్లు, వివరాలు ఉంటాయా, వేరే భాషలో ఉంటాయా ఆలోచించండి. కొట్టు పేరు చూద్దామంటే ఆ పేరు స్వభాషలో ఉంటుందా, వేరే భాషలోనా, చెప్పండి. స్వభాషలో నిర్మించే చలనచిత్రాల పేర్లు అచ్చంగా స్వభాషలో ఉన్నవి ఎన్ని, వేరే భాషల్లో పేర్లున్నవి ఎన్ని, గమనించండి. నిజమే, నిర్బంధం ఉండకూడదు, స్వేచ్ఛ రాజ్యాంగపు హక్కు, భావ వ్యక్తీకరణకు భాష అడ్డు కాకూడదు వంటి మాటలన్నీ నిజమే.

ఒక దేశ రాజ్యాంగం-ఆ దేశ సహజ సంస్కృతులను, ఆచార వ్యవహారాలను, భాషా వికాసాలను, అచ్చంగా ఆ దేశ ఆత్మ సౌందర్యాన్ని తాకట్టు పెట్టి లేదా వదిలిపెట్టి మరోలా మారిపో అని చెప్పదు. భాషను బ్రతికించుకోవడం ప్రజల విధి.

ప్రపంచం ఇప్పుడు ఒక కుగ్రామం, నిజమే, మరి మనం మన ధర్మాన్ని, ఆచారాన్ని, కులాన్ని-వర్గాన్ని వదులుకుంటున్నామా, లేదే, ఆయా అంశాల వల్ల కలిగే లాభాలను గ్రహించడానికి, అవకాశాలను అందుకోవడానికి, కావాలంటే మోతాదు పెంచమని అడగడానికీ నోరెత్తుతున్నామే గానీ, భాష మరణిస్తే మన ఉనికే లేకుండా పోతుందని, ఇక చరిత్ర పుటల్లోనో,సంగ్రహాలయాల్లోనో చూసుకోవలసిందే అని అర్థం చేసుకోవడం లేదు కదా. ఎందుకంటే, స్వభాష మనకు మినహాయింపులు ఇవ్వడం లేదు, మన భాష మనకు మిఠాయిలు అందించడం లేదు, మాతృభాష మనకు డబ్బులు కురిపించడం లేదు,ప్రాదేశిక భాష మనకు ప్రాపంచిక హోదా కల్పించడం లేదు..ఇంతేనా మనం ఆలోచిస్తోంది!! అమ్మ భాష బ్రతుకే ఇవ్వడం లేదని మనం అనుకుంటున్నప్పుడు భాషా వికాస పరిషత్తులు, వాటికి సిబ్బంది, నిర్వహణ ఖర్చులు,నిధుల కేటాయింపులు అన్నీ వ్యర్థమే కదా! అమ్మ అన్నం పెట్టడం లేదంటే మనం అడగటం లేదని అర్థం చేసుకోవడం లేదు!

సందర్భం వచ్చినప్పుడు మాట్లాడుతున్నాం కదా అనుకోవచ్చు,

అంటే భాషా దినోత్సవాలు జరిగినప్పుడు మాత్రమే ఆవేశపడి, ఆక్రోశం వెలిబుచ్చి, కొన్ని తరుణోపాయాలు వల్లెవేసి...ఆ ఉత్సవ దినాలు ముగియగానే,చప్పబడిపోతే ఎలా? భాషా దినోత్సవ వేళలోనే ఇలాంటి వ్యాసాలు వ్రాసి, ప్రచురించి, చదువుకుంటే చాలునా..ఇది ఒక సజీవ ధారగా ఉండాలి కదా!

రాజకీయాలకు తావులేనిది భాష. ప్రజల కర్తవ్యం, విద్యావేత్తల బాధ్యత, విద్యార్థికుండవలసిన గౌరవం, విశ్వవిద్యాలయాల కృషి, భాషా శాస్త్రజ్ఞుల విధి విస్మరించలేనిది. అయితే, ఇందరినీ ప్రోత్సహించాల్సింది ప్రభుత్వాలు. భాష చదువుకుంటే రాబడి లేనప్పుడు బ్రతుకు బండి ఈడ్చేదెలాగు? భాష కేవలం మాట్లాడుకోవడానికే, ఆపై శాస్త్రం నేర్వడానికి పరభాషే కావాలనే భ్రాంతిని దశాబ్దాలుగా శతాబ్దాలుగా మన బుర్రల్లో నాటిన పరిస్థితులను కష్టంగానే అయినా తొలగించాలి. అదే సమయంలో లోకంతో అనుసంధానం కోసం పర భాష నేర్వవలసి వస్తే నేర్చుకోవాలి. ఆ విజ్ఞానం మొత్తం స్వభాషలోకి అనూదితం కాబడడానికి ఉన్న అడ్డంకుల్ని తొలగించి, మేలైన ఉపకరణాల్ని అనుసంధానించాలి. ఇందుకు కొంత సమయం పట్టినా, దీక్షగా చేయాలి.

ఆధిపత్యపు భాషలోనే వృద్ధి ఉందని, విజ్ఞానం ఉందనీ అనుకోవడానికి కారణం, వేల యేళ్ళ పాటు ఆయా భాషలు సాగించిన పెత్తనాలు కారణం. ఇప్పుడు కూడా అదే గొప్ప అని జనం భావించడానికి కారణం అందులోని ఆర్థికలాభమే తప్ప వేరేది కాదు. వృద్ధికి మారు పేరు ఆర్థికలాభమే అనుకుంటే ఇక మానవజాతికి హితవు చెప్పే ఏ విషయమూ స్వచ్ఛంగా ఉండబోదు. ఈనాటికీస్వభాషను కొత్తగా నేర్చుకునేదేముంది అంటే, ఉంటుంది. వ్యాకరణం లేకుండానే అమ్మ భాష బిడ్డకు వచ్చేస్తుంది. అదనంగా కావాల్సింది విజ్ఞానం, గుర్తింపు, ప్రత్యేకత. తనదైన సొంత వ్యక్తిత్వం నిలబడేదిస్వభాష లోని విజ్ఞానం తోనే. ఇప్పుడు చిక్కంతాఎక్కడొచ్చిపడిందంటే, పరభాష కలిగిస్తున్న సౌకర్యం, ధనలాభం, సాంకేతిక అంశాల విషయ లభ్యత. పదిమందితో మాట్లాడినా అందరూ చెప్పింది ఇది ఒక్కటే. బహుశా పదకొండో మనిషి వేరేగాచెప్పేవారేమో. అందులోనే ఒకరన్నారు, ఆడలేక మద్దెలఓడంటున్నావు, అని. కళ్ళు తిరిగాయి. మనసు మొద్దు బారింది. అంతకంటే ముందు నేను బిత్తరపోయాను. అంటే, పర భాష నేర్వడం రాక దాన్ని వద్దనుకుంటున్నానని అతని భావన. అప్పుడు నేనన్నాను, అట్లైతేనీదీ అదే స్థితి కదా, మాతృ భాష రాక మాట్లాడ లేక ఓడంటున్నావు, దానిలో వృద్ధి చెందలేక వేరే భాషను ఆశ్రయించావు అని. అనడమైతే అన్నాను, దీన్ని ఎంతమంది స్వీకరిస్తారోఅని గుబులుగానే ఉంది.

ఇది ఒక్క వ్యక్తి ఘోష కాదు, మనసు గోడు వెళ్ళబోసుకోవడం కోసం రాసింది కాదు. ఏదో ఉద్యోగం వస్తే, ఇక చాలని, భాషతో పనేముందని అనుకునే వ్యక్తిలాభమూ లేదు. ఇది భాష ఉనికి ...మనిషి రక్తమాంసాలతో పుట్టి అతని మూలుగలలోసైతం ఉన్నది, అతని ఆత్మయైపలవరిస్తోంది. అలాగని చిత్తవృతిని ప్రేరేపించి, మనోభావాల్ని రెచ్చగొట్టి సంతృప్తి పడటం కోసం కాదు..ఈ వ్యధ. ఈ తపనంతా– మనిషిగా తన ఉనికిని కాదనుకున్నాడు, ఆ మనిషే సముద్రంలో నీటిబొట్టు అవుతాడు, తన ఉనికి మానవుల్లోనే ఒక ప్రత్యేకం అనుకున్నాడు ఆ మనిషే తేనెచుక్క అవుతాడని చెప్పడానికి. బహుశా, మరింత సమగ్రంగా కూడా ఈ విషయాన్ని చెప్పి ఉండొచ్చు. మరింత సరళంగానూ చెప్పి ఉండొచ్చు. అదే కదా భాషలోని వైవిధ్యం! అదే కదా మానవ సమాజాన్ని తక్కిన ప్రకృతిలో ప్రత్యేకంగా నిలబెట్టింది! స్వభాష బాగుండాలనే ఆరాటం దేనికయ్యా అంటే, ఆ భాష మాట్లాడే సమూహంలో పుట్టావు కాబట్టి అన్నారట, వెనకటికోపెద్దాయన! ఇంత సరళమైన సంగతిని మనం గ్రహించలేదాఏమిటి..చిత్రంగా! ఆ జ్ఞానాన్ని మనం మన స్వభాష ద్వారా సంపాదించుకునేదాకా విజ్ఞుల మాటలు వింటూ, చదువుతూ ఉండాలి మరి. ఇది స్వస్తి వచనం కాదు, ప్రేరేపకాస్త్రం కావాలి. అది ఎవరైనా సరే, భాష అనే దర్పణంలో అక్షరమై కనిపించాలి,అది ఆ మనిషి నాలుకపై శబ్దమై వినిపించాలి.



జస్టిస్ వి.ఆర్.కృష్ణయ్యర్
సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి



**కనువెలుగు: 16-3-1901**
**కనుమరుగు: 05-12-1952**

# జాతీయత-ఉపజాతీయత సక్రమ సమన్వయ సమర్ధన

**(1985 మార్చి 16న పొట్టి శ్రీరాములుగారి 84వ జన్మదినోత్సవం సందర్భంగా శ్రీ జస్టిస్ కృష్ణయ్యర్ ప్రసంగ పూర్తి పాఠం)**

1901వ సంవత్సరం మార్చినెల 16వ తేదీన ఒక నిరుపేద కుటుంబంలో జన్మించి, 1952 డిశంబరు నెల మధ్య భాగంలో అమరత్వం పొందిన అమరజీవి పొట్టి శ్రీరాములును స్మరించడం కోసం ఈ సాయంత్రం (1985 మార్చి, 16న వారి 84వ జయంతి రోజున మనం ఇక్కడ సమావేశమయ్యాము. 'వికేంద్రీకృత ప్రజాస్వామ్యం', ప్రాదేశిక- సాంస్కృతిక స్వయం ప్రతిపత్తి సాధించే ఉద్యమంకోసం, వాటి సాధనద్వారా ఆచరణలో ఉపజాతీయత బలమైన జాతీయభావం సమ్మేళనం చెంది, ఒక బలమైన కేంద్రంతో కూడిన భాషా రాష్ట్రాల సమాఖ్యగా ఇండియాను రూపొందించడం కోసం ఆమరణ నిరాహారదీక్ష కొనసాగించిన ఆ మహనీయ గాంధేయ యోధునికి వినమ్రమైన నా జోహారులు అర్పించుకునే అవకాశాన్ని నాకు కలిగించిన అమరజీవి పొట్టి శ్రీరాములు మెమోరియల్ సొసైటీ వారికి నేను ఋణపడి ఉన్నాను.

ఏకరూపకమైన జాతీయతకంటే ప్రజాస్వామ్యంతో కూడిన బహు ప్రాంతీయత ప్రశస్తమైంది. మనల్ని అణచి ఉంచిన బ్రిటిష్ పాలన నుంచి వారసత్వంగా సంక్రమించిన, యాదృచ్ఛికంగా ఏర్పడిన – ఆనాటి రాష్ట్రాలస్థానే భాషా ప్రాతిపదిక మీద స్వయంపోషకంగా ఉండే రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ ఆవశ్యకం, అని 'భిన్నత్వంలో ఏకత్వం' అనే సూత్రం చాటుతుంది. దాని వలన బలమైన, మహనీయమైన, ప్రియతమమైన ఒక కేంద్ర ప్రభుత్వానికి లోబడే ప్రాంతీయ ప్రజాసామాన్యపు ప్రతిభ వికసించగల అవకాశం ఏర్పడుతుంది.నిజమైన స్వేచ్ఛ భౌగోళిక అఖండతలో లేదు. 'భాష' ప్రజల సామూహిక జీవనానికి ఊపిరివంటిది. మన 'భారత ప్రజాస్వామిక, మతరహిత, సామాజికవాద రిపబ్లిక్' తాలూకు మనస్సునూ, హృదయాన్నీ ఆకట్టుకోవలసి ఉన్న ఉదాత్త రాజనీతి ఇది.

భారతీయ ఫెడరల్ రాజ్యాంగ విధానానికి సంబంధించిన ఈ ఉత్తమ సూత్రానికి అమరజీవి పొట్టి శ్రీరాములు గొప్ప బలం చేకూర్చాడు. తన ఆత్మాహుతితో భాషా ప్రాతిపదికపై రాష్ట్రాల పునర్ వ్యవస్థీకరణ ప్రక్రియను త్వరితం చేశాడు.

**భావం బాంబు లాంటిది**

ఒక వ్యక్తి పుట్టుక కేవలం శరీర సంబంధమైంది. కాని ఆ వ్యక్తి ద్వారా ఒక ప్రధానభావం ఆవిష్కరించబడడం క్రియాశీలమైన ఒక విశ్వజనీన సంఘటన. 'జాతస్య హి ధ్రువో మృత్యు,' – పుట్టిన ప్రతివాడు గిట్టక తప్పదు. కాని, ఒక వ్యక్తి ఆవిష్కరించే విప్లవాత్మక భావం ఎదురులేని బాంబు వంటిది. దానికి చావులేదు. హ్రస్వదృష్టులైన భౌతికవాదులు భావించే విధంగా భవిష్యదుద్యమం తాలూకు విస్ఫోటన శక్తి తుపాకి గొట్టం కొసనుంచి వెలువడదు. ఆత్మ బలిదానం ద్వారా న్యాయం కోసం సాగే మహత్తరమైన పోరాటానికి మృత్యురహితమైన తన మృత్యువును నాందిగా మలచగల ఒక మహనీయుని ఆత్మ నుంచి అది వెలువడుతుంది. విక్టర్ హ్యూగో ఇలా అంటారు.

*"ప్రపంచంలో అన్ని సైన్యాలకంటే*
*బలవత్తర్తమైంది ఒకటి ఉంది,*
*అది- అనుకూల సమయాన ఆసన్నమైన 'భావం' !"*
*ఇదే భావాన్ని హెన్రీ జేమ్స్ ఇలా ప్రకటిస్తారు.*
*"భావాలు నిజానికి మహత్తర శక్తులు*
*అనంతమైంది మనిషి వ్యక్తిత్వం*
*ఈ రెండూ ఏకం అయితే చరిత్ర సృష్టి తథ్యం!"*

**అలాంటి మహత్తరమైన వ్యక్తిత్వం పొట్టి శ్రీరాములుది. విడిపోయే దృష్టితోగాని, ప్రతికూల భావంతోగాని కాకుండా, 'భారతమాత' గా కీర్తింపబడే మన జాతీయ ప్రభుత్వానికి లోబడి ఉంటూనే తన ప్రాంతపు ప్రజలు సాంస్కృతికంగానూ, పరిపాలన పరంగానూ స్వతంత్రంగా అభివృద్ధి చెందేందుకు వీలుగా ప్రత్యేక భాషారాష్ట్రాన్ని ఏర్పాటు చేయవలసిందని కయ్యానికి కాలు దువ్వే మన జాతీయ నాయకులను ఆయన డిమాండ్ చేశాడు. ఆ విధంగా అహింసాత్మకమైన అణుబాంబు లాంటి ఒక భావాన్ని ఆయన వెల్లడించాడు. తన దేశీయులందరూ ఈనాడు సంతోషంగా తమ తమ సాంస్కృతిక స్వేచ్ఛలను, భాషా రాష్ట్ర స్వపరిపాలనలను అనుభవించేందుకు వీలుగా నిజమైన జాతీయవాది అయిన శ్రీరాములు**

**చారిత్రాత్మక నిరాహారదీక్షకు పూని, చేజేతులా మరణాన్ని వరించాడు. మానవజాతి తన అభ్యుదయానికి ఋణపడి ఉండేది - తన విజేతలకు కాదు, ఆత్మార్పణ చేసిన అమరవీరులకు 'అలెగ్జాండర్' లకు కాదు, 'సోక్రటీస్' లకు, 'సీజర్'లకు, 'జీసస్' లకు, 'రీగన్' లకు కాదు, 'లింకన్' లకు, రెడ్‌ఫోర్ట్, వైట్ హౌస్, సౌత్‌బ్లాక్‌ల వంటి ప్రాసాదాల నుంచి పాలించే మొగల్ పాదుషాలు వంటి ప్రభువులకు కాదు. గుడిసెలలో జీవించే కోట్లాది మంది సామాన్య జనంతో కలిసిమెలిసి జీవిస్తూ, వారికి జరుగుతున్న అన్యాయాలను ధైర్యంగా ప్రకటించిన 'గాంధీజీ' వంటి మహాత్ములకు. ఆ కోవకు చెందినవాడు పొట్టి శ్రీరాములు.-** అంధ్రరాష్ట్ర అవతరణకు మంత్రసానితనం చేసి, ప్రజల ప్రాతిపదిక మీద మన దేశ పటాన్ని తిరిగి గీసిన దేశపట చిత్రకారుడై, అందుకు పరిహారంగా తన అసువులనే ఆయన అర్పించాడు. **బ్రిటిష్ పాలనకు ఫలితంగా ఇండియాలో ఏర్పడిన ఇంగ్లీషు చదువుకున్న అహంభావ వర్గానికి కంటకంగా జన సామాన్యానికి అధికారాన్ని కట్టబెట్టే లక్షణం భాషారాష్ట్ర, సిద్ధాంతాలలో ఇమిడి ఉంది.** 'డూన్' స్కూలులో ఉన్నత విద్య అభ్యసించి తన హోదా పెంచుకోవలసిన అవసరం లేకుండానే చింపిరి గుడ్డలతో కనిపించే సాధారణ భారతీయుడు కూడా 'కిసాన్ రాజ్య' నిర్వహణలో పాల్గొనే 'స్వరాజ్యం' కోసం, 'స్వదేశీ' పాలన కోసం సాగుతున్న పోరాటంలో విజయం ఇంకా మనకు సుదూరంలోనే ఉంది. "ఇంగ్లీషు రానివాడు దేశపరిపాలనలో పాల్గొనడానికి అర్హతలేని అనాగరకుడు !" అనేది ఇండియాలోని విదేశీదాసులు చేసే నినాదం! అందుకే **గాంధీ జన్మించిన ఈ దేశంలో నేటి అధికార రాజకీయాలలో సామాన్యప్రజలు పాల్గొనే ఆశయం నేటికీ ఎండమావిగానే ఉండిపోయింది. అందుకే సగటు భారతీయుడు మన దేశంలో నేడు 'పరాయి'వాడు. దళారీలు, కండబలం ఉన్నవారూ, రాజకీయ వ్యాపారులూ (వీరే ఈనాటి పలుకుబడి వర్గం) అధికారాన్ని హస్తగతం చేసుకుని దేశంలోని శ్రామిక వర్గానికి కుహనా ప్రతినిధులుగా చలామణి అవుతున్నారు. మాతృభాష, ప్రజాసామాన్యపు హక్కులు- ఈ రెంటి కలయిక ప్రజాస్వామ్య రాజకీయాలకు జీవగఱ్ఱ!**

## స్వరాజ్యం - పంచాయితీ రాజ్యం

సరూపమైన జనాభా గల ప్రాంతాలు, లేదా ఒక స్థలంలో కేంద్రీకృతమైన అల్పసంఖ్యాక వర్గాలు తమ భౌగోళిక, సాంస్కృతిక ప్రత్యేకతను నిలబెట్టుకునే హక్కుకు దోహదం చేసే ఆధ్యాత్మిక, లౌకిక సూత్రాలు ఏవి? కేంద్ర ప్రభుత్వ ఛత్రం ఉంటూనే స్వయంపరిపాలనాధికారం గల ప్రత్యేక రాష్ట్రాలుగా ఏర్పడేందుకు వాటికి గల న్యాయసమ్మతమైన హక్కు ఎలాంటిది? ఇండియా చరిత్ర దృష్ట్యా బలమైన కేంద్రప్రభుత్వపు ఆవశ్యకత ఎలాంటిది? భాషా రాష్ట్రవాదుల రాజకీయ ఆశయాలకూ, సాంఘిక అభ్యర్థనలకూ, భారత రాజ్యాంగ నిబంధనలు ఎంతవరకు అనుకూలిస్తాయి? రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ వలన కలిగే లాభనష్టాలను బేరీజు వేస్తూ దేశంలో చెలరేగిన వాదోపవాదాల విషయంలోనూ తీవ్ర హానికరమైన ధోరణుల విషయంలోనూ తీవ్ర జాతీయవాది అయిన నాయకునికి సహజంగా కలిగే సంకోచాలు ఎలాంటివి? కేంద్ర, రాష్ట్ర, సంబంధాలు దెబ్బతిని క్రమేణా దేశం చిన్నాభిన్నం కాకుండా ఉండాలంటే ఆ సంబంధాలలో మార్పు తెచ్చేందుకు అవలంబింపదగిన సూత్రం ఏదైనా ఉందా?

ప్రాంతీయ దురభిమానాలనూ, నిస్సారమైన కేంద్రీకరణ వాదాన్నీకాక, వివిధప్రాంతాల అభివృద్ధినీ, పరిపాలనా సౌలభ్యాన్నీ దృష్టిలో ఉంచుకుని ఆచరణ యోగ్యమైన చక్కని ఫెడరల్ రాజ్యాంగ వ్యవస్థ స్వరూపాన్ని రాజనీతిజ్ఞతతో మనం నిర్ణయించుకోవాలి. కేంద్రానికీ, రాష్ట్రాలకూ మధ్య అధికారాల సక్రమ విభజనలో ఆ విజ్ఞత వ్యక్తం కావాలి. అప్పుడే మన ఫెడరల్ రాజ్యాంగ వ్యవస్థకు దృఢమైన పునాది ఏర్పడుతుంది. (ప్రశ్నించరాని, అజేయమైన, అఖండమైన భారతజాతి ఏకత్వభావానికి ఇండియా మరణిస్తే ఎవరు బ్రతికి ఉంటారు?) వివిధ ప్రాంతాలవారు తమ ఆశయాల వ్యక్తీకరణకోసం ప్రకటించే అణిచిపెట్టరాని ప్రాంతీయాభిమానానికి మధ్య ప్రజల శ్రేయస్సు దృష్ట్యా సరియైన సమన్వయం సాధించడం నేటి మన అసంపూర్ణ స్వరాజ్యం ఎదుర్కొంటున్న ప్రధానమైన సవాలు.

'భాషే' ప్రజలు. 'భాష' అంటే భాషా దురభిమానం కాదు. పరభాషా ద్వేషం కాదు. ప్రజా పరిపాలనలో 'తల్లిపాలు' లాంటి భాష. బాధ్యతారహితమైన, అవినీతికరమైన ధోరణులను అరికట్టాలి. ప్రజల గొర్రెలమంద మనస్తత్వాన్నీ, ధర్మావేశంగా పైకి కనిపించే 'మంది' హింసా ప్రవృత్తినీ నిరోధించాలి. అవివేకంతో కూడిన కేంద్ర ప్రభుత్వపు పశుబలంతో కాదు, విజ్ఞతతోనూ, సాంస్కృతిక అవగాహనతోనూ ఆ పని జరగాలి. శిష్టవర్గం వారిచే అధికార దురాక్రమణకు అవకాశం లేకుండా సామాన్యప్రజలు దేశపాలనలో పాల్గొనగలగడం ప్రజాస్వామ్య ప్రభుత్వానికి ప్రాణం వంటిది. చారిత్రక సూక్ష్మప్రక్రియల దృష్ట్యా **భాషా రాష్ట్రవాదం గతితార్కిక (dialectical) స్వభావం గలది. స్థూలంగా చెప్పాలంటే- 'స్వరాజ్యం', 'పంచాయతీ రాజ్యం' - రెండూ దేశానికి పుష్టికూర్చేవే కాని, పరస్పర విరుద్ధాలు కావు.**

## స్వాతంత్ర్యోద్యమం - భాషారాష్ట్రాలు

సిద్ధాంతపరమైన ఈ ఉపనిషత్తుల సంగతి అలా ఉంచి, భారత స్వాతంత్ర్యోద్యమమే ఈ విషయంలో మార్గదర్శకం అయింది. ఎందువల్ల? మాతృదేశ విముక్తికోసం సాగుతున్న పోరాటంలో ఒకే భాష మాట్లాడే విస్తృతప్రాంతం వారు తమ మాతృభాషకు పాలకభాషా గౌరవం చేకూర్చే పోరాటం కూడా ఒక భాగమే అని గుర్తించినందువల్ల! సాధారణ ప్రజల స్థాయిలో మన స్వాతంత్ర్యోద్యమం ఏదో ఒక అస్పష్టమైన జాతీయ రాజకీయ ఉద్యమం కాదు. విదేశీయుల సాంస్కృతిక దాస్యం నుంచి విడివడడం కోసం, తమ భాషలో తమ ఆశయాలను ప్రకటించుకోవడం కోసం, తమ భాషకు స్వాతంత్ర్యాన్ని సాధించడం కోసం సాగిన ఉద్యమం అది. భాష, సాహిత్యం ఒక జాతి వ్యక్తిత్వానికి దర్పణాలు. సంస్కృతి వికాసానికి దారితీసే భాషాపరమైన స్వరాజ్యం సాధిస్తే తప్ప వలసరాజ్య తత్త్వాన్ని జయించలేము. తమభాష అధికార భాష కానంతవరకు సామాన్యప్రజలు పరాయివారుగానే ఉండిపోతారు. ఒకే సంస్కృతికి వారసులై, ఒకే భాష మాట్లాడే ప్రజలు గల ఒక విస్తృత ప్రాంతంలో పరిపాలనా యంత్రాంగంలో సామాన్య పౌరుడు పాల్గొనే అవకాశం ఏర్పడాలంటే అక్కడి ప్రభుత్వమూ, ఆ ప్రభుత్వాంగాలూ ఆ ప్రజల భాషను ఉపయోగించడం అవసరం. పాలకులకూ, పాలితులకూ మధ్య భాషాపరమైన అఖాతం ఉన్నంతవరకూ ప్రజాస్వామ్యం విఫలంకాక తప్పదు. ప్రయాణ సౌకర్యాల వల్లా, వార్తల ప్రసార ప్రచారాల వల్లా,

'ఒకే ప్రపంచం' రూపొందుతున్న నేటికాలంలో పరభాషా భీతి సముచితం కాదనే మాట నిజమే! కాని, వివిధ సంస్కృతులు, భాషలూ గల దేశంలో ప్రజాస్వామ్య పరిపాలనలో మాతృభాషకు గల ప్రాధాన్యం వాస్తవమైంది. ప్రజల భాషలో పరిపాలన రుగకపోతే ఃగ్రామ స్వరాజ్యంః , ఃవికేంద్రీకృత పాలనః అనేవి వట్టి బూటకాలు. భాషాపరమైన ఒక ఇనుపతెర జనసామాన్యాన్నీ, ఇంగ్లీషు (లేదా హిందీ) మాట్లాడే పాలకవర్గాన్ని విడదీస్తున్నంత కాలం మన రాజ్యాంగం అవతారిక (Preamble) అర్థరహితం. సామాన్యప్రజలు పాల్గొనని 'అభివృద్ధి','సమాజవాద వ్యవస్థ' శిష్ట వర్గం వారు చేసే అర్థరహితమైన నినాదాలు. 1920లో జరిగిన నాగపూరు కాంగ్రెస్ సమావేశంలోనే ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ అధికారంగా భాషాప్రయుక్త రాష్ట్రాలను ఆమోదించింది. **1927లో కాంగ్రెస్ (అప్పుడు అది ఒకపార్టీ కాదు, ఉద్యమం) 'భాషా ప్రాతిపదిక మీద దేశంలోని రాష్ట్రాలను పునర్విభజించవలసిన తరుణం ఆసన్నమైంది'** అని తీర్మానించింది. సమైక్య భారత రాజ్యంలో ఏకభాష మాట్లాడుతూ, ఏక సంస్కృతి, సంప్రదాయాలను అనుసరించే వేర్వేరు ప్రజలకు పరిమితంగా స్వయం నిర్ణయాధికారాన్ని కలిగించాలని అంగీకరించింది. **1928లో సర్వపక్ష సమావేశం నియమించిన నెహ్రూ కమిటీ భాషా ప్రాతిపదిక సూత్రాన్ని పూర్తిగా సమర్థించింది.**

ఒక రాష్ట్రంలో మాతృభాషలోనే విద్యాబోధన జరగాలన్నా, దైనందిన కార్యక్రమాలు కొనసాగాలన్నా, అది ఒక ప్రత్యేక భాషాప్రాంతం అయి ఉండక తప్పదు. ఒక రాష్ట్రంలో బహుభాషలు మాట్లాడే వారుంటే నిరంతరం ఎన్నో సమస్యలను ఎదుర్కోవలసి వస్తుంది. అందువల్ల రాష్ట్రాలను భాషాప్రాతిపదిక మీద పునర్ వ్యవస్థీకరించడం ఎంతైనా అభిలషణీయం. ఒక ప్రత్యేక సంస్కృతీ, సంప్రదాయానికీ సాహిత్యానికి భాష ప్రతీక. ఏకభాషా ప్రాంతం అయితే ఆ రాష్ట్ర అభ్యుదయానికి ఈ అంశాలన్నీ దోహదం చేయగలవు".

**1930లో సైమన్ కమీషన్ కూడా ఇలాంటి వాస్తవిక దృష్టినే ప్రదర్శించింది.**

'ఒకేభాష మాట్లాడేవారు నివసించే ప్రాంతం స్వయంపోషకమై మంత్రంగా మనగలిగిన పక్షంలో ఆ ఒకే భాషను ఉపయోగించడం ఆ రాష్ట్ర వ్యక్తిత్వానికి బలమైన, సహజమైన ప్రాతిపదిక కాగలదనడంలో ఎలాంటి సందేహం లేదు."

సామాన్య ప్రజల హక్కుల సాధికార సమర్థకుడు గాంధీజీ. జాతీయ కాంగ్రెస్‌లో ప్రాదేశిక సంఘాలను భాషా ప్రాతిపదిక మీద పునర్ వ్యవస్థీకరించాలన్న 1927 నాటి కాంగ్రెస్ 'ఆమోదం' 1937 నాటికి 'ప్రతిజ్ఞ' గా రూపొందింది.

గొప్ప సాహిత్యం, ప్రాచీనమైన సంస్కృతి గల తమిళభాష, ఆ సనాతన జాతి గర్వించదగ్గది. ఆ జాతి స్వపరిపాలన మాధ్యమం కాదగ్గది. తిరువళ్ళువర్ మొదలు సుబ్రహ్మణ్య భారతి వరకు ఎందరో మహాకవులు పుట్టిన ఆ భాష మాట్లాడే ప్రాంతానికి స్వపరిపాలన ప్రతిపత్తిని నిరాకరించడం మన స్వాతంత్ర్యోద్యమానికి అపచారం చెయ్యడం, ప్రజా ప్రాధాన్య భావాన్ని తక్కువ చెయ్యడం. అలాగే త్యాగరాజు గానం చేసిన తెలుగుభాషకూ అద్భుతమైన వారి సాహిత్యానికీ, సంగీత సంస్కృతికీ, పరిపాలన మాధ్యమంగా తెలుగుభాషను వాడుకునే అవకాశాన్ని నిరాకరించడం భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఏర్పడేందుకు వారికిగల న్యాయసమ్మతమైన హక్కును కించపరచడం. **పాశ్చాత్య దేశాలలోని ఉత్తమ సంస్కృతులను తలదన్నగల ఎన్నో సంస్కృతులు, యూరపియన్ భాషలకంటే ప్రాచీనమైన ఎన్నోభాషలు భారతదేశంలో ఉన్నాయి. అయితే-బ్రిటిష్ హయాంలో అవి స్తంభించిపోయాయి.** ముకుళించి ఉన్న భారత స్వాతంత్ర్య కుసుమం నిద్రావస్థ తొలగి రంగు రంగుల రేకులను విచ్చుసాగింది. కాని,భారతీయ వేషంలో కనిపించే 'ఆంగ్లో- శాక్షన్' భక్తులకు మాత్రం భారతదేశ స్వాతంత్ర్యం తాలూకు ఈ ప్రజాస్వామ్య లక్షణం ప్రాణసంకటం అయింది. 'వెస్ట్ మినిస్టర్' లో లాటిన్ భాషలో ప్రభుత్వం సాధ్యమా? రోమన్లు గ్రీక్ భాషలో తమనుతాము పాలించుకోగలరా? అలాంటిది ఎన్నటికీ జరుగదు.

బ్రిటన్ తననుతాను ఇంగ్లీషుభాషలో పాలించుకుంటూ ఉండగా ఇండియా అంతా హిందూస్తానీ భాషలోనూ, వివిధ రాష్ట్రాలు ఆయా రాష్ట్రీయ భాషలలోనూ పరిపాలన ఎందుకు సాగించుకోకూడదు? బహుభాషల వాడుక ఘర్షణలకూ, అంతః కలహాలకూ దారి తీస్తుందట. ఆ వాదంలోని అసందర్భాన్ని ఎత్తిచూపాడు శ్రీరాములు.

## స్వాతంత్ర్యానంతర కాలంలో

స్వాతంత్ర్యానంతర కాలంలో ఇండియన్ యూనియన్‌లో భాషాప్రాతిపదిక మీద రాష్ట్రాల భౌగోళిక సవరణలు చేయడానికి సంబంధించిన చరిత్ర మన దేశభక్తికి పెద్ద పరీక్ష అయింది. గొప్ప గొప్ప జాతీయ నాయకులూ, సోషలిస్ట్ నాయకులూ కూడా రాజ్యాధికారంలో పాల్గొనే హక్కును కల్పించే సమస్యను ఎదుర్కొనడంలో విఫలులయారు. అందుకు కారణం- వారి మనస్తత్వం మీద వారి ప్రభావం ఎక్కువ కావడం 'రాజ్యాంగ పరిషత్తు' (constituent Asembly) లో భాషాప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడాలనే వాదనను ఖండించారు. ఆ కమీషన్ నివేదికలో 'ఉద్యోగివర్గ' (bureaucratic) ధోరణి ఎక్కువగా కనిపించింది. దేశం చిన్నాభిన్నం కాగల ప్రమాదాన్ని అతిశయోక్తులతో వారు చిత్రించారు. 'థార్' నివేదికతో సంతృప్తి చెందని కాంగ్రెస్ పార్టీ జవహర్ లాల్ నెహ్రూ, వల్లభాయ్ పటేల్, పట్టాభి సీతారామయ్యలతో కొత్తగా మరో కమిటీని నియమించింది. ఆ జె.వి.పి. కమిటీ కూడా ఒక రాష్ట్రం ఏర్పాటు చెయ్యడంలో భాషనే ప్రధాన ప్రాతిపదికగా గ్రహిస్తే దేశం ఛిన్నాభిన్నం అయిపోతుందని ఆందోళన ప్రకటించింది. 'దేశదృఢీకరణ ప్రక్రియను నిస్సందేహంగా అది కుంటుపరుస్తుంది. మన స్వాతంత్ర్యం ఇంకా ప్రాథమిక దశలో ఉండగానే విచ్ఛిన్నకర శక్తుల ప్రాదుర్భావానికి అది దారి తీయగలదు.' ఒక్క ఆంధ్రరాష్ట్ర స్థాపనను గురించి మాత్రం ఆలోచించవచ్చును అని సూచిస్తూ మొత్తం మీద భాషా ప్రయుక్త రాష్ట్ర విభజన విషయమై జె.వి.పి. కమిటీ ఇచ్చిన తీర్పు ఇది. మిక్కిలి దూరదృష్టి గల రాజనీతివేత్త రాజాజీ కూడా ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రం ఇవ్వడాన్ని వ్యతిరేకించారు. **ప్రధాని జవహర్లాల్ నెహ్రూ బ్రతికి ఉన్న శ్రీరాములును నిరాదరించి, ఆత్మార్పణ చేసిన శ్రీరాములుకు దాసోహం అన్నారు. గాంధీ అనుయాయులకు, లెనిన్ అనుయాయులకు ఆశ్చర్యం కలిగించిన అంశం – నెహ్రూ, రాజాజీ, పటేల్, పట్టాభి వంటి వారే జాతీయ**

**కాంగ్రెస్ ఆమోదించిన ప్రాతిపదికసూత్రం విషయంలో మాట మార్చటం. కాని, ప్రజాస్వామ్యశక్తులు విజృంభిస్తే వాటిముందు నాయకులు నిర్వీర్యులు అవుతారు. ప్రజాభిప్రాయపు వెల్లువ బలవత్తరం అయింది. నెహ్రూ ప్రభుత్వం భాషా ప్రయుక్త రాష్ట్ర విభజనను గూర్చి విచారించేందుకు రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ కమీషన్‌ను నియమించక తప్పలేదు. నిరక్షరాస్యులైన సామాన్య ప్రజల హృదయాలలో ఆనాడు ఆశారేఖ మెరిసింది. రహస్యంగా 'చరిత్ర' ఇలా గుసగుసలాడింది. "కుక్కలు మొరుగుతాయి, ఏనుగు సాగిపోతూనే ఉంటుంది," ఆ విధంగా ఇండియాలో భాషాప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడడం, దేశ రాజకీయాలలో ప్రస్తుతం అవి అంతర్భాగం కావడం జరిగింది.**

భాషాప్రయుక్త రాష్ట్ర అవతరణ ప్రక్రియ "సంప్రదాయం గొప్ప నిరోధక శక్తి, చరిత్ర ప్రగతికి అది అవరోధం కలిగిస్తుంది" (ఎంగెల్స్) అని ఋజువు చేసింది. ఇంగ్లీషు రాని భారతదేశ ప్రజాసామాన్యం రాజ్యాధికార నిర్వహణ బాధ్యతను వహిస్తే భారతదేశ భవిష్యత్తు దెబ్బతింటుంది' అనే మన అవ్యక్త చేతనలోని భయం బ్రిటిష్ వారసత్వంగా మనకు సంక్రమించింది. మానవ నాగరకతకూ ప్రగతి స్వరూపం మనకు నేర్పేపాఠం –

**"పర్యవసానం ఎలా ఉన్నా ప్రజలు తమ చరిత్రను తామే సృష్టించుకుంటారు. ప్రజలలో ప్రతి ఒక్కడూ ఉద్దేశపూర్వకంగా ఏదో ఒక లక్ష్యాన్ని అనుసరిస్తాడు. వివిధ దిశలలో సాగే ప్రజలందరి లక్ష్యాలూ, బయటి ప్రపంచం మీద కనిపించే పలువిధాలైన వాటి ప్రభావం – ఇదే మానవ చరిత్ర!'**

ఒక్కొక్కప్పుడు ప్రజల ప్రతినిధులు తమ యజమానులను చూసి భయపడతారు. వారిని పరదాలో ఉంచుతారు. ఈ పరదా రాజకీయాలు నేటికీ సాగుతున్నాయి. **చాలమంది స్వార్థపరులైన మేధావులకు భారత చరిత్రలో భారతీయ భాషల ప్రాబల్యం రుచించడం లేదు.** వారు చరిత్రను వెనుకకు తీసుకుని వెళ్ళాలనీ, ప్రజాసామాన్యాన్ని నిర్వీర్యం చెయ్యాలని చూస్తున్నారు. మన భాషా రాష్ట్రాల పాలకులు కూడా ఇంగ్లీషు మీడియం స్కూళ్ళను గౌరవభావం తోనూ, దేశభాషల స్కూళ్ళను అలగాజనానికి మాత్రమే ఉపయోగించేవన్న నిరసనభావంతోనూ చూస్తూ ఈ విధమైన ఆలోచనకు బలం చేకూరుస్తున్నారు. ఎన్నికల తిరనాళ్ళలో తప్ప ఇతర సమయాలలో అణచి ఉంచబడుతున్న మన ప్రజాసామాన్యపు పోరాటంలో విజయం ఇంకా సుదూరంగానే ఉంది. అయితే రాజ్యాంగ న్యాయశాస్త్ర (Constitutional Law) ప్రక్రియలు పరిపాలనలో పాల్గొనడానికి నిషేధింపబడిన కొన్ని వర్గాలవారిని క్రమేణ భారత రాజకీయాల రంగంలో ప్రవేశపెడుతున్నాయి. శిష్టుల ప్రమాణాల ననుసరించి వారంతా వెనుకబడిన వర్గాలవారు. ప్రత్యేక రాష్ట్రం లేని కారణంగా అశ్రద్ధ చేయబడినవారు. **బహుభాషా జాతీయవాదం గురించి మొండిపట్టు గలవారిని ధిక్కరించి 1953లో ఆంధ్రరాష్ట్రం తొలి విజయం సాధించింది.** ఈనాడు భాషా ప్రాతిపదిక మీద ఏర్పడిన కర్ణాటక, కేరళ, గుజరాత్, మహారాష్ట్ర, పంజాబ్, హర్యానా – చివరికి మేఘాలయ, మణిపూర్, నాగాలాండ్ త్రిపుర రాష్ట్రాలను కూడా తిరుగుతోడే ధైర్యం ఏ నాయకునికీ లేదు. భాషా రాష్ట్రాల ఏర్పాటుకు కేంద్రనాయకులు ఎంత తీవ్రమైన వ్యతిరేకతను ప్రదర్శించారో ఈ రాష్ట్రాల నాయకులు గుర్తు చేసుకుంటే పొట్టి శ్రీరాములుకు తాము ఎంత ఋణపడివున్నదీ వారికి బోధపడుతుంది. భాషా రాష్ట్రాలను కోరడం 'మూర్ఖ అనాగరక ధోరణి' అని నెహ్రూ, రాజగోపాలాచారి నిరసించారు. 'భాషా రాష్ట్ర వాదాన్ని మర్యాదగా సమాధి చెయ్యాలి' అని కోరాడు గోవింద వల్లభ పంత్. బెంగాల్, బీహార్ రాష్ట్రాల ముఖ్యమంత్రులు 'భాషాపరమైన ఉన్మాదాన్ని' అంతమొందించడానికి తమ రెండు రాష్ట్రాలను విలీనం చెయ్యడానికి తమ సమ్మతిని తెలిపారు. ఢిల్లీలోని 'హిందూస్థాన్ టైమ్స్' పత్రిక 'ఒక్కొక్క భాష మాట్లాడేవారికి ఒక్కొక్క ప్రత్యేకరాష్ట్రం' అనే వాదానికి స్వస్తి చెప్పమని నెహ్రూకు సలహా ఇచ్చింది. కాని ఇండియా ప్రజలమైన మనము మరో విధంగా తీర్మానించాము.

## ప్రాంతీయ భాషల అభివృద్ధి

భాషావర్గాలకు రాష్ట్ర స్వపరిపాలనకు హక్కు ఇవ్వడం ఆధునిక విజ్ఞాన, పరిపాలన మాధ్యమాలుగా ఆ భాషలను అభివృద్ధి పరుస్తుంది. నేటి ధనస్వామ్యంలో మంత్రులూ, శాసనసభ్యులూ ఈనాటికీ 'డూన్ స్కూళ్ళకు' తప్ప తమ పిల్లలను ఇతర సాధారణ స్కూళ్ళకు పంపకపోతూ ఉండడం దురదృష్టకరం. **ధనవంతులు మన భాషలను గౌరవించనంతకాలం, సైన్స్, కళలలో వచ్చిన అభివృద్ధిని మనభాషలు ప్రకటించనంత కాలం వాస్తవంగా మనకు స్వాతంత్ర్యం వచ్చినట్టు కాదు.**

1953లోనూ, ఆ తరువాత కాలంలోనూ మన పార్లమెంటు గుర్తించిన విధంగా ఒక ప్రాంతం వారి భాషా, సంస్కృతులు వారి జీవన విధానానికి దర్పణాలవంటివనీ, భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు వల్ల ఒక జాతీయ ప్రభుత్వం పర్యవేక్షణలో వివిధ ప్రాంతాలవారు కన్నకలలు ఫలించగలవనీ గుర్తిస్తే, భాషారాష్ట్రాలు జాతి ఏకతకు భంగకరాలు కాకపోగా పుష్టికరాలే అని బోధపడుతుంది. తమ వ్యక్తిత్వాన్నీ, స్వతంత్రతను కాపాడేందుకు కేంద్రప్రభుత్వం పూచీ పడడంవల్ల వాటికి కేంద్రం పట్ల మరింత భక్తిశ్రద్ధలు పెరుగుతాయి.

అయితే–బూర్జువా తత్త్వంలో అవకతవక పనులు చేయడంలో మన జాతికిగల విశిష్ట ప్రతిభవల్ల భాషాపరమైన అనేక వివాదాలూ, ప్రాంతీయ సంఘర్షణలూ చెలరేగడం, మన ఆంగ్ల మానసపుత్రుల నిర్లిప్తత, అధికార దాహం, దోపిడీ తత్త్వం మొదలైన కారణాల వల్ల వేర్పాటు వాదాలకు అవి దారి తీయడం జరిగింది. 'మన స్వస్థతకు భంగకరాలైన ఈ శక్తులను అణచివేయడం ఎలా? అనేది నేడు మనజాతి ఎదుర్కొంటున్న ప్రధానమైన సమస్య. సప్తస్వరాలూ తగు విధంగా మేళనం చెందితే మధురమైన సంగీతాన్ని వినిపించగలవు. అవే అనుచిత గతిలో సాగితే కర్ణకఠోరాలు కాగలవు. జాతీయ సమైక్యానికీ, రాష్ట్ర పునర్వ్యవస్థీకరణకూ ప్రాణం వంటిది 'ఫెడరల్ రాజ్యాంగ విధానం'. ప్రత్యక్షంగా కనిపిస్తున్న దానికి రుజువులు అనవసరం. ఇండియా ఏకత్వం, భద్రత ముఖ్యం. ఏకత్వానికి భంగం కలిగించే బెదిరింపులకూ, వివాదాలకూ, ఘర్షణలకూ దారి తీసే ఏ చర్య అయినా భారతజాతి ప్రగతిని కుంటుపరచి, దాని స్వస్థతకు ప్రమాదం కల్పిస్తుంది. సామ్రాజ్య విస్తరణ కాంక్షతో అగ్రరాజ్యాలు చిన్న రాజ్యాలను వీలైతే కబళించడానికీ, లేదా తమ తాబేదారులుగా చేసుకోవడానికి ప్రయత్నిస్తున్న నిష్ఠురమైన, అవినీతికరమైన నేటి

ప్రపంచంలో పోటాపోటీలతో, ప్రచ్ఛన్న యుద్ధాలతో అంతర్జాతీయ రాజకీయాలు పలుదేశాల సార్వభౌమాధికారానికీ, ఆర్థిక, రాజకీయ స్వాతంత్ర్యాలకూ ఎసరు పెడుతున్న ఈ రోజులలో **ఇండియా కేంద్రప్రభుత్వాన్ని పటిష్టం చేయవలసి ఉన్న అవసరం విస్మరించరానిది. అదే విధంగా ఇండియాలో చారిత్రక సత్యం అయిన సాంస్కృతిక వైవిధ్యాన్ని అలక్ష్యం చెయ్యడం, బలవంతంగా విధించే సారూప్యం వల్లకాక, వివిధ వర్గాల మధ్య ఏర్పడే సామరస్యం వల్లా, అందరిలో జాతీయ చైతన్యం కలిగించడం వల్ల మాత్రమే జాతి ఏకత్వరక్షణ సాధ్యం కాగలదని గుర్తించకపోవడం కూడా అనుచితమే! అంగాలైన రాష్ట్రాల నుంచే కేంద్రం బలం సాధించాలి అనడం వితండవాదం.**

వివిధ రాష్ట్రాల మధ్య సంఘర్షణలను తొలగించి, సామరస్యాన్ని నెలకొల్పడమే జాతీయ సమైక్య సాధనకు సక్రమమైన పద్ధతి.సంకుచిత దృష్టితో కేంద్రాన్ని దుర్బలం చేసే మతశక్తులతో చేతులు కలిపితే తప్ప, లేకపోతే ప్రాంతీయాభిమానం దోషం కాదు. సంప్రదింపుల ద్వారా సహనంతో, సామరస్య ధోరణిలో వివిధ ప్రాంతాల మధ్య అభిప్రాయభేదాలను తొలగించుకొని, అందరికీ న్యాయం చేకూర్చే పక్షంలో ప్రాంతీయాభిమానం తప్పుకాదు. భారతీయ ఏకతా భావనను పటిష్టం చెయ్యడం జాతిలో ఉన్న వైవిధ్యాలను అణగద్రొక్కడం వల్లకాక, జాతీయస్థాయిలో అభిప్రాయభేదాలను అధిగమించడం ద్వారానే సాధ్యం అవుతుంది. ఈ సందర్భంలో రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ సంఘం వారు ప్రకటించిన ఈ క్రింది అభిప్రాయాలను స్మరించడం ఉచితం !

విదేశీ పాలనలో పాలకులు, పాలితుల దృక్పథాలు ఏకరూపంగా ఉండవలసిన అగత్యం కంటే పాలకుల సామ్రాజ్య ప్రయోజనాల వంటివి ఎక్కువ ప్రాధాన్యం వహించవచ్చు. కాని, వయోజన వోటింగ్ హక్కు ప్రాతిపదికగా ఏర్పడిన ప్రజాస్వామిక పాలనలో ప్రభుత్వం, ప్రజలూ కోరే ప్రయోజనాలు ఏకరూపంగా ఉండడం, ఇరు పక్షాలు పరస్పర సహకారం, అవగాహనతో వ్యవహరించడం అత్యవసరం. ప్రజాసంక్షేమ రాజ్య విజయం ప్రధానంగా ప్రజల అండదండల మీద ఆధారపడి ఉంటుంది. ప్రభుత్వకలాపాలు ప్రజలకు స్పష్టంగా బోధపడకపోతే వారి అండదండలు ప్రభుత్వానికి లభించవు. ఒక రాష్ట్రం శాసనసభ వివిధ భాషల కోలాహలంగా పరిణమించకుండా ఉంచాలంటే ఆ శాసనసభ కార్యక్రమాలు ఒకే భాషలో ప్రజలభాషలో నిర్వహించబడాలి. బహు భాషా రాష్ట్రాలలో భావప్రకటన అవసరాలు తీర్చేందుకు అవలంబిస్తున్న విధానాలు జాతి శక్తీ సంపదా దుబారా కావడానికి దారి తీస్తున్నాయి.

**ప్రాంతీయ భాషలకు యథోచిత స్థానాన్ని సమకూర్చడం ద్వారానే విద్యారంగాన్ని మనం చైతన్యవంతం చేయగలము. విద్యాధికులైన అల్ప- సంఖ్యాకులకు, ప్రజాస్వామ్యానికీ మధ్య అఖాతం ఏర్పడకుండా ఉండాలంటే వారి భాష ద్వారానే విద్యాబోధన జరగాలి.**

**భాషా ప్రయుక్త రాష్ట్రాలు కావాలనే వారి ధ్యేయం కేవలం సాంస్కృతిక పునరుజ్జీవనం మాత్రమే కాదు. వివిధ భాషావర్గాల వారికి రాజకీయంగానూ, ఆర్థికంగానూ కూడా న్యాయం సమకూర్చడం వారి లక్ష్యం. బహుభాషా రాష్ట్రాలలో రాజకీయాధికారం, ప్రభుత్వ నిర్వహణాధికారం అధిక ప్రాబల్యం గల భాషావర్గం వారి హస్తగతం అవుతున్నాయి.** భాషాపరంగా అల్పసంఖ్యాక వర్గాలవారికి రాష్ట్ర పరిపాలనా నిర్వహణలో తమ అభీష్టాలను ప్రకటించే అవకాశం లభించడం లేదు. మంత్రివర్గంలో ప్రాతినిధ్యం సంపాదించే పెద్ద అల్పసంఖ్యాక వర్గం విషయంలో కూడా ఆ భాషా వర్గ ప్రతినిధులు పార్టీ క్రమశిక్షణ వంటి పలు కారణాలవల్ల తమ భాషావర్గాల ప్రయోజనాలను తగినంతగా కాపాడలేకపోతున్నారు.

అలాగే-బహుభాషా రాష్ట్రాలలో ప్రజా సంక్షేమ కార్యక్రమాలూ, అభివృద్ధి పథకాలూ వివిధ భాషా వర్గాలకు అసమానంగానూ, అన్యాయంగానూ కేటాయించబడుతున్నాయి. ప్రాబల్యం గల భాషావర్గం ఉన్న ప్రాంతం బాగా అభివృద్ధి చెందుతూ, ఇతర భాషావర్గాలు ఉన్న ప్రాంతాలు దెబ్బతింటున్నాయి. అందుచేత భాషారాష్ట్రవాదుల లక్ష్యం సాంఘిక, సాంస్కృతిక రంగాలలోనే కాక, రాజకీయ, ఆర్థిక రంగాలలో కూడ అల్పసంఖ్యాక భాషావర్గాల వారికి న్యాయం సాధించడం. విభిన్న వర్గాలను బలవంతంగా కలిపి ఉంచడం వల్ల పరిపాలనలో సంఘర్షణ, సామరస్య లోపం తప్పవు. అవసరమైన ఏకత్వభావన లోపించినప్పుడు ఇష్టం లేకుండా ఎంత ఎక్కువ కాలం సహజీవనం సాగించినా అది ప్రజాస్వామిక సంస్థల సక్రమ నిర్వహణకు అవసరమైన పరస్పరావగాహననూ, సద్భావమునూ కలిగించలేదు.

## ఉమ్మడి రాష్ట్రాలవల్ల అనర్థం

ప్రాబల్యం గల భాషా వర్గాలు అభివృద్ధి 'రొట్టె'లో పెద్ద ముక్కను కాజేస్తూ ఉండడమే మనదేశంలో అంతఃకలహాలకూ, పోటాపోటీలకూ కారణం అవుతుంది. అందువల్ల బహుభాషా రాష్ట్రాలు వివిధ భాషా వర్గాల మధ్య సంఘర్షణలకేకాక, భాషాపరమైన పక్షపాతం చూపుతున్నారనే అనుమానాలకు కూడా దారితీస్తున్నాయి. ప్రతి భాషావర్గమూ, నిజమైన, లేదా ఊహించుకుంటున్న ఏదో అన్యాయానికి తాము గురి అయినట్టు వాపోతూ ఉండడం సంభవిస్తుంది. రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ ద్వారా సంఘ నివేదిక 'రాష్ట్రాలను భాషా ప్రాతిపదిక మీద పునర్వ్యవస్థీకరించడం ద్వారా 'మేము అల్పసంఖ్యాకులము' అనే భావాన్ని తొలగించడం ఒక్కటే ప్రజల అసంతృప్తినీ, ఆవేదననూ పోగొట్టగలదు' అనే నిర్ణయానికి రావడం చాలా సముచితంగా ఉంది. ఆ కమీషన్ వారు ఎత్తిచూపిన ఈ క్రింది నగ్నసత్యాన్ని ఎవరు కాదనగలరు?

**భాషాభేదాలతో కలుషితమైన రాజకీయ వాతావరణ రాజ్యాంగ యంత్రాంగం అంతటికీ ప్రాకింది. ప్రధానమైన ఉద్యోగాలన్నీ ప్రాబల్యం గల భాషా వర్గం వారి హస్తగతం అవుతున్నాయి. ఉద్యోగస్థుల నియామకాలూ, ప్రమోషన్లూ కేవలం పరిపాలనా సౌకర్యం దృష్ట్యాగాని, ఉద్యోగుల సమర్థతను బట్టిగాని, న్యాయదృష్టితోగాని ఎంతమాత్రం జరగడం లేదు.**

భాషారాష్ట్ర వాదాన్ని సాంస్కృతిక ప్రజాస్వామ్యానికి అవసరమైన పునాదిగాకాక, ప్రజలను రెచ్చగొట్టే హానికరమైన సిద్ధాంతంగా చిత్రించడానికి మనదేశంలోని కుహనా మేధావి వర్గం నిర్విరామంగా ప్రయత్నిస్తుంది. అంత తీవ్రంగానూ మన దేశానికి శత్రువులైనవారు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో, తమ ప్రతినిధుల ద్వారానో, లేక దూర నియంత్రణ (remote control) విధానాలు ద్వారానో దేశంలో అరాచకాన్ని సృష్టించే పథకంలో భాగంగా

ప్రాంతీయ,భాషాపరమైన సంఘర్షణలను రెచ్చగొడుతున్నారు. భాషా ప్రాతిపదిక మీద ఇండియాలో రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ జరిగిన అనంతరం మనదేశంలో ఏర్పడిన హానికరమైన రాజకీయ పరిణామాల దృష్ట్యా-విజ్ఞతతో కూడిన నాయకత్వం మనకు లభిస్తే తప్ప- లేకపోతే దేశీయ, విదేశీయ విద్రోహ చర్యల ఫలితంగా సర్వస్వతంత్ర, ఐక్య భారతదేశాన్ని గూర్చి మనం కన్న బంగారు కలలన్నీ విచ్చినం కాకమానవు. భాషారాష్ట్రాలు కావాలన్న కోరికను అణగద్రొక్క జూడడం కాక, సృజనాత్మక, సామరస్యధోరణులతో కూడిన ఫెడరల్ రాజ్యాంగానికి దోహదం చేసే శక్తులను సృష్టించడమే భవిష్యత్తులో మన విధానంగా రూపొందాలి. కేంద్ర సార్వభౌమాధికారాన్ని, బహుభాషా తత్త్వాన్ని సమన్వయపరచి, వైవిధ్యంలో ఏకత్వాన్ని మనం ఏవిధంగా సాధించగలము? అందుకు అవసరమైన 'వంతెనలు' కొన్ని ఇదివరకే మన రాజ్యాంగంలో నిర్మింపబడి ఉన్నాయి. వాటిని గుర్తించడం, బలపరచడం అందరికీ సమానంగా సంక్రమించిన జాతీయ వారసత్వానికీ, మన స్వాతంత్ర్యోద్యమానికీ సంబంధించిన స్మృతులను ప్రజ్వలింపచేసి, వాని కాంతిలో మన భాషలనూ, సంస్కృతులనూ, సమన్వయ దృష్టినీ ప్రకాశింపజేయడం అవసరం.

## ఇండియాకు ఒక అనుబంధ భాష

భాష సమైక్యానికే తప్ప విభజనకు దారితీయకుండా ఉండాలంటే అటు భారతీయ అనుబంధ భాష అభివృద్ధికీ, ఇటు ఇతర భారతీయ భాషలకు సంపూర్ణ వికాసం చేకూర్చడానికి మధ్య ఎలాంటి వైరుధ్యమూ లేని సమర్థమైన ఒక భాషా విధానాన్ని మనం రూపొందించుకోవాలి. అంతర్జాతీయ స్థాయిలో ఉపయోగించేందుకూ, అమిత వేగంతో వృద్ధి పొందుతున్న వైజ్ఞానిక, సాంకేతిక శాస్త్రాల సవాళ్ళను ఎదుర్కొనేందుకూ ప్రపంచం మీదికి తెరుచుకునే కిటికీలాంటి ఒక అంతర్జాతీయ భాషకూడా మనకు అవసరమే అని మనం గుర్తించాలి. ఒక్కమాటలో చెప్పాలంటే **మన పార్లమెంటు ఏనాడో ఆమోదించి ఉన్న 'త్రిభాషా సూత్రాన్ని' మరింత పటిష్ఠంగా మనం అమలు జరపాలి. మన 'భాషా విధాన' స్వరూపానికి ఆ మూడు భాషలూ ముప్పేటగా ముడిబడేట్టు త్రివేణీ సంగమం అయేట్టు చూడాలి. మన ప్రధాన భారతీయ భాషలన్నీ మిక్కిలి సంపన్నమైనవి.**

**తన మాతృభాష ఒక్కటే తెలిసి ఉన్న వ్యక్తికూడా ఆ భాష ద్వారానే అత్యున్నత పదవులను అధిరోహించడానికి అవసరమైన సామర్థ్యాన్ని సంపాదించుకునేందుకు వీలుగా ప్రతిభాషనూ ఆధునీకరించాలి, అభివృద్ధి పరచాలి, అంటే విద్యాబోధన, ప్రభుత్వపాలన, శాసనరచన, న్యాయనిర్వహణ - అన్నీ ఆ రాష్ట్రపు భాషలోనే జరగాలి.** ఈ కార్యం సాధించాలంటే అందుకు మన మేధావులూ, ప్రభుత్వోద్యోగులూ, విశ్వవిద్యాలయాలూ, సాంస్కృతిక నాయకులూ అంతా ఏకమై భగీరథ ప్రయత్నం చెయ్యవలసి ఉంటుంది. కాని, దుదృష్టవశాత్తు పైన పేర్కొన్న ఈ అన్ని వర్గాలవారూ దేశీయభాషల పట్ల ఇంతవరకు సవతితల్లి ప్రేమనే ప్రదర్శిస్తూ వచ్చారు. తత్ఫలితంగా దేశభక్తి ఏమాత్రం లేకుండా మన వివిధ భాషల అభివృద్ధి కుంటుపడింది. పైపెచ్చు మనభాషలు నిస్సారమైన భాషలనీ, దేశపరిపాలనకూ, శాసనరచనకూ అవసరమైన శక్తి వానిలో మృగ్యం అనీ వారు వాదిస్తున్నారు. నిజానికి సంపూర్ణ వికాసం పొంది ఆధునిక భావ ప్రకటనకు అనుకూలంగా రూపొందడానికి ఏ భారతీయ భాషకూ తగినంత అవకాశం ఇంతవరకూ కల్పించబడలేదు. బహుశః వలసరాజ్య కాలంలో దేశీయ భాషలవల్ల మనకేర్పడిన నిరసన భావాన్ని మాత్రం కొంతవరకు అధిగమించగలిగామేమో! కాని త్రికరణ శుద్ధిగా చెప్పాలంటే ఈనాటికీ ఇంగ్లీషు అంటేనే మనకు అభిమానం. అయితే-శుద్ధమైన ఇంగ్లీషు భాష మాట్లాడడానికి ఏనాడో మనం స్వస్తి చెప్పాము. ఈనాటి మన ఇంగ్లీషు సంకర రూపాలతో కూడిన తప్పుల తడికగా, అతి ఘోరంగా తయారైంది. ఇక - మన హిందీ కూడా సంస్కృతభాషా వ్యామోహితుల చేతులలో చిక్కి, అన్య సంస్కృతుల సంపర్కంతో ఏర్పడిన విశిష్ట లక్షణాలను కోల్పోయి, సంస్కృత పద భూయిష్టమై అసహజంగా తయారైంది. తక్కిన ప్రతి భారతీయ భాష తాను ఇంగ్లీషంత అభివృద్ధి సాధించలేదే అనీ, కనీసం జాతీయభాష అయి, 'హిందీ' అంత గౌరవాన్ని అయినా పొందలేదే అనీ, 'ఆత్మన్యూనతా భావం'తో (inferiority complex) బాధపడుతుంది. మనలో వలస రాజ్యభావన, సంకుచిత ప్రాంతీయ తత్త్వం, భాషా దురభిమానం కరడుగట్టుకు పోయినందువల్ల ఈనాడు భాషాపరంగా మనదేశం అథోగతిలో ఉంది. విదేశాలలో ఇద్దరు భారతీయులు కలుసుకుంటే దారుణమైన ఇంగ్లీషుభాషలో వారు మాట్లాడుకోడం జరుగుతూంది. (అదీ- వారికి ఇంగ్లీషు వచ్చి ఉంటే, ప్రాంతీయమైన అసందర్భపు ఉచ్చారణలు లేకుండా మాట్లాడగలిగితే) యథాపూర్వస్థితిని పునరుద్ధరించాలని వాదించే వింతప్రవక్తలు 'రాష్ట్రీయ వైవిధ్యంలో జాతీయ ఏకత్వం' అనే సూత్రానికి సాంస్కృతికంగా చాలా హాని కలిగిస్తున్నారు. అలాంటి వారి ప్రయత్నాలను వమ్ముచేసి, ఆధునిక అవసరాలను తీర్చే విధంగా మన భాషలకు'స్వయంసమృది'ని (self-sufficiency) సమకూర్చుకోవాలి.

## ఇంగ్లీషు ఆవశ్యకత

ఇంగ్లీషు భాషను మనం వదులుకోడానికి వీలులేదు. ఒకనాటి శాపమే ఈనాటి వరం. ప్రపంచంలో ఇంగ్లీషు మాట్లాడేవారి ప్రాబల్యం పెరుగుతూ వస్తున్నందువల్ల వలసరాజ్యపు వారసత్వంగా సంక్రమించిందే అయినా ఇంగ్లీషు భాష మనకు ఒక నిధి లాంటిది. అంతర్జాతీయ సమాజంలో ఒక సభ్యదేశంగా ఇండియాకు ఇంగ్లీషు అవసరం. జపాన్లో ఇంగ్లీషు నేర్పుతున్నారు. రష్యాలో ఇంగ్లీషు నేర్పుతున్నారు. ప్రపంచం అంతా అమెరికన్ యాసతో కూడిన ఆంగ్లో-శాగన్ భాష ఈనాడు మాట్లాడుతుంది. అది వలసకాజ్యం నాటి భాష అనే ఎలాంటి సంకోచం లేకుండా జీవితంలోని అన్ని రంగాలలోనూ మనభావాలను ప్రకటించుకోగలిగేటట్టు ఇంగ్లీషు భాషను మనం అధ్యయనం చేయాలి. ఇంగ్లీషు ఇప్పుడు సామ్రాజ్యవాదుల భాష కాదు. ప్రపంచభాష. మనం ఈ ప్రపంచానికి, ఈ భూగోళానికి చెందినవాళ్ళం. ఇంగ్లీషును ఆదరించడం భాషాపరమైన వాస్తవికతను గుర్తించడమే కాని, జాతీయాభిమానానికి స్వస్తి చెప్పడం కాదు.

## జాతీయ భాష

**అంతర్జాతీయ దృష్టి జాతీయాభిమానానికి భంగకరం కాదు. మన సాంస్కృతిక వైభవాన్నీ, జాతీయ ఏకత్వాన్ని చాటే ఒక జాతీయ భాష (linguafranca) మనకు అవసరం. సహజంగానే అది 'హిందూస్తానీ', సంకుచిత దృష్టితోనూ, మూఢవిశ్వాసాలతోనూ కూడిన సంస్కృత పదభూయిష్టమైన 'హిందీ' కాదు.** ఇండియాలోనే వివిధ

భాషా వర్ణ సంశోభితమైన మనోహర దృశ్యాన్ని ప్రతిఫలిస్తూ 'కదంబం'గా ఏర్పడనున్న ఒక వినూత్న భాష. మన 'జాతీయభాష' మీద ప్రతి ప్రాంతీయ భాష తాలూకు వారసత్వపు ముద్ర కనిపించాలి. 'హిందూస్తానీ'కి ప్రధానమైన ప్రాతిపదికలు హిందీ, ఉర్దూ భాషలే అయినా, ఇతర భారతీయ భాషలనుంచి స్వీకరించే సముచితమైన పదాలతోనూ, సరళమైన పదాలతోనూ, పద బంధాలతోనూ అది మరింత పుష్టిని సాధించాలి. ఈ ప్రక్రియను వ్యత్యస్తం చేసి జాతీయభాష అయిన 'హిందుస్తానీ' నుంచి పలు పదాలనూ, పదబంధాలనూ యథేచ్ఛగా స్వీకరిస్తూ ప్రతి భారతీయభాష సుసంపన్నం కావాలి. ఈ విధంగా సమ్మిశ్రితం చెంది ఏర్పడే ఒక జాతీయభాషను (వీలైతే-ఒక సామాన్య లిపితో సహా) మనం రూపొందించుకో గలిగితే, అది భౌగోళికంగా దూర దూర ప్రాంతాలలో జీవించే ప్రజలందరి సాంస్కృతిక వైవిధ్యాన్నీ, పదజాల వైవిధ్యాన్ని ప్రతిఫలించగలిగితే అలాంటి జాతీయభాషకు ప్రతిఘటన చాలావరకు తగ్గిపోతుంది. మనం ద్వేషిస్తున్నది హిందీవారి సామ్రాజ్యవాద తత్వాన్ని మాత్రమే. ఉదారంగా వివిధ భారతీయ భాషా భాండారాల నుంచి పదజాలాన్నీ స్వీకరించే హిందూస్తానీని అందరూ ఆదరిస్తారు. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ప్రేమపూర్వకమైన ఒక ఉద్యమం కొనసాగించి సాంస్కృతికమైన ఈ కలను నిజం చేసికోగలిగితే మహత్తరమైన శక్తితో 'త్రిభాషాసూత్రం' భారతీయ ప్రజలందరినీ ఒక్క త్రాటి మీద నడిపించగలదు. నిజం చెప్పాలంటే- భాషాపరమైన 'స్వదేశీ', 'స్వరాజ్య' ఉద్యమాలకు మనం ద్రోహం చేశాము. నిమన భాషలే మనల్ని విడదీస్తున్నాయి." అంటూ పరస్పర నిందారోపణలకూ, దూషణలకు దిగడంకాదు. ఈనాడు మన కర్తవ్యం. మాతృభాష, జాతీయభాష, ఇంగ్లీషు ఈ మూడూ సరిసమానంగా అభివృద్ధి చెందడం మన దేశం అభ్యుదయానికి అవసరం అని చాటుతూ ఒక ప్రజా ఉద్యమాన్ని నడపాలి. హిందీ మాట్లాడే రాష్ట్రాలలో ప్రతివ్యక్తీ కనీసం ఒక్క హిందీయేతర భాషనైనా అధ్యయనం చేసేట్టు చూడాలి. రాజకీయమైన దృఢసంకల్పం, విజ్ఞతతో కూడిన నైపుణి ఉంటే ఈ కార్యాన్ని మనం సాధించవచ్చును. భాషల విషయంలో మన పిల్లలు కుశాగ్ర బుద్ధులు. మన ప్రజలు సహజంగా బహుభాషా భాషులు. భాషా దురభిమానంతో, అనాగరక చిత్తవృత్తితో లాభాలు పొందే భాష మూఢ విశ్వాసులకూ, వారికి అండగా నిలిచిన రాజకీయ నాయకులకూ దాసోహం అనడం వల్ల ఈ రంగంలో మనం విఫలులం అవుతున్నాము.

## రాజ్యాంగంలో 40వ నిబంధన

బహు భాషావాదులు (Linguistic Pluralists) ప్రధాన ఉపపత్తి 'ప్రజాస్వామ్య వికేంద్రీకరణ'. ప్రజలందరూ ప్రజాహిత రంగంలో పాలుపంచుకున్న రోజున తప్ప అది ఫలవంతం కాజాలదు. అలాంటి పరిస్థితి కల్పించాలంటే అత్యున్నత అధికార వర్గంవారు రాష్ట్రస్థాయిలో అధికారాన్ని కేంద్రీకరించడం మాని, అట్టడుగున పంచాయితీ స్థాయిదాకా వివిధ సంస్థలతో అర్థవంతమైన రీతిలో పరిపాలనాధికారాలను పంచుకునేందుకు పూర్తిగా సంసిద్ధులు కావాలి. మనరాజ్యాంగంలో 40వ నిబంధన గాంధీ సిద్ధాంతాల కుహనా అనుకరణం కాదు. ప్రజలలో గల ప్రగాఢమైన విశ్వాస ప్రకటన అది. అట్టడుగున పంచాయితీలో, దానికి పైన జిల్లాపరిషత్తులో తగిన అంతస్తులలో ప్రభుత్వ, శాసన, న్యాయ నిర్వహణ రంగాలన్నిటిలోనూ నిజమైన అధికారాలతో ఆరోగ్యవంతమైన స్వయంపరిపాలన ఏర్పడడమే నిజమైన 'గ్రామ స్వరాజ్యం'. దానిని సాధించగలిగితే శిష్టవర్గ (elite) ప్రాబల్యం క్రమంగా క్షీణించి, ప్రజల భాషే ప్రభుత్వభాష అవుతుంది. ఈనాడు మనం చూస్తున్న 'పంచాయితీ రాజ్యం' వట్టి బూటకం. దాని ద్వారా 'పదవులను పంచుకునే పద్ధతి' ప్రజాహిత రంగాన్ని కలుషితం చేస్తుంది. **భాషారాష్ట్రాలు మనం సాధించవలసిన 'సాధ్యం' మాత్రమే కాదు, అవి సాధనం కూడా కావాలి.** సామూహిక భాగస్వామ్యం ప్రజల సాధనం, ప్రజారాజ్యం 'ప్రజాస్వామ్యాని'కి లక్ష్యం. దాపరికం లేకుండా ఉన్న నిజం చెప్పాలంటే జనరంజకులైన నాయకులకూ, గాంధీవాదులకూ కూడా అధికారాన్ని ప్రజల పరం చేయవలసి వచ్చేసరికి హఠాత్తుగా ప్రజాసామాన్యం నిరక్షరకుక్షులనీ, పరిపాలనా ప్రక్రియలను అవగాహన చేసుకోగల దక్షత వారికి లేదని అనిపిస్తూ ఉంటుంది. ఒకసారి అధికారం ప్రజాసామాన్యం చేతులలోకి వెళ్ళడం జరిగితే, వెంటనే దేశంలో మరింత ఐకమత్యం, సమానత్వం ఏర్పడతాయి. అంతేకాక, జనసామాన్యం కన్నుగప్పి ఎన్నికలలో విజయం సాధించేందుకు రాష్ట్రస్థాయి నాయకులకు నియోజకవర్గం ఏదీ లభించకుండా పోతుంది. జాతీయ ఏకత్వం అక్షరాల నిజం అవుతుంది. వయోజన ఓటింగ్ హక్కు అమలులో ఉన్నా, ఈనాటికీ ప్రజలకు నిజంగా అధికారం కట్టబెట్టే రాజకీయాలంటే వైముఖ్యం కనిపిస్తూంది.

అర్థంలేని భయాలు, భాషాప్రాతిపదిక మీద రాష్ట్రాలను ఏర్పాటు చేస్తే దారుణ పరిణామాలు సంభవించగలవని 'కేసండ్రా'ల వంటి మనమేధావులు చెప్పిన జోస్యం కేవలం అసత్యసూచనలే! కుహనా భారతీయాభిమానపు హెచ్చరికలే! సామూహికంగా నిర్ణయాలు తీసుకోవడం, జాతీయ జీవనరంగంలో ఉమ్మడి సంస్థలు ఏర్పరచుకోవడం, రాజ్యాంగ విధానాలలో అభ్యుదయకర సూత్రాలను పాటించడం వంటి చర్యలవల్ల దేశాన్నీ – దాని సాంస్కృతిక వైవిధ్యాన్నీ ఏకీకరించే ఉద్దేశంతో రాజ్యాంగంలో చేర్చబడిన నిగూఢశక్తిని వినియోగించు కోవడంలో మన నాయకులు విఫలులయ్యారు. ఉదాహరణకు రాజ్యాంగంలోని 263వ నిబంధన వివిధ రాష్ట్రాల మధ్య ఉత్పన్నం అయ్యే సమస్యలను పరిష్కరించి, సహకారాన్ని పెంపొందించడం కోసం ఉద్దేశపూర్వకంగానూ, ప్రయోజన దృష్టితోనూ చేర్చబడింది. ఆ నిబంధన లేని పక్షంలో వివిధ రాష్ట్రాల మధ్య సంఘర్షణలూ, అంతఃకలహాలూ, పోటాపోటీలు ఏర్పడి ఉండేవి. కేంద్రానికీ, రాష్ట్రాలకూ మధ్యగాని, వివిధ రాష్ట్రాల మధ్యగాని సహకారాన్ని మెరుగుపరచడమే ఆ నిబంధన ముఖ్యోద్దేశం. 'రాష్ట్రాల కౌన్సిల' సమావేశాలలో ఎన్నో సమస్యలను చర్చించుకోవచ్చును. పరిస్థితులు చేజారిపోకుండా నివారించుకోవచ్చును. రాష్ట్రాలతోనూ, కేంద్రంతోనూ సమానంగా అనుబంధం గల ప్రధాన జాతీయ సంస్థలలో అధికారుల నియామకం రాష్ట్రాల కౌన్సిల్ సిఫార్సులకు వీలైనంతవరకు వదిలివేయడం మంచిది. ప్లానింగ్ కమీషన్ సభ్యుల ఎన్నిక, సుప్రీంకోర్టు న్యాయమూర్తుల నియామకం రాష్ట్రాల కౌన్సిల్ సిఫార్సులకు వీలైనంత వరకు వదిలివేయడం మంచిది. జాతీయ ఎన్నికల సంఘం, యు.పి.ఎస్.సి. కమీషన్ వంటివి రాష్ట్రాల కౌన్సిల్ సిఫార్సుల

ననుసరించి జరగాలి. కాకపోతే తుది నిర్ణయం ప్రధానమంత్రికి వదిలివేయవచ్చును. రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ తరువాత ఏర్పరచాలనుకొన్న ప్రాంతీయ కౌన్సిళ్ళను పటిష్టంగా పనిచేయించినట్టయితే, సమిష్టి ప్రయోజనం వున్న విషయాలను పరిష్కరించడంతో సామరస్య సాధనకు ఎంతగానో తోడ్పడగలవు.

**సంస్థల వికేంద్రీకరణ**

పైన పేర్కొన్న సుప్రీంకోర్టుకు, వివిధ కమీషన్‌లకు మన జాతీయ జీవితంలో ప్రధానపాత్ర నిర్వర్తించే మరికొన్ని అలాంటి సంస్థలకు అధికారులను నియమించే ముందు రాష్ట్రాలను సంప్రదిస్తే జాతిని కలిసికట్టుగా ఉంచడంలో అవి కీలకమైన పాత్రను నిర్వర్తించగలవు. గవర్నరుల నియామకం కూడా ఇలాంటిదే. ఇలా ఇంకా ఎన్నెనా పేర్కొనవచ్చును. జాతి ఏకీకరణలో మిక్కిలి ప్రధానమైన అంశం. వివిధ స్థాయిలలో రాష్ట్రాల తాలూకు అధికార, అనధికార ప్రతినిధులను తరచు సమావేశపరుస్తూ ఉండడం. అంతేకాక సంస్థల వికేంద్రీకరణ కూడా జాతి ఏకీకరణకు దోహదం చేస్తుంది. దేశంలో వివిధ ప్రాంతాలలో సుప్రీంకోర్టు బెంచీలను ఏర్పరచడం, రాష్ట్రాలలో వేర్వేరు ప్రాంతాలలో హైకోర్టు బెంచీలను నెలకొల్పడం, పార్లమెంటు సమావేశాలు దేశంలో పలు ప్రదేశాలలో జరుపుతూ ఉండడం, ప్రతి రాష్ట్రానికీ ప్లానింగ్ కమీషన్ శాఖ ఒకటి ఏర్పరచడం, జాతీయ పరిశోధక సంస్థలను వేర్వేరు ప్రాంతాలలో స్థాపించడం, జాతీయ ఎన్నికల సంఘం శాఖలను అన్ని రాష్ట్రాలకు విస్తరింపజేయడం, హైకోర్టులకు ప్రాంతీయ అప్పీళ్ళ విచారణ బెంచ్‌లను స్థాపించడం-ప్రజాభీష్టాలను తీర్చే ఇలాంటి చర్యలద్వారా మాత్రమే వేర్పాటు వాదుల పన్నాగాలను వమ్ముచేయడం సాధ్యం కాగలదు. జాతీయ సమైక్యసాధన ప్రక్రియ జాతీయాభివృద్ధి కౌన్సిల్ వంటివి కేవలం మన మంత్రులు గూడుపుఠాణీ చేసే గుహలుగా తయారు కాకూడదు. **'ప్రభుత్వం' కంటే 'సమాజం' గొప్పది. ప్రజల ఆలోచనల తీరును నడిపించే మేధావులకు తగిన అధికారాలూ, అవకాశాలు కలిగిస్తే ఉత్తమ రాజనీతివేత్తల పాత్రను వారు నిర్వహించగలరు.** 'ప్రాంతీయ జుడిషియల్ కౌన్సిల్' లను ఎందుకు ఏర్పాటు చేయకూడదు? అదే విధంగా ప్రాంతీయ ప్రాధాన్యం గల ఉమ్మడి సంస్థలకు కూడా ప్రాంతీయశాఖలు ఎందుకు ఏర్పరచకూడదు? **అసలు లోపం ఎక్కడున్నదంటే - భాషా ప్రాతిపదిక మీద రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ జరిగిన అనంతరం తీవ్ర జాతీయవాదానికీ, ప్రజాదరణగల భాషా రాష్ట్రవాదానికి మధ్య సమన్వయం సాధించే దృష్టితో తగిన అనంతర చర్యలు తీసుకోవడం జరుగలేదు.**

పొట్టి శ్రీరాములుకూ, ఆయన సందేశానికీ మనం ద్రోహం చేశాము.ఆయనను సరిగా అర్థం చేసుకోకుండా, ఆయన చేసిన ఆత్మ బలిదానాన్ని ప్రాంతీయతత్త్వ విజయంగా చిత్రించి, ఆయనను పరిహసింప జూచాము. ఈవిధంగా మనలోని కుహనా వలసరాజ్య నాగరకత యొక్క ప్రభావం 'వైవిధ్యంలో ఏకత్వం' అనే మన జాతి ప్రధాన సూత్రానికి తీరని హాని కలిగించింది. 'రాజకీయ ప్రాంతీయ వాదాన్ని' (Political regionalism) పరిహసించడం వంటి పలు రూపాలలో ఆ ప్రభావం అభివ్యక్తం అయింది. మైనారిటీలకు రక్షణ కల్పిస్తూ స్వతంత్రంగా తాను అభివృద్ధి చెందాలని సమానధర్మాలు గల ఒక భాషా ప్రాంతం ప్రజలు కోరే కోరికను ఎవ్వరూ అణచివేయజాలరు. అలా అణచివేసిన నాడు అత్యద్భుత వాస్తవం అయిన మన 'సాంస్కృతిక వైవిధ్యం' దెబ్బతినక మానదు. ప్రజల సాంస్కృతిక వారసత్వాన్నీ, భవిష్యత్తునూ ప్రకటించే సంపన్నమైన భాషలు అనేకం ఉండడం దేశానికి విపత్తు కాదు. పరిపుష్టి కలిగించే అంశమే అది.నేడు మన కర్తవ్యం పొట్టి శ్రీరాములుకూ, ఆయన మిషన్‌కూ అజ్ఞానంతో కొరతవేయడం కాదు, గాంధీజీ బోధనల ద్వారా ఏ 'స్వరాజ్య స్వదేశీ' సిద్ధాంతం శ్రీరాములును ఉత్తేజ పరచిందో, ఆ సక్రమమైన మార్గంలో ఆ ఉద్యమాన్ని పునరుద్ధరించడం!

**ఉపసంహారం**

**ఎన్ని ప్రగల్భాలు పలికినా, ఎన్ని ఆశలు పెంచుకున్నా భారతీయులందరికీ సాంస్కృతిక స్వేచ్ఛ లభించనంతవరకూ ఇండియాకు స్వాతంత్ర్యం సిద్ధించదు.చిట్టచివరి భారతీయుడు కూడా ఈ దేశంలో తనూ ముఖ్యుడే అని అనుకోలేనంత వరకూ 'నూతన వలస రాజ్యతత్త్వం'తో నానాటికీ బలపడుతున్న మన సాంస్కృతిక దాస్యాన్ని మనం అంతమొందించలేము. దేశంలోని అత్యున్నత అధికార పరిషత్తులలో కూడా తన మాతృభాష ద్వారానే తన గొంతు వినిపించే అవకాశం కలుగనంతవరకూ దేశం ఆర్థిక, రాజకీయ రంగాలలో ఏ వ్యక్తీ ముఖ్యుడు కాజాలడు.**

ఆత్మనాశం చెంది జీవచ్ఛవంగా బ్రతికే వ్యక్తిని కూడా జవహర్ పండితుడు నుడివిన ఈ క్రింది వాక్యాలు ఉత్తేజపరచగలవు.

*'ఇండియా మరణిస్తే ఎవరు బ్రతికి ఉంటారు?*
*ఇండియా బ్రతికి ఉంటే ఎవరు మరణిస్తారు?"*

అత్యావశ్యకమైన మన జాతీయతకూ, అంతగానూ అవసరమైన ప్రాంతీయాభిమానానికీ మధ్య సమన్వయం సాధించే పటిష్ఠమైన నూతన సాధనాలు అన్వేషించమనీ, రాజనీతి విజ్ఞత ప్రదర్శించమనీ అప్రకాశితంగా ఉండిపోయిన భారతీయ విప్లవ చరిత్ర మనల్ని సవాలు చేస్తూంది. దయచేసి పొట్టి శ్రీరాములుకు న్యాయం చేకూర్చండి. చిత్తశుద్ధితో గాంధీజీకి జోహారు లర్పించండి.

(అనువాదం : బొమ్మకంటి శ్రీనివాసాచార్యులు,
వెలది సత్యనారాయణ)



డా.నాగసూరి వేణుగోపాల్ సంపాదకత్వంలో వెలువడిన 'అమరజీవి బలిదానం- పొట్టిశ్రీరాములు పోరాటగాథ' అనే పుస్తకం నుండి ఈ వ్యాసాన్ని తీసుకున్నాము. సంకలనకర్తకీ, ప్రచురించిన 'ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత మరియు సంస్కృతి సమితి' వారికీ కృతజ్ఞతలు....

**సంపాదకుడు-అమ్మనుడి**




# చంద్రిక కథ

## అరవంలో వ్రాసిన అసంపూర్ణ నవలకు

## బంగోరె 'ముందుమాటలు'

(గత సంచిక తరువాయి)

### అవీ - ఇవీ

1. లెనిన్‌పై మొత్తం భారతీయ భాషల్లో వచ్చిన సారస్వతాన్ని సమగ్రం కాకపోయినా వొకవిధమైన ఏరియల్ వ్యూలో పరిశీలనచేసి ఎల్.వి. మిత్రిఖిన్ అనే రష్యన్ రచయిత Everest Among Men (1969) అనే గ్రంథంలో సుబ్రహ్మణ్య భారతిగారికి ప్రత్యేక స్థానాన్నే ఇచ్చారు :

Bharati was one of the first in India to have mentioned the name of V.I. Lenin as the leader of the working people of Soviet Russia, under whose guidance tremendous changes were taking place in that country... Already in 1917, on Nov. 28 he had written in one of the Tamil newspapers that in Russia private property had been abolished and had become the possession of the entire nation. He pointed out that 'the socialist party in Russia' 'under the leadership of Sriman Lenin' had achieved its goal.

2. సమకాలిక వ్యక్తుల్ని పాత్రలుగా చేసి రచనచేసే సంప్రదాయాన్ని భారతిగారు మరోదాంట్లో కూడా కొనసాగించినట్లున్నారు. Fox with the golden tail (1914)అనే ఆంగ్లకథలో అనిబిసెంట్ యొక్క రాజకీయం, జిడ్డు కృష్ణమూర్తినీ ఆయన సోదరుణ్ణి ఆమె పెంచి పెద్దజేసిన విధంగూర్చి వొక పరిహాసకథగా కూడా వ్రాసినట్లున్నారు. (ఆర్.ఎ.పద్మనాభన్ గారి చిత్రభారతి అనే అనర్ఘమయిన తమిళ గ్రంథంలో దీన్ని పేర్కొన్నారు.)

3. సుబ్రహ్మణ్యభారతి గూర్చి వొక్క ఇంగ్లీషులోనే నేను 8 గ్రంథాలు దాకా చూడగలిగాను. వీటితో పోల్చి చూచుకున్నప్పుడు రేశలింగం గారిపై ఇంగ్లీషు గ్రంథాలు ఎన్ని వచ్చి ఉండాల? ఇంతదాకా ఎన్ని వచ్చిఉన్నాయి? తెలుగువాళ్ల నిరాసక్తతకు ఇంతకంటే నిదర్శనమేముంది? 1949లో కాబోలు మద్రాసు రాష్ట్ర ప్రభుత్వం భారతి రచనలపై కాపీరైటు కొనివేసి భారతి సాహిత్యాన్ని ప్రజల ఆస్తిగాచేసి ఆయన కుటుంబసభ్యులకు కొంత పైకమిచ్చి ఆదుకుని, ఆయన రచనలకు ప్రచారవిరివిని కల్గచేయకల్గింది. మన ఆంధ్రప్రభుత్వం ఇట్లాంటిపని జన్మలో చేయకల్గుతుందా? భారతిని గూర్చి తెలుగులో సైతం రెండు గ్రంథాలు వచ్చాయి. మరి వీరేశలింగంగార్ని గూర్చి తమిళంలో?

4. నేషనల్ ఇంటెగ్రేషన్ అనీ, భారతీయ భాషలు వేరయినా సాహిత్యమంతా వొకటే అనీ పైకి అంటుంటాంగానీ నిజానికి మనదేశంలోని వొక భాషకూ ఇంకొక భాషకూ మధ్య వొక పెద్ద అగాధమేదో ఉంది. ఇరుగుపొరుగు రాష్ట్రాల్లోని భాషల్లో ఏమేమి జరుగుతున్నదో పక్కనున్న ఇతర భాషలవారికైనా ఆట్టే తెలియడం లేదు.ఎక్కడో అమెరికాలో, రష్యాలో, బ్రిటన్లో, ఫ్రాన్సులో వచ్చిన రచనల్ను పట్టించుకొనిదే నిద్రపట్టని మనకు - తమిళంలో, బెంగాలీలో, గుజరాతీలో, మలయాళంలో సమకాలిక రచనలేమేమి వస్తున్నాయో పట్టించుకుంటున్నామా? 007, క్లియోపాత్రా, మెకన్నాస్ గోల్డ్ సినిమాలను ఈ దేశంలో ప్రదర్శించేందుకు బోలెడు అవకాశాలూ, వాటిని ఎగబడి చూచే జనమూ బోలెడంత మంది వున్నారు గానీ; అంతర్జాతీయంగా ఖ్యాతి పొందిన సత్యజిత్‌రాయ్, మృణాళినీసేన్, రుత్విక్ ఘటక్ చిత్రాలు, అట్లనే కన్నడ, మలయాళీ చిత్రాలు మనదేశంలోని ఇరుగు పొరుగు రాష్ట్రాల్లోనయినా ప్రదర్శించే అవకాశాలున్నాయా? వొకవేళ తప్పిదారీ ప్రదర్శిస్తే ఎంతమందిమి చూస్తున్నాం? భారతీయ సాంస్కృతిక జీవనవిధానంలోని ఈ అగాధాలేమిటి?

5. ఈ నవల తొమ్మిదో అధ్యాయంలో వాక్యమైనా సరిగా పూర్తిచేయబడకుండా మధ్యలో ఆగిపోవడం దురదృష్టకరం. 'లైఫ్' పత్రిక 1969 జనవరి 20 తేది సంచికలో మార్క్ ట్వైన్ 'ఇండియన్స్' అనే అసంపూర్ణ నవలను బయటకు లాగి అచ్చు వేసారు. తీరా చూస్తే అదీ తొమ్మిదో అధ్యాయంలో వొక వాక్యం మధ్యలో ఆగిపోయింది. ఆ తర్వాత విషయమేమిటి అనేదానిపై పెద్ద చర్చ జరిగింది. ముగిసిన రచనలకంటే, ముగియకుండా మధ్యలో ఆగిపోయిన రచనలే సారస్యంగా వుంటాయా అన్పిస్తుంది. కీట్స్ కవి చెప్పిన 'ఆనార్డ్ మెలోడీస్' మాదిరిగా!

6. నార్లగారు వీరేశలింగంగారిపై వ్రాసిన ఆంగ్ల గ్రంథంలో 'ముందుమాటల్లో' వొక బాధను వ్యక్తం చేసారు. భారతదేశంలో అగ్రస్థానమలంకరించదగిన మొదటి అరడజనుమంది సంఘసంస్కర్తలలో వీరేశలింగంగారు నిస్సందేహంగా వొకరయినపుడు,

ప్రత్యేకించి దక్షిణ భారతంలో ఆయన మహిమాన్వితమైన వ్యక్తిగా శక్తిగా ప్రకాశించినపుడు నేటి దేశ చరిత్రల్లో వీరేశలింగంగారు దాదాపు అనామకమైపోయి, ఆయనకు రావల్సినంత సముచితమైన స్థానం రావడం లేదేమోనంటూ – ఎస్. నటరాజన్ వ్రాసిన A century of Social Reform in India' అనే ఆంగ్ల గ్రంథంలో వీరేశలింగంగార్ని గూర్చి చాలా ఆ ప్రముఖమయిన ప్రస్తావనలు రెండే రెండు చోట్ల మాత్రం దొర్లాయనీ, అవీ ఏదో మామూలు ధోరణిలో పేర్కొనడం జరిగిందనీ Charles H. Heimsath వ్రాసిన 'Indian Nationalism and Hindu social reform' అనే గ్రంథంలో వీరేశలింగంగూర్చి వొకే వొక వాక్యం మాత్రమే వున్నదనీ బాధను వ్యక్తం చేసారు.

ఈ కొరత కొంతకు కొంతైనా మున్ముందు తీరగలదనే ఆశించేవాళ్లల్లో నేనొకణ్ణి. వీరేశలింగంగారు నిర్వహించి నేతృత్వం వహించిన ఉద్యమ విస్తార వైభవం గూర్చి మున్ముందు ఇంగ్లీషులోనూ తెలుగులోనూ మరిన్ని రచనలు రాగలవని ఆశిస్తున్నాను. డి. ఆంజనేయులుగారు నేషనల్ బుక్స్ వారికి వీరేశలింగంగార్ని గూర్చి ఆంగ్లంలో గ్రంథాన్ని వ్రాసిచ్చారనీ అది అచ్చువుతున్నదని అనుకుంటున్నాను. అమెరికన్ యువకుడు జాన్ జి. లియోనార్డుగారి వీరేశలింగంపై పరిశోధన గ్రంథాన్ని ఇప్పుడు హైద్రాబాద్లో రివైజ్ చేస్తున్నారు. బహుశా త్వరలో అదీ వెలుగు చూడగలదని ఆశిస్తున్నాను. ఇవి రెండూ వీరేశలింగంగారిపై కొంత కొత్త వెలుగును ప్రసరింపజేయగలవని ఆశిస్తాం.కొడవటిగంటి కుటుంబరావు గారిచేత సంక్షిప్తం చేయబడిన 'వీరేశలింగంగారి స్వీయచరిత్ర'ను నేషనల్ బుక్స్‌ట్రస్ట్‌వారు అన్ని భారతీయ భాషల్లోకి అనువాదం చేయించి ప్రకటిస్తున్నారు. ఇక తెలుగులో ఏమయినా గ్రంథాలు వస్తాయా అంటే మన తెలుగువాళ్ళ తెగులును ఆ భగవంతుడే చెప్పగలగాలి. ఏమయినా వీరేశలింగం గారిపై తెలుగునాట ఇప్పుడు 'ఇంట్రస్ట్' కనపడుతున్నది. 'వీరేశలింగయుగం ఆయన చనిపోయాక ఇప్పుడిప్పుడే ప్రారంభమైనట్టు తోస్తుంది' అని దేవులపల్లి కృష్ణశాస్త్రి కవివాక్యం వూరకనే పోదు అనిపిస్తున్నది. (చూ: విశ్వోదయ స్టూడెంట్సు మేగజైన్, కావలి – 'సంఘసంస్కర్త: వీరేశలింగం పంతులు'– శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రి వ్యాసం.)

7. తెలుగులో బహుశా మొదటిసారిగా అనుకొంటాను, వొక నెల్లూరీయుడు కొమాండూరు పార్థసారథి అయ్యంగార్ భారతిగారి తమిళ జాతీయ గీతాలను ఏడింటిని తెలుగులోకి తర్జుమా చేసి 1947లో 'కాంగ్రెస్ ప్రచార పాటలు' అని వొక పుస్తకంగా అచ్చొత్తించారు. మళ్ళీ 25 సంవత్సరాల తర్వాత మరో నెల్లూరీయుడు ఈ బంగోరె భారతిగారి ఈ నవలను ఈ రూపంలో వెలువరిస్తున్నాడు. నెల్లూరు మాండలికాలను అక్కడక్కడా పని గట్టుకుని ప్రయోగించాడు. తర్జుమాలో, ఇవి ఇతర ప్రాంతాల వారికి తికమక కల్గించవనే ఆశిస్తున్నాను. తర్జుమా దోషాతీతమని చెప్పే సాహసం లేదు. తెలుగు పాఠకులు సహృదయంతో భరిస్తారనే ఆశిస్తున్నాను. ఉదాహరణకు మొదటి వాక్యంలోనే విరామచిహ్నాలు – హైఫన్లు, సెమికోలన్లు, కామాలు అన్నీ క్రిక్కిరిసి వొక వాక్యంలో తప్పుగా పడ్డాయి.

**కృతజ్ఞతలు**

In the Telugu country an author has generally to be his own publisher and book seller అని గురజాడ 1909లో అన్న వాక్యం నా విషయంలో నిజమై కూర్చున్నది. 'మొట్టమొదటి కన్యాశుల్కం స్కాలర్స్ ఎడిషన్, (1969)కు లాగానే దీని ముద్రణకూ అప్పు మంజూరు చేసిన కెనరా బ్యాంకింగ్ కార్పొరేషన్ వారికి మొదట కృతజ్ఞతలు చెప్పుకోవాల. రచనవిషయంలో నాకు కల్గిన సందేహాలను తీర్చడంలో యథాశక్తి తోడ్పడిన నార్ల, కె.వి. రమణారెడ్డి, చల్లా రాధాకృష్ణశర్మ, శ్రీమతి ప్రేమానందకుమార్, లియోనార్డు, మద్రాసు యు.ఎస్. ఐ.ఎస్.లోని బి.ఎస్.ఆర్. కృష్ణ,వి.ఒ.సి. సుబ్రహ్మణ్యన్ గార్లకూ తొలుత ఈ నవల తర్జుమాకు కారకులైన శ్రీ వి.ఎస్. రాఘవన్, ఎన్.ఎస్. కృష్ణమూర్తిగార్లకూ, ఇది తొలుత సీరియల్గా వెలువడినప్పుడు తగిన ప్రోత్సాహమిచ్చిన సెట్టి ఈశ్వరరావు, డి. ఆంజనేయులు, టి. కృష్ణాబాయి, సి.వి.రామచంద్రరావుగార్లకూ తర్జుమాలోని లోపాలను ఎప్పటికప్పుడు ఎత్తి చూపుతూ నిశితంగా విమర్శిస్తూ, మమ్మల్ని అలనాటి నెల్లూరు 'ముగ్గురు రసికులు'గా 'సాహిత్య గేలి' పట్టిస్తూ వచ్చిన మరుపూరు కోదండరామరెడ్డిగారికీ; తర్జుమా తొలిరూపాన్ని చదివి మార్పులు చేర్పులు సూచించిన వేదం వెంకటరామన్, కాళిదాసు పురుషోత్తంగార్లకూ, నా ఈ ప్రయత్నంపట్ల సౌజన్యపూరితమైన సహాయ ధోరణిని ప్రదర్శిస్తూ, ఠంచన్ గా ప్రత్యుత్తరాలు వ్రాస్తూ వచ్చిన ఆచార్య జి.ఎన్. రెడ్డిగారికీ; కాలేజీ సెలవుల్లో, ఎన్.జి.వో.ల స్ట్రయిక్ సమయంలో సతమతమవుతూ కూడా అడిగిన వెంటనే తమ లైబ్రరీ నుండి సరోజినీదేవి జీవిత చరిత్ర గ్రంథాన్ని అరువిచ్చిన నెల్లూరు దొడ్ల కౌసల్యమ్మ మహిళా కాలేజి ప్రిన్సిపాల్ అహ్మద్ బీబీగారికీ; నా ఈ కృషినిమెచ్చి సుబ్రహ్మణ్యభారతి గూర్చి ఇంగ్లీషులో వచ్చిన లేటెస్టు పుస్తకం 'ది ఫింగర్ ఆన్ ది ఫ్లూట్ ' ప్రచురణకర్తలయిన నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రిసర్చి అండ్ ట్రయినింగ్ వారి నుండి వొక కాపీని తెప్పించేందుకు విఫల ప్రయత్నం చేసిన నెల్లూరు బి.ఇడి. కాలేజి ప్రిన్సిపాల్ దీనదయాళ్ గారికీ, భారతిపై పి. మహదేవన్ గారి ఇంగ్లీషు పుస్తకాన్ని మద్రాసులో సేకరించి పంపిన ఫ్రీడమ్ ప్రెస్ యజమాని ఎం. బాలసుందరంగారికి; నా లొల్యాన్ని మన్నించి పత్రికలో 'న్యూస్' కివ్వాల్సిన 'స్పేస్'ను కొంత ఈ నవలకు కేటాయించి తొలుత సీరియల్గా ప్రకటించిన జమీన్ రైతు నిర్వాహకులకూ – ఇట్లా అందరికీ కృతజ్ఞతలు చెప్పుకోవడం నా విధి.

ఆఖరుగా నెల్లూరు ప్రొగ్రసివ్ యూనియన్ లైబ్రరీలోని అపురూపమయిన గ్రంథసంచయానికీ; అప్పుడప్పుడూ ఎందుకీ దండగమాలిన శ్రమంతా అని నిష్ఠురంగా మాట్లాడినా, వ్రాతలో ఏకాగ్రపరిశోధనలో ఆసరా ఇచ్చి ఆదుకుంటూ తోడ్పడిన నా శ్రీమతి సుమిత్రకూ; ముద్రణ వ్యవహారాన్ని సానుభూతితో శ్రద్ధతో నిర్వహించిన మద్రాసు ఫ్రీడం ప్రెస్‌వారికీ కృతజ్ఞతలు.

28–4–71 – బంగోరె

నెల్లూరు

**----- సమాప్తం**

మధురాంతకం నరేంద్ర
9866243659

# హర్షణీయం

సరిగ్గా మూడేళ్ల క్రితం, అంటే 2020 వ సంవత్సరం సెప్టెంబర్ నెలలో హైదరాబాదు నుంచి సర్వేపల్లి అనిల్ కుమార్ అనే యువకుడు ఫోన్ చేసి, రచయితలతో ముఖాముఖిని నిర్వహించాలనుకుంటున్నామనీ నాకెప్పుడు వీలవుతుందో చెప్పమని అడిగినప్పుడు అప్పటి ఆ ప్రయాణం ఎంత ముందుకు సాగుతుందనో నేననుకోలేదు. ముగ్గురు మిత్రులం కలిసి చేస్తున్న ప్రయత్నమని పరిచయం చేసుకున్న అనిల్, హర్ష, గిరి అనే నిహర్షణియరూ అనే పేస్ బుక్ కార్యక్రమం ఆ తర్వాత వెబ్సైటు గా మారి, పాడ్ కాస్ట్ రూపాంతరమయి, యిశీత పెద్దపని చేయబోతోందని ఆ ముగ్గురు మిత్రులు కూడా అనుకొని ఉండరు. చుట్టూ పెను చీకటి ముసురుకొని వుందని నైరాస్యంలో పడిపోకుండా, గోరంత దీపాన్ని వెలిగించే ప్రయత్నం గుర్తించినవాళ్ళు ఆ ముగ్గురు.

తెలుగు సాహిత్య ప్రపంచంలో గత పదేళ్లుగా పెద్ద చీకటి వ్యాపించి ఉందని మనకందరికీ తెలుసు. మొబైల్ ఫోన్ అనే జేబు పరికరంలోకి ఇంటర్నెట్ అనే శక్తి రావడంతోనే ప్రపంచమంతా పెద్ద మార్పులు వచ్చాయి. అయితే తెలుగు సాహిత్య ప్రపంచంలో వచ్చినన్ని దుష్పరిణామాలు బహుశా మరెక్కడా వచ్చి ఉండవు. ఒక్కసారిగా కాలక్షేపం కోసం పుస్తకాలు తిరగేసే పాఠకులతో పాటు మంచి పుస్తకాల ప్రేమికులు కూడా మొబైల్‌కు వలస పోయారు వార మాసపత్రికలు క్రమంగా మూతబడి పోయాయి. కరోనా వచ్చి వెళ్లినప్పుడు ఆమిషపైన మిగిలిన రెండు మూడు పత్రికలను కూడా పత్రికాధిపతులు మూసివేశారు. సాహిత్య పత్రికల నిర్వహణ వ్యాపారం కాదు. అయితే వ్యాపారంలో వచ్చినంత లాభం రావడం లేదని, అంతవరకూ పోషకులమని ముసుగేసుకున్న పెద్ద మనుషులందరూ తమ తమ కొట్లు కట్టేశారు. ఇప్పుడు చిన్న పట్టణాలనుంచీ వచ్చే నాలుగైదు నామమాత్రపు పత్రికలు మినహా పెద్ద పత్రికలు దాదాపుగా ఆగిపోయాయి. దినపత్రికల ఆదివారం అనుబంధాల్లో ఉన్న మూడు పేజీల స్థలంలో తెలుగు కల్పనా సాహిత్యం బోన్సాయ్ మొక్కలా సర్దుకుపోతోంది.

కరోనా వచ్చినప్పుడు కేరళ రాష్ట్ర ప్రభుత్వం గ్రంథాలయాల నుంచి పుస్తకాల్ని తీసుకువెళ్లి ఇళ్లల్లో పంచిపెట్టిందన్నారు. అయితే గత పదేళ్లుగా రెండు తెలుగు రాష్ట్రాల్లోని గ్రంథాలయాలు శిథిలాలయాలుగా పడిఉన్నాయి. పేరున్న పెద్దరచయితలు సైతం ఇప్పుడు,దాదాపు 18 కోట్ల మంది తెలుగువాళ్ళు ఉన్నారని చెప్పుకుంటున్న భాషలో ఐదువందల ప్రతులు వేయడం కూడా అవసరం లేదనుకునే పరిస్థితి ఉంది. అందరికీ తెలిసీ తెలియని వెబ్ పత్రికల్ని ఎంతమంది చదువుతున్నారో తెలియదు. పాఠకుడికీ రచయితకూ మధ్య ఉండాల్సిన వారధులన్నీ చిన్నాభిన్నమై పోయాయి.

అటువంటి పరిస్థితుల మధ్య తెలుగులో ఉండే ప్రముఖ రచయితలతో సంభాషణలు నిర్వహించి, వాటిని ఫేస్‌బుక్కులో రచించడంలో వినిపించడంలో హర్షణీయం ప్రారంభమైంది తల్లావఝుల పతాంజలి శాస్త్రి, కొలకలూరి ఇనాక్, శ్రీ రమణ వంటి పెద్దల దగ్గరుండి ప్రారంభమై వాసిరెడ్డి నవీన్, అనిల్ బత్తుల, మనసు రాయుడు గారు, పల్లవి వెంకటనారాయణ, నవోదయ సాంబశివరావుల వంటి పుస్తకాభిమానులంతా పలకరించి, స.వేం, రమేశ్, వేలు పిళ్లై, సి, రామచంద్రరావు, వంశీల వంటి అరుదైన రచయితలతో కలిసి వచ్చి, అనిల్ అట్లూరి, అరిపిరాల సత్యప్రసాదులవంటివాళ్లతో గత చరిత్రలన్నీ తలపోసి, అజయ్ ప్రసాద్, మల్లికార్జున్, సురేంద్ర శీలంవంటి యువ రచయితల్ని కదపడం వరకూ 'హర్షణీయం' ఇంటర్వ్యూలు కొనసాగాయి.,

ఏదైనా ఒక పని ప్రారంభించిన తర్వాత గమనంలో వచ్చిన మార్పులన్నీ ప్రయాణిస్తున్న వ్యక్తుల వ్యక్తిత్వంపైనా, చిత్తశుద్ధి పాన ఆధారపడి ఉంటాయి. కొన్ని ప్రయాణాలు పోను పోను విస్తృతమై అనుకోని మార్గాలను చేరుకుంటాయి. హర్షణీయం క్రమంగా విస్తరించుకున్న తీరు ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. తెలుగు సాహిత్యంతో ఆగిపోకుండా హర్షణీయం ఇందిరా పార్థసారథి వంటి తమిళ రచయితనూ వసుధేంద్ర వంటి కన్నడ రచయితనూ జయమోహన్ వంటి ఆధునిక తమిళ రచయితను కూడా పరిచయం చేయడం మొదలుపెట్టింది.

క్రమంగా హర్షణీయం దృష్టి పర్యావరణం పైకి మళ్లింది. అప్పుడు ప్రసిద్ధ బెంగాలీ రచయిత బిభుతీ భూషణ్ బందోపాధ్యాయ నవల నివనవాసీ నాంత శ్రవ్య రూపంలో వినిపించింది. తర్వాత పర్యావరణానికి కృషి చేసిన అద్భుతమైన వ్యక్తులన్నంతా వెతికి పట్టి వాళ్లతో ముఖాముఖి నిర్వహించింది. నిచేపల పెంపకం– సముద్రాలూ గురించి డాక్టర్ ఇ.వివేకానందన్ నిఅరణ్యాలు– జలవిద్యుత్ పథకాలూ గురించి జీతేన్ యుమ్నామ్, పశ్చిమ కనుమలలో వృక్ష పరిరక్షణ గురించి పాండురంగ హెగ్డే, జలవిద్యుత్ గురించి హిమంశు టాకూర్‌ల వంటి వారితో ముఖాముఖి కార్యక్రమాలు నలభైవరకూ నిర్వహించారని తెలిసినప్పుడు ఆశ్చర్య పడకుండా ఉండటం వీలు గాదు.

సహజంగానే హర్షణీయం చూపు అనువాదాలపై పడింది. ఇతర భారతీయ భాషలతో ఇంకా మాట్లాడితే దక్షిణ భారతదేశపు భాషలతో పోల్చి చూసినప్పుడు తెలుగువాళ్ళు అనువాద ప్రక్రియలలో సైతం ఎంత వెనుకబడి ఉన్నారో బోధపడుతుంది. 70 ఏళ్ల క్రితం అదొక యజ్ఞంలా అనువాదం చేయించి ప్రచురించిన ఆంధ్రగ్రంథమాల పుస్తకాలను మళ్లీ ప్రచురించుకోలేకపోతున్నాము. కొన్ని చరిత్ర గర్భంలో మునిగిపోయాయి. తమిళ, కన్నడ, మలయాళ సోదరులు ఆదాన ప్రదానాల్లో ఎంత ముందున్నారో మనకు తెలియదు. ఇటీవల ఓ మలయాళీ మిత్రుని చేతిలో మార్క్వెజ్ Hundred Years of Solitude' మలయాళీ అనువాదం కనిపించింది. వాళ్లకు ఆ నవలకు మూడు రకాల అనువాదాలు ఉన్నాయట అంతేకాదు ఆ మిత్రుని చేతిలో పుస్తకం 29వ ముద్రణ. దస్తోవిస్కీ జీవితం ఆధారంగా మలయాళంలో

వచ్చిన నవల రెండు లక్షల ప్రతులకుపైగా అమ్ముడుపోయిందట! మార్క్వేజ్‌ని 'వందేళ్ళ ఏకాంతం' ఇటీవలవరకూ తెలుగులో అనువదించబడలేదు. ప్రపంచ ప్రసిద్ధ సాహిత్యమంతా మలయాళీ సాహిత్యంలోకి అనువాదమై పోతోంది.

ఇక తెలుగులోంచి ఇతర భాషల్లోకి అనువాదమవుతున్న సాహిత్యాన్ని గమనించినప్పుడు మరింత వాపోక తప్పదు. తమ తమ భాషల్లోకి అనువాదాలు చేస్తున్న అనువాదకులకు అన్ని భాషల్లోనూ ఎంతో గౌరవం ఉంది. వాళ్లకు అనేక రకాల అవార్డులు ప్రాజెక్టులు ప్రోత్సహకాలుగా ఉన్నాయి. తెలుగులో అటువంటి ప్రోత్సాహకం ఒకటి కూడా లేదు. మన సాహిత్యాన్ని ఇతర భాషల్లోకి సక్రమంగా అనువాదం చేస్తున్న వాళ్ళను వేళ్ళపైన లెక్కపెట్టవచ్చు. ఇక ప్రపంచ భాషగా లెక్కించబడుతున్న ఇంగ్లీషులోకి అనువాదమవుతున్న పుస్తకాలూ రచయితల సంఖ్యా బాగా తక్కువ. ఉన్న అనుమాదాల్లో కొన్ని తప్ప మిగిలినవన్నీ ప్రామాణికత లేనివి మాత్రమే! ఎవరో కొద్దిమంది ప్రయోజకులైన రచయితలు తమ రచనల్ని శ్రమపడి డబ్బులు వెచ్చించి అనువాదం చేయించుకుని తామే ప్రచురించుకుంటున్నారు. అనువాదం కావలసిన గొప్ప రచనలు చాలా విస్మరించబడుతున్నాయి. ఈ విషయాలను క్రమంగా తెలుసుకున్న హర్షణీయం నిర్వాహకులు ఇతర భాషల్లో అనువాదాలు ఎలా జరుగుతున్నాయో తెలుసు కోవాలనుకున్నారు. భారతీయ భాషల్లో నుంచి ఇంగ్లీషులోకి అనువాదం చేస్తున్న వాళ్ళను సంధించారు. ముందుగా బెంగాల్ నుంచీ అనువాదాలు చేసే అరుణవ్ సిన్హా, కన్నడ నుంచి చేసే డాక్టర్ వనమాల విశ్వనాథ్, తమిళం నుంచి సుచిత్రా రామచంద్రన్, నేపాలీ నుంచి అనురాగ్ బాస్నెట్, మలయాళం నుంచి మినిస్తీ నాయర్, తమిళం నుంచి అనిరుద్ధన్ వాసుదేవ్, ప్రియంవద రామ్ కుమార్ లను వాళ్ళ అనువాదాల గురించి విశేషాలు అన్నీ అడిగి తెలుసుకున్నారు. తర్వాత సహజంగానే ప్రపంచంలోనే అనేక భాషల నుంచి ఇంగ్లీషులోకి అనువాదాలు చేస్తున్నవాళ్ల కోసం వెతికారు. మనసుపెట్టి వెతికితే దొరకనిది ఉండదని హర్షణీయం పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలు నిరూపించాయి.

ఉత్తర ఐర్లాండ్ నుంచి ఓవన్ గుడ్, రష్యానుంచి విల్ ఇవాన్స్, పార్సీ నుంచి మరియం రెహ్మాని, వియత్నాం నుంచి క్యూఎన్ హోయాంగ్, అమెరికా నుంచి ఆన్ గోల్డ్‌స్టైన్, యుక్రయిన్ నుంచి యుల్లెయామ్ బ్లాకర్, పోర్చుగల్ నుంచి డేనియల్ హాన్, బ్యాంకాక్ నుంచి ప్రబ్దయాన్, బుకర్ బహుమతి పొందిన గీతాంజలి శ్రీ నవలను ఇంగ్లీష్‌లోకి అనువాదం చేసిన డైసీ రాక్వెల్... ఈ జాబితా చాలా పెద్దది. ప్రపంచంలో 50 మంది గొప్ప అనువాదకులతో ముచ్చటించి అనువాద సంబంధమైన అంశాలను తెలుసుకోవాలని హర్షణీయం ప్రయత్నం బాగా చురుగ్గా సాగుతోంది. వాళ్లు అమెరికాకు చెందిన డాక్టర్ మైకేల్ కాట్జ్‌తో జరిపిన ముఖాముఖి ప్రపంచ సాహిత్యపు తీరును స్పష్టంగా వెల్లడిస్తోంది. ఆయన ఇటీవల దాస్తోవిస్కీ రచనల్ని మళ్ళీ అనువాదం చేస్తున్నారు. బ్రదర్స్ కరమ్ జోవ్ నవలకు ఆయన చేసిన అనువాదం మూడోది. మొదట్లో అనువాదం చేసిన కాన్‌స్టన్స్ గార్నెట్, తర్వాత అనువాదం చేసిన రిచర్డ్ ఫీవర్, లారిస్సాలు, దాస్తోవిస్కీ రచనల్లోని విషాద హాస్యాన్ని సరిగ్గా పట్టుకోలేకపోయారని అందువల్ల తాను మళ్ళీ కొత్తగా అనువదించక తప్పడం లేదని ప్రొఫెసర్ కట్జ్ అంటున్నారు.

ఈ సంభాషణలన్నీ ఇంగ్లీష్ లోనే జరుగుతున్నా, ఈ విషయాలు తెలుసుకోవలసిన ఆవశ్యకత తెలుగు సాహితీకారులందరికీ ఉంది. ఇటువంటి కార్యక్రమం ఒకటి ఇదివరకు ఎక్కాడ జరిగినట్టు లేదు. ప్రపంచంలో ఇంతమంది గొప్ప అనువాదకులు అంత క్రమశిక్షణతో సాధికారికంగా సమగ్రంగా అనువాదాలు చేస్తున్నారన్న విషయం ఎవరూ పట్టించుకోరు. అనువాదం అన్నది కృతజ్ఞతల కోసం ఎదురుచూడనివాళ్లు చేస్తున్న పనిగా మిగిలిపోయింది. అయితే అనువాదం అన్న ప్రక్రియ ఒకటి ఉండి ఉండకపోయి ఉండే ప్రపంచం ఇప్పుడున్నట్టుగా ఉండి ఉండదు. ఇన్ని వందల భాషలు ప్రపంచంలో అనువాదం అన్నది లేకపోతే వారధులు కట్టేవాళ్ళు ఉండరు. అనువాదుకులతో ఈ ముఖాముఖి కార్యక్రమాలు ముగిసాక వాటిని తెలుగులోకి అనువదించి అందుబాటులోకి తేవాలని హర్షణీయం అనుకొంటోంది.

హర్షణీయం అనే ముగ్గురు మిత్రులు హర్ష, గిరి, తెరవెనకే ఉండి ఉంటారు. మొదటి నుంచి ఈ సంభాషణ అంతా అనిల్ ఒక్కడే నడుపుతున్నారు. గడచిన మూడేళ్లలో దాదాపు 200కు పైగా సంభాషణా కార్యక్రమాలు నిర్వహించబడటమంటే సులభం కాదు. ప్రతి ముఖాముఖి ముందుగా అనిల్ గారు ఆయన రచయితల, అనువాదకుల రచనలను అవసరమైనంతగానైనా చదవాలి. వారిని సంప్రదించి వాళ్ళని ఒప్పించి ఇంటర్నెట్ ద్వారా ఫోన్లోనే మాట్లాడాలి. అదంతా రికార్డ్ చేసి అవసరమైనంతగా ఎడిట్ చేసి ఆ తర్వాత దాని ఇన్స్టాగ్రాం ద్వారా శ్రోతలకు అందించాలి. ఇప్పుడుస్పొంటిఫై, గూగుల్, పాడ్‌కాస్టులు ద్వారా కూడా ఈ సంభాషణలు అందుబాటులో ఉన్నాయి. ఇటీవల కాలంలో ఇంత సజావుగా బాధ్యతాయుతంగా ఇంత బాగా జరిగిన సాహిత్య కార్యక్రమం తెలుగులో లేదు.

'హర్షణీయం' ఇప్పుడు చాలామందికి స్ఫూర్తిదాయకం కావాలి. ఇటువంటి సాహిత్య కార్యక్రమాలు ఇంకా చాలా జరగవలసిన అవసరం ఉంది. సాహిత్య అభిలాష ఉన్నవాళ్ళందరూ ఈ సంభాషణల్ని విని తమ మార్గాల్ని సరి చేసుకోవాలి.

తెలుగు సాహిత్యలోకం హర్షణీయం మిత్రులు ముగ్గురికీ శుభాకాంక్షలూ అభినందనలూ చెప్పవలసి ఉంది. (హర్షణీయం సంభాషణల్ని harshaneeyam.in లో వినవచ్చు)

"మాతృభాష ఆ భాషీయుడి సంప్రదాయ, సంస్కార మూలాల్ని నిత్యం తడుపుతూ, శుభ్రపరుస్తూ, నవనవోన్మేషంగా పల్లవింపజేసే ఆంతఃస్రోతస్విని. ఆది జలజలా నిత్యం పారుతుండకపోతే ఆ భాషీయుడి జీవనం శుష్కించిపోవటమే కాదు, ఏ చిన్న జీవన విషాదానికైనా గజగజ వణికి కుప్పకూలుతుంది. అట్లాంటి అంతశ్శక్తినిచ్చే సహజ పౌష్టికాహారం తల్లిభాష!"

–సి. ధర్మారావు

పి. శివరామకృష్ణ'శక్తి'
94414 27977

# శంకరన్ తరం తరువాత -3



కన్నబిరాన్ '24 గంటలు'లో తను వాదించిన ఒకో కేసులో మలుపులు, కేసువిన్న న్యాయమూర్తులు, పౌరహక్కుల ఉద్యమంలో ఒడి దుడుకులు వివరించారు. అధికారులుగా శంకరన్ వగైరాలు అమలు చేసిన ఎన్నో కార్యక్రమాలు కూడా అనేక మలుపులు తీసుకున్నాయి. ఒక పక్క వామపక్షాల పట్టు సడలి పోతుంటే, ఇదే సమయంలో గ్రామస్థాయిలో భూమి అడవి, నీరు, కూలి రికార్డులను, లెక్కలను అర్థం చేసుకుని అధికారులచేత పనిచేయించుకునే, నిలదీసే నైపుణ్యం, జనం లో పెంచుతూ అవసరమైనపుడు కోర్టుకు వెళ్లి ఉద్యమించే స్వచ్ఛంద సంస్థలుకూడా ఎదగ సాగాయి. ఈ పోకడలమీద 24 గంటలులో వంటి వ్యాఖ్యానం అవసరం.

కమ్యూనిస్టు ప్రాబల్యంలోగల ఖమ్మం జిల్లా పరిషత్, చిన్న గిరిజనేతర రైతులను 1/70 రేగ్యులేషన్ నుండి తప్పించాలని తీర్మానం చేసింది. ఆ మేరకు ముఖ్యమంత్రి చెన్నారెడ్డి జివో నెంబరు 127 జారీచేసారు. ప్రభుత్వ కార్యదర్శి యుగంధర్ వగైరాలు ఈ జివో 1/70 ను నిర్వీర్యం చేస్తుందని భావించి, కన్నబిరాన్‌ను కదిలించారు. ఆయన హై కోర్రుకెక్కి జీవో కొట్టేయించారు.

పశ్చిమ గోదావరి గిరిజన భూపోరాటంలో ప్రధానమైన కోర్టు కేసులో 92 లో దూరి( ఇంప్లీడ్), శక్తి ఈ ఉద్యమాన్ని ముందుకు తీసుకు పోతుంది, చివరలో, ఈ ఉద్యమంలో చేరిన నాటి పాలక వర్గానికి మిత్ర పక్షం మార్క్సిస్టు పార్టీ తరపున కన్నబిరాన్, అవేర్ తరపున మాధవన్ విచారణ ముగిసి తీర్పు వెలువరించనున్న తరుణంలో ఇంప్లీడ్ అయినారు. ఈ కేసులో గల 32 స్టేలను తొలగిస్తూ, గిరిజనేతరులు గవర్నర్ ఒక పిటిషన్ ఇచ్చారని, అది తేలేదాకా వారిని భూమినుండి తొలగించరాదని న్యాయమూర్తి శుభాషణ్ రెడ్డి తీర్పు ఇచ్చారు. కాని తరువాత, వాళ్ళు ఈ కేసు పట్టించుకోలేదు. తమకిచ్చిన వెసులుబాటు చూసుకుని గిరిజనేతరులు స్టేల మీద స్టేలు నిరవధికంగా తెచ్చుకొని భూములు కాపాడుకుంటూ వచ్చారు. ఇది అత్యాచారం కిందికి వస్తుందని శ్రీ రామలింగేశ్వరావు కేసు వేశారు. స్టేలన్నీ పక్కనపెట్టి భూముల అప్పగింత త్వరిత గతిన చేపట్టవలసిందిగా హైకోర్టు ఉత్తరువు లిచ్చింది.

ఇది ఇలావుండగా, సిరిల్ రెడ్డి, తారకం, కోదండరామిరెడ్డి వగైరాలతో నిజనిర్ధారణ బృందం, పశ్చిమ గోదావరి పర్యటించి, మార్క్సిస్టు పార్టీ పాత్రను విమర్శిస్తూ ఒక నివేదిక ఇచ్చింది. దాన్ని 'చూపు' పత్రికలో కాత్యాయని ప్రచురించారు. తరువాత సంచికలో బాలగోపాల్, 1/70 అమలు మీద ఈ స్థాయిలో పోరాటం ఇంతవరకు జరగలేదని ప్రశంసిస్తూనే, మార్క్సిస్టు పార్టీకూడా 1/70 ని సమర్ధించిన విషయం గుర్తుచేసారు ఆయన. అంతకు ముందు చట్టబద్ధంగా పనిచేస్తున్న శక్తిని, నక్సలైట్ ఉద్యమంతో పోల్చి అపోహ పడవద్దు. ఈ ఉద్యమం పట్ల కఠిన వైఖరి తగ్గించుకోవలసిందిగా ప్రభుత్వానికి హితవు చెప్పి ఉన్నారు. కాని తరువాత గిరిజనులలో మార్క్సిస్టు పార్టీ కొమ్ముగాస్తున్న ఒక వర్గం తరపున వకాలత తీసుకుని గిరిజనుల మధ్య తగవుకు ఆజ్యం పోసారు. ఇదేసమయంలో పక్కనే ఖమ్మంలో శక్తి అనుమతితో, ఆ పేరుపెట్టుకుని గిరిజనులు ఉద్యమించసాగారు.

రాష్ట్ర వ్యాప్తంగా అటవీ అభివృద్ధి కార్పొరేషన్ 5000ఎకరాలలో జీడి మామిడితోటలు పెంచి, పంట వేలం వేస్తున్నది. ఈ తోటలు ఆక్రమించుకోవలసినదిగా వామపక్షాలు, నక్సలైట్లు పిలుపునిస్తున్నారు. 1992లో నక్సలైట్లు కల్పించుకుంటున్న సమస్యలలో ఒకటిగా ప్రభుత్వం దీన్ని గుర్తిస్తూ షెడ్యూల్ జాతుల తెగల కార్పొరేషన్‌లు ఈ వేలంలో పాల్గొని జీడిపిక్కలు సేకరించేపని కూలిజనానికి అప్పగించాలని నిర్ణయించాయి. కాని కదలికలేదు. ఖమ్మంజిల్లా గిరిజన ప్రాంతం అశ్వారావు పేట మండలం నారంవారి గూడెంలో 1600 ఎకరాలలో ఈ తోటలున్నాయి.

ఇంతలో శక్తి వేసిన కేసులో తూర్పు గోదావరి మారేడిమిల్లిలో లాటరైట్ ఖనిజం తవ్వకాలను రద్దు చేస్తూ, గిరిజన ప్రాంతంలో గిరిజనులకు, వారి సహకార సంఘాలకు తప్ప, ప్రభుత్వ భూములలో ఉండే హక్కు వేరెవరికి లేదని తీర్పు చెప్పింది. ఈ తీర్పును ఉదహరిస్తూ (w.p 3734/93) నాటి గిరిజన సంక్షేమ కమీషనర్, నారంవారి గూడెంలో తోటలను గిరిజనులకు అప్ప గించ వలసినదిగా కలెక్టరుకు రాశారు. కదలికలేదు. శక్తి కేసులో తీర్పు రానున్న రానున్న తరుణంలో, వేరొక స్వచ్ఛంద సంస్థ సమత విశాఖ మన్యంలో గనుల మీద వేసిన కేసులో, ప్రభుత్వ ఖనిజాభివృద్ధి సంస్థకు భూములు ఇవ్వవచ్చునని ఉన్న ఒక జీవోను మరొక ధర్మాసనం సమర్ధించింది. దీనిమీద సమత సుప్రీం కోర్టుకు వెళ్ళినా, హైకోర్టు తీర్పునే అక్కడ ఖాయం చేసారు. శక్తి హైకోర్టు కేసును ఉదాహరిస్తూ పైన పేర్కొన్నట్లు ప్రభుత్వ కార్పొరేషన్ నుండి తోటలు లాక్కోమని ఆదేశించిన గిరిజన సంక్షేమ శాఖ, సుప్రీం కోర్టులో సమాధానం దాఖలు చేయలేదు. ఈ హైకోర్టు, సుప్రీం కోర్టుల తీర్పు, కన్నబిరాన్, జీవో 127 పైన తెచ్చిన తీర్పుకు విరుద్ధం. అదే విషయంలో మంచి తీర్పు వచ్చింది. 'ఇక ఆ తీర్పును ఎలా అమలు పెత్తించాలో మార్గాలు వెతకాలి గాని మళ్ళీ అదే విషయం మీద అటువంటి తీర్పునే ఆశిస్తూ న్యాయస్థానానికి వెళ్ళ నక్కర లేదు'

అని మరో సందర్భంలో కన్నబిరాన్ వ్యాఖ్యానిస్తారు. (24గంటలు. పుట 104). కాని 1/70 కి గండికొట్టిన ఈ తీర్పును బి.డి.శర్మ, బాలగోపాల్ మెచ్చుకోసాగారు.

ఈ సమయంలో ఖమ్మం జిల్లాలో అశ్వారావు పేట దమ్మపేట మండలాల్లో గిరిజనుల భూపోరాటం తారాస్థాయికి చేరింది. ఈ తీర్పులో తిరకాసు తెలియక పోయినా, కోర్టు, ప్రభుత్వం కలిసి ఆడిన తొండిఆటవల్ల, తోటలు తమకు దక్కకుండా పోయాయని వారికి అర్థమైంది. వారు తోటలను ఆక్రమించి జీడి గింజలు కోసుకోసాగారు. సమస్య తీవ్రత గుర్తించిన నాటి ముఖ్యమంత్రి కల్పించుకుని 800 మంది గిరిజన మహిళలకు రెండెకరాల చొప్పున పంచిపెట్టారు. మిగతా చోట్ల అటువంటి ప్రయత్నమేదీ జరగలేదు. ఈ వార్తలను The Hindu ప్రముఖంగా ప్రచురించేది.

గిరిజన ప్రాంతాలకు తగినట్లు పంచాయత్ రాజ్ చట్టాన్ని సవరించకుండా ఎన్నికలు ప్రకటించటం సవాలు చేస్తూ కన్నబిరాన్ 97లో స్టే తెచ్చారు.

రాజశేఖరరెడ్డి ప్రభుత్వంలో ఆయన ప్రత్యేక కార్యదర్శి పి. సుబ్రహ్మణ్యం ఉట్నురులో గిరిజనాభివృద్ధిసంస్థ ప్రాజెక్ట్ అధికారిగా, ఏజెన్సీ భూముల సర్వేకు స్పెషల్ ఆఫీసర్గా కూడా పనిచేసారు. పశ్చిమ గోదావరి భూపోరాటంలో సర్వే సక్రమంగా జరగలేదని, ఆ లోపాలు సరిదిద్దుతామని ముఖ్యమంత్రి కార్యాలయం పత్రికా ప్రకటన చేసింది. ముఖ్యమంత్రి అధ్యక్షత వహించిన గిరిజన సలహా మండలి సమావేశం ప్రతిభా పాటశాలలో తెగలను మూడు వర్గాలుగా చేసి, వర్గాల వారీగా సీట్లలో కోటాను నిర్ణయించారు. కాని ఈ వర్గీకరణనూ కోర్టు కొట్టేసింది. .

గుర్తేడులో శంకరన్ వగైరా అధికారులు బందీ అయినపుడు వార్తలకు గిరాకి పెరిగింది. ఆంధ్రప్రభ విజయవాడనుండి విలేఖరి కే యస్ రావును రాజమండ్రికి బదిలీ చేసింది. ఆయనకు శక్తి పంపిన వందలాది వార్తలను, వ్యాఖ్యలను ఎడిట్ పేజిలో, ఒకోసారి పూర్తి పేజీగా, ఆయన భువనేశ్వర్ బదిలీ అయ్యేదాకా (95) ప్రచురించింది.

93 లో అటవీ సంరక్షణ చట్టానికి గిరిజన సమస్యలన్నిటి పరిష్కారానిక్ బీ.డి.శర్మ తయారు చేసిన ఆరు మార్గదర్శక సూత్రాల బదులు జాయింట్ ఫారెస్ట్ మేనేజ్మెంట్ ( జే. యఫ్.యం) ప్రపంచ బ్యాంకు నిధులతో అమలు చేయటానికి పూనుకున్నప్పుడు, ఈ మాత్రం అన్నా అవకాశం వచ్చినందుకు నందిని సుందర్ లాంటి మేధావులు,మహారాష్ట్ర లో మోహన్ లాల్ హిరాభాయి వంటి కార్యకర్తలు సంతోషించారు) జే. యఫ్.యం కు రూల్స్ తయారు చేసే కమిటిలో శక్తి కూడా ఒకటి.

ఆ సమయంలో శక్తి రంపచోడవరంలో ఏర్పాటు చేసిన రెండు రోజుల సమావేశానికి నాటి అటవీ శాఖ కార్యదర్శి స్మరజిత్ రే, స్వచ్ఛంద సంస్థలు వచ్చారు. శక్తి అప్పటికే అటవీశాఖ మీద మూడు కేసులు గెలిచింది. క్షేత్ర స్థాయి సమస్యలమీద పట్టుబిగుస్తుంది. కనీస వేతనాలు అమలు చేయనందుకు అటవీ శాఖ, మీద కేసు వేసి, మేస్త్రీలు కూలీ బకాయితో సహా రాబట్టుకున్నారు. ఆరు సూత్రాలలో ఒకటి, అటవీ శాఖ కూలి రేట్లు నిర్ణయించే కమిటీలో గిరిజన సంక్షేమ శాఖ ప్రతినిధి ఉండాలి అని ఆదేశిస్తుంది. అంతేకాదు గిరిజనాభివృద్ధి సంస్థలు చేయించే పనులలో కూడా కనీస వేతనాలు అమలు చేయకుండా, రైతుకూలి సంఘాలతో ఒప్పందం చేసుకుని కాంట్రాక్టర్లు ఇచ్చే తక్కువ వేతనాలనే ఇస్తున్నందుకు శక్తి ఆందోళన చేసింది.కార్మిక శాఖ కోర్టులో కేసు వేయించి ఆ సంస్థచేత బకాయిలతో సహా ఇప్పించింది. ఈ పరిస్థితులను వివరిస్తూ , అన్ని సూత్రాలు అమలు చేయవలసిందిగా కోరాము. ప్రభుత్వం జే యఫ్ యం ఒకటే తీసుకున్నందువల్ల ఈ కార్యక్రమంలో శక్తి పాల్గొనలేదు.

గిరిజన ప్రాంతం చెరువులలో మత్స్యకార సంఘాలను చేపలు పట్టుకునేందుకు అనుమంతించ వలసిందిగా నాటి మత్స్య శాఖ మంత్రి ఉత్తరం రాసారు. ఆ మేరకు వారిసంఘాలను అనుమతించిన మహబూబ్ నగర్ జిల్లా బల్మూరు, లింగాల మండలం కొండనాగులలో ఋషుల చెరువులో సంఘాన్ని తొలగించి చెరువు చెంచులకు దక్కేలా శక్తి న్యాయ సహాయం చేసింది.

శంకరన్ గారి నాయకత్వంలో ప్రభుత్వం మావోయిస్టు లతో చర్చలకు తయారు అయిన నాటికి ప్రభుత్వం లో నలుగుతున్న సమస్యలు ఇలా చాలా ఉన్నాయి. **(ఇంకా ఉంది).**





**కలంయోధుడు కోటంరాజు రామారావు**
**రచన:డా.సి.భవానీదేవి**
**వెల:రూ.100/-**
**ప్రతులకు:**
**ఎమెస్కో బుక్స్ ప్రై.లి.**
**1-2-7, భానూ కాలనీ,**
**గగన్‌మహల్ రోడ్, దోమలగూడా**
**హైదరాబాద్-500029**

ప్రముఖ తెలుగు పాత్రికేయుడు కోటంరాజు రామారావు పుట్టిన 125 సంవత్సరాల తర్వాత ఆయన రేఖామాత్ర జీవిత చరిత్ర తెలుగులో బయటకు వచ్చింది. ఆయనతో బంధుత్వం ఉన్న ప్రముఖ రచయిత్రి డాక్టర్ సి.భవానీ దేవి, ఆయన రాసిన ఆంగ్ల జీవిత చరిత్ర 'పెన్ ఈజ్ మై స్వోర్డ్' అన్న గ్రంథం ఆధారంగా ఈ పుస్తకం రచించారు. ఆయన గురించిన 60 పేజీల జీవిత చిత్రము మరి రెండు వ్యాసాలు కలిపిన 125 పేజీల చిరు గ్రంథాన్ని ఎమెస్కో వారు ప్రచురించారు. పొత్తూరి వెంకటేశ్వరరావు గారు ముందుమాట వ్రాయగా, రామారావు గారి కుమారుడు శ్రీ కె.ఎన్. రావు కుమార్తె విక్రమ రావు వారి జ్ఞాపకాలను జతచేశారు. శ్రీ కె. ఎన్. రావు ఆడిట్ సంస్థలో దేశంలో అత్యున్నత పదవి అలంకరించడమే కాక, ఆధునిక జ్యోతిష శాస్త్ర ఔత్సాహికులకు వారు పితామహులుగా గుర్తించబడతారు. వారి నాన్నగారి గురించి జ్ఞప్తికి తెచుకుంటూ ఇలా అంటారు:

నాన్నగారు ఎప్పుడూ వ్యాసాలూ సంపాదకీయాలూ డిక్టేట్ చేయటం అనే అతి సాధారణ కార్యం వల్ల ఏ విధమైన తయారీ లేకుండానే ఉపన్యాసాలు ఇచ్చేవారు. జీవిత పర్యంతం తెలుగు కవిత్వం వల్లెవేయటం అనే అలవాటు వల్ల వారి అద్భుతమైన కంఠంలో హెచ్చుతగ్గుల వాచికం అలవాటయింది. సంవత్సరానికి 300 పుస్తకాలను బాగా చదివేవారు. తాను సాధికారికత పొందిన అంశాల గురించి మాట్లాడటానికి ఎప్పుడూ సిద్ధంగా ఉండేవారు. అధికార కాంగ్రెస్ నాయకులు పార్లమెంట్లో అన్ని ముఖ్య సందర్భాలలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే అంశానికి నాన్నగారిని ఎంపిక చేయటంలో ఆశ్చర్యం లేదు. వారి సంస్కృతి వాక్యాలు చాలా హృద్యంగా ఉండే గ్రంథానికి వన్నెతెచ్చాయి. వారు కూడా సహరచయితగా ఉంటే గ్రంథం ఇంకా మనోరంజకంగా ఉండేదనుకుంటా.

ఇక రచయిత్రి కథనం గురించి చెప్పనక్కర్లేదు. చేయి తిరిగిన రచయిత్రి కాబట్టి భాష, శైలి చదువరులను ఆకట్టుకునేటట్టు ఉన్నాయి. కాకపోతే విశాలమైన జీవితాన్ని 60 పేజీల్లో కుదించాల్సివచ్చినప్పుడు, ఉన్న ఇబ్బంది స్పష్టంగా కనబడుతుంది. చదివేటప్పుడు ఒక సినిమా వేగంగా జరుగుతున్నట్లు కనబడుతుంది. రామారావు గారి జీవితకాలం ఎక్కువగా స్వాతంత్ర్యానికి పూర్వం కాబట్టి, వారు వృత్తిరీత్యా పాత్రికేయులు కాబట్టి, ఆనాటి సంఘటనలు చరిత్రలో పరిచయం ఉన్నవారికి స్మృతి పథంలో మెదులుతుంటాయి. ఆనాటి నాయకుల విన్యాసాలకూ సంఘటనలకూ ఆయన ప్రత్యక్ష సాక్షి. పుస్తకం చదువుతున్నప్పుడు తిరుమల రామచంద్ర గారి జీవితం అప్పుడప్పుడు గుర్తుకు వస్తుంది.

నేషనల్ హెరాల్డ్ తొలి సంపాదకులుగా ఉండటం వారిని చిరస్మరణీయులను చేసింది. నేషనల్ హెరాల్డ్ ఒడిదుడుకులను రచయిత్రి చక్కగా గ్రంథస్తం చేశారు. ఆ పత్రిక కష్టాలు ఈనాటికీ కూడా తీరలేదు. రాజ్యాంగ సభ సభ్యులుగా, రాజ్యసభ సభ్యులుగా ఉండటమే కాకుండా అంబేద్కరుకు దీటుగా ఉపన్యాసకునిగా రాణించడం తెలుగువాళ్ళు గర్వించాలి. బౌద్ధ మతాన్ని ప్రేమించే వ్యక్తిగా ప్రకటించుకోవడం గొప్ప విషయం. ఈ చిన్ని పుస్తకంలో వారి గురించి అనేక విషయాలు తెలియడమే కాకుండా, భవిష్యత్‌లో పరిశోధన చేసేవారికి ప్రాథమిక సమాచారంగా పనిచేస్తుంది.

ఆయన జీవితం చదివిన తర్వాత రావాల్సినంత గుర్తింపు రాలేదనిపిస్తుంది. కారణాలు అనేకం ఉండొచ్చు. పుస్తకంలో ప్రచురించిన చిత్రాల నాణ్యత పెంచి ఉంటే, గ్రంథం ఇంకా అందరంగా ఉండేది. ఒక గొప్ప తెలుగు వ్యక్తిని తెలుసుకోవడానికి 100 రూపాయిలు ఏమీ ఎక్కువ కాదు. ----- 'ఆరా'

# తాత్విక విమర్శక రచయిత

**8 పుట తరువాయి........**

**సూచనలు చేయడం. ఇది వారి పర్యవేక్షక పద్ధతి. తన విద్యార్థి కదా అని అంతా తనేచెప్పి విద్యార్థి మీద నిర్హేతుక కృప చూపరు. నీ చావు నువ్వు చావు అని విద్యార్థిని గాలికి వదిలేయరు. చేయి పట్టుకొని నడిపిస్తారు, వీపు మీద మోయరు.**

ఒక విశ్వవిద్యాలయ అధ్యాపకుని నుండి సమాజం ఎంత ప్రతిఫలం అశిస్తుందో,తుమ్మపూడివారు అంతకన్నా ఎక్కువ ప్రతిఫలం సమాజానికి ఇచ్చారు ఆయన. సమాజం రుణం తీర్చి కన్నుమూశారు. 1956 నుండి అంటే తన 22వఏట నుంచి కన్నుమూసేదాకా 67ఏళ్ళూ ఆయన ఎడగాలవ పదని కాలవలాగా సాహిత్య కృషి చేస్తూనే ఉన్నారు. ఆయన అవిశ్రాంత సాహిత్య కృషీవలుడు. ఒక రకంగా అరేబియన్ హార్స్ వంటి సాహితీపరుడు.

తుమ్మపూడివారి శ్రీమతి శాంతకుమారి మూడు ఏళ్ళ క్రితం కన్నుమూశారు. ఈ దంపతులకు ఐదుగురు సంతానం. ఒక కుమారుడు కన్నుమూశారు. ఇద్దరు కుమార్తెలూ, ఇద్దరు కుమారులూ ఉన్నారు.ఆయనది సంపూర్ణ విద్య, సంపూర్ణ కుటుంబం, సంపూర్ణ జీవితం. ఆయన జీవితం ఒడిదుడుకులకులోనైంది.గుండె నిబ్బరంతో ఎదుర్కొన్న స్థితప్రజ్ఞులు. తుమ్మపూడివారి మరణంతో తెలుగులో తాత్వికస్థాయి విమర్శకుల లోటు ఏర్పడింది.

**అన్ని విద్యాదశల్లోనూ మాతృభాషే బోధనాభాషగా ఉండాలి-కొఠారి కమీషన్**

జి.వి.పూర్ణచందు
9440172642

# ఆర్బత్తుల న్యాయం

"ఉద్యోగములు చేసి యూళ్ల నెల్లను దోఁచి/యార్జించినట్టి ద్రవ్యంబు
కొంతభూములన్నిటి నమ్మి పొలంతుల నగలమ్మి/సమకూర్చినట్టి విత్తమది
కొంతవ్యవసాయములు చేసి వర్తకమ్ములొనర్చి/గైకొన్నయట్టి రొక్కమ్ము కొంత
పిల్లి కైనను భిక్షపెట్ట కార్జించిన/వసుమతీశ్వరుల ద్రవ్యంబు కొంత
దేశ దేశమ్ములకుఁ బోయి తిరిపమెత్తి/యార్జనము చేసికొన్న ద్రవ్యంబు కొంత
'అరబతు నాటు' హరియించె నౌర!/వీరి క్షౌరమున కీడు వచ్చెడు క్షౌరమున్నె....." తిరుపతి వెంకట కవులు ఒక అవధానంలో ఆర్బతునాటు అనే మోసగాడి గురించి ఈ పద్యం చెప్పారు: ప్రభుత్వోద్యోగాలు ఊరందర్నీ దోచి తెచ్చిన డబ్బుని కొందరు, భూము లమ్మిన డబ్బుని మరికొందరు, పండిన పంటమీద రాబడిని ఇంకొందరు, చిన్నచిన్న వ్యాపారాలు చేసి సంపాదించింది వాడికే ధారపోశా రంతా! పిల్లిక్కూడా భిక్ష పెట్టకుండా జమీందార్లు సంపాదించిన సొమ్ముని, ఊళ్ళు తిరిగి తిరిపం ఎత్తి తెచ్చిన డబ్బుని కూడా ఈ ఆరుబత్తు నాటుగాడు అమాంతం హరించాడు. వాడి క్షౌరానికి సాటిరాగల క్షౌరం ఉన్నదా?" అని!

మృచ్ఛకటికం నాటకంలో శర్విలకుడనే దొంగ తను ఏ ఇంటికైనా కన్నం వేస్తే డబ్బుపోయిన దుఃఖంలో ఉన్నా ఆ ఇంట్లో వాళ్లు కన్నం వేయగలిగిన తన చాతుర్యాన్ని మెచ్చుకు తీరతారంటాడు. 1902లో 'విటకర్ రైట్' అనే లూలామాలంకరుడి అంటే పచ్చిమోసగాడి ఆర్థిక మాయలు ఒక్క టొక్కటే వెలుగులోకి వచ్చి లండన్ నగరం కూడా ఇలాగే అయ్యో అనుకుంటునే అహో అని ఆశ్చర్యపోయింది. డా.కట్టమంచి రామలింగారెడ్డిగారు 'భారత అర్థశాస్త్రము' అనే గ్రంథంలో 20వ శతాబ్దపు ఈ తొలి అర్థికనేరం గురించి విపులంగా వ్రాశారు. విటకర్ రైట్ మొదట ఓహరిసాహరిగా అనేక వ్యాపార సంస్థల్ని ప్రారంభించాడు. తను కొంత నష్టపడ్డా జనానికి లాభం చూపించాడు. ఈ కంపెనీల్లో సొమ్ముతో కొత్త కంపెనీలు పెట్టాడు. ఆ కొత్త కంపెనీల్లో వచ్చిన డబ్బుని నష్టంలో ఉన్న పాతకంపెనీలకు అప్పిచ్చినట్టు నటించాడు. ఈ కంపెనీలన్నీ వేర్వేరు పేర్లతో వేర్వేరు భాగస్వాములతో ఉండటంతో అన్నింటికీ నాథుడు వీడేనని ఎవరూ గుర్తించలేదు. తన దగ్గర తానే అప్పు చేస్తూ ఒక మహాభవంతి నిర్మించాడు. ఇంగ్లండు రాజుగారిని భోజనానికి పిలిచి గౌరవించాడు. ఇండియాకి వైస్రాయి-గవర్నర్ జెనరల్ గా పనిచేసిన లార్డ్ డఫ్రిన్ గారిని ఈ సంస్థకు అధ్యక్షుడిగా నియమించాడు. మొత్తం అందరూ తన బుట్టలో పడ్డాక కోట్లాది సొమ్ము మూటకట్టుకుని రాత్రికి రాత్రే బోర్డు తిప్పేశాడు. మోసపూరితంగా తనని ఇందులో ఇరికించటంతో డఫ్రిన్ దొరగారు తన పరువు పోయిందని, మనోవేదనతో మరణించాడు. లండన్ ప్రభుత్వం విటకర్ రైట్'ని ఉపేక్షించింది. కానీ, కడుపుమంట మీద ఉన్న ప్రజలు కేసు తిరగదోడారు. చివరికి ఆ మాయావికి ఐదేళ్ల జైలు పడింది. విషం తాగి ఆత్మహత్య చేసుకుని ఆ శిక్షను కూడా తప్పించుకున్నాడు!

లండన్ లో ఈ విటకర్ రైట్ నేరాలకు వారసుడే ఇండియాలో 'ఆర్బత్ నాట్'! 1906లో యావత్ తెలుగు ప్రజలకు తిరుక్షౌరం చేసి, బోర్డు ఎత్తేసిన ఖలుడు. ఈ ఇద్దరి ఆర్థికనేరాలకూ చాలా పోలికలున్నాయి. రెండు దేశాల్లోనూ సామాన్య ప్రజలు ఈ ఇద్దరు మాయావుల వలన సమస్తం కోల్పోయి ముష్టివాళ్లయ్యారు. ఆర్బతునాట్ గురించి, 20వ శతాబ్ది తొలిపాదంలో చాలా కథలు, నవలలు వచ్చాయి. తాడూ బొంగరం లేని కంపెనీల్ని, దివాలాకోరు, దగాకోరు ముఠాల్ని ఆర్బత్తుల కంపెనీ అనటం తెలుగువాళ్లకు అలవాటయ్యింది. ఆరుబత్తుల క్షౌరం నిలువు దోపిడీకి పర్యాయ పదం. ఎగుమతి దిగుమతులు, కాఫీ, నీలిమందు తోటలు ఇలా అనేక రంగాల్లో ఉన్న ఈ కంపెనీ మనకళ్ల ముందే ఉందికదా... డబ్బు ఎక్కడికీ పోదనుకున్నారంతా! డబ్బు మూటలు తెచ్చి దేవుడి హుండీలో వేసినట్టు వేశారు. పైన చిల్లులోంచి డబ్బులు వేశారు కానీ కింద ఎంతపెద్ద గొయ్యి ఉందోచూళ్లేదు. దేవుడికి కొబ్బరికాయ కొడితే సగం చిప్ప ప్రసాదంగా ఇస్తారు. ఆర్బతునాటు దేవుడు ప్రసాదం కూడా ఇవ్వ లేదు" అని వాపోయాడో బాధితుడు.

18వ శతాబ్దిలో తెలుగు చేనేత కార్మికులకు కోట్లాది సొమ్ము బకాయి పెట్టి ఈస్టిండియా కంపెనీ బోర్డు తిప్పేసింది. ది న్యూ ఈస్టిండియా కంపెనీ పేరున కొత్త కంపెనీ పెట్టి, బందరు నుంచి మద్రాసుకి మకాం ఎత్తేశారు బ్రిటిషర్లు. నీలిచెట్ల నుండి నీలిమందు తయారీ విషయంలోనూ ఇదే జరిగింది. ఇంటింటా తొట్టెలు పెట్టి ఎంతో గొప్పగా నీలిమందు ఉత్పత్తి చేశారు తెలుగు ప్రజలు. అంతలో లండన్లో పాదరసంతో తయారయ్యే కృత్రిమ నీలిమందు రావటంతో తెలుగువాళ్లు నిండా మునిగిపోయారు.

10-4-1986 ఆంధ్రపత్రికలో తెలుగుదేశం ప్రభుత్వం తెలుగువల్లభుడి పేరున ఉన్న శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయాన్ని ఆదుకోవాలనంటూ ఒక వార్తాకథానం వ్రాసింది. ఆరంభదశలో ఈ భాషానిలయం ఎదుర్కొన్న బాలారిష్టాల్ని వివరిస్తూ, "నిలయం వారు డబ్బు దాచిన ఆర్బతునాట్ కంపెనీ 1906లో దివాలాతీస్తే మూలధనం 826 రూపాయల 10 అణాల 6 పైసలు కోల్పోయింది" అని పేర్కొంది.

మద్రాసు గవర్నరుగా ఉండి జమీందారుల్ని చాలా

ప్రోత్సహించిన ఆంఫీతిల్ దొరగారి స్మారక చిహ్నం కట్టించాలని అప్పట్లో జమీందార్లు చందాలు పోగేసి ఆ డబ్బుని ఈ అర్బత్ నాట్ కంపెనీలో వేశారు. ఆ కంపెనీ రాత్రికి రాత్రే జమీందారులందర్నీ ముంచేసిందని ఆంధ్రపత్రిక 1925 ఆగష్టు 19 సంచికలో వ్రాసింది. బొబ్బిలి జమీందారు 14 నీలిమందు ఫ్యాక్టరీల్ని ఈ కంపెనీకి కౌలుకిచ్చాడు. అన్నీ కృష్ణార్పణం అయ్యాయి. ఇంచుమించుగా జమీందార్లందరూ ఈ 'నాటు'దెబ్బ తగిలిన వారే! కాకపోతే సామాన్యుడు బిగ్గరగా ఏడ్చాడంతే!

“అర్బతునాట్ కంపెనీ దివాలా సందర్భమున కంపెనీ ఋణదాతలకు రూపాయ కొక దమ్మిడీని కడపటి డివిడెండుగ నొసగునటుల ఉత్తరువు గావింపబడెను” అని 19-10-1932 ఆంధ్రపత్రికలో చిన్నవార్త ప్రచురితం అయ్యింది. సంఘటన జరిగిన పాతిక యేళ్ళ తరువాత ప్రభుత్వం వారు సామాన్యుడికి విదిల్చిన ముష్టి ఇది. అగ్రిగోల్డు బాధితులకు ఈ ముష్టికూడ అందడం లేదు కదా!

మూడు నెలలాగితే మూడోవంతు రేటుకే సోఫాలు, బీరువాలూ ఇస్తానంటూ 1984లో విజయవాడలో సప్తగిరి కంపెనీ వేసిన టోకరాకు బలికాని వాడే లేడనుకున్నారా రోజున! ప్రైవేట్ చిట్‌ఫండ్ల కంపెనీల్ని, చీటీల వ్యాపారుల్ని నమ్మి కష్టార్జితం అర్పించుకోవటానికి అధిక వడ్డీమీద ఆశ ప్రధానకారణం. ఇలాంటి ఆర్థికనేరగాళ్లని ఆర్బుత్తుల కంపెనీ అని పిలిచేవాళ్లు ఒకప్పుడు. మిత్రుడనో బంధువనో మొహమాటానికి అప్పు కాయితాల మీద హామీ సంతకాలు పెడితే 'ఆర్బుత్తుల న్యాయం' అమలవుతుంది. మనం అన్యాయమై పోతాం! 'నమ్మినవాణ్ణే మోసం చేయా'లని 'ఆర్బుత్తుల న్యాయం' చెప్తుంది. అ

**కవిత**

# పోస్టు మ్యాన్'

పోస్టు మ్యాన్
ఇప్పటికీ వస్తూనే వున్నాడు
ఆ రోజుల్లో నడిచి వచ్చేవాడు
కొంతకాలం సైకిలు
ఇవాళ స్కూటరు.

ఏమైనా
పోస్టు మ్యాన్ వన్నె తరగలేదు
ఇప్పటికీ అతడు గ్లామర్ పురుషుడే
రొమాంటిక్ హీరోనే
నా దృష్టిలో
అతని చుట్టూ అల్లుకున్న వరేణ్యం
అంతరించేది కాదు.

బాల్యంలో
మనియార్డర్ ఇచ్చేటప్పుడు
ఎక్కడ నలిగి పోతాయోనని
అతడు నోట్లు లెక్కపెట్టే తీరు
మరపుకొచ్చేది కాదు.

యవ్వనంలో
నాకు వచ్చిన ప్రేమలేఖలూ
నా కవితలు అచ్చయిన పత్రికలూ
అతని చేతి మీదుగానే ఎగిరొచ్చేవి

నా తొలి ఉద్యోగ నియామకపు
టుత్తర్వు లేఖ
అతడు ఊరించి ఇచ్చిన రోజు
నోటి నిండా స్వీటు కుక్కిన
ఆనందం.

ఎన్ని ఆన్‌లైన్‌లు వచ్చినా
అవతలి వారి
ఊపిరిని నింపుకున్న లిఫాపలు
మరింత ప్రకాశమైన కనుపాపలు.

మన చేతిలో వున్న కాగితానికి
వారి స్పర్శ వుందన్న ఊహే
ఒక పులకరింపు.
రాసినప్పుడు అక్షరాల కంటిన
అనుభూతి
గుండె చుట్టూ పేరుకున్న పరిమళ గీతి.

పదమూడేళ్ల కుర్ర కవికి
సినారె రాసిన ఉత్తరాలు
నేటికీ నా వద్ద భద్రంగానే వున్నాయి
జ్వాలల్లా ఎగిసే ఆయన అక్షరాలు
జ్ఞాపకాలకు రంగులు పూస్తాయి.

గతంలో బతకడం కాదిది
శాశ్వతత్వం రికార్డయిన అమూల్య నిధి.
పోస్టు మ్యాన్ వస్తున్నాడు
మిత్రులారా!
పక్కకు జరిగి
అతనికి కాస్త దారినివ్వండి.

డా. ఎన్. గోపి




Owned, printed & published by Samala Lakshmana Babu (9440448244) and printed at Sri Mahalakshmi Offset Printers, 16-7-20, Veera Raghavulu Street, Sharabu Bazaar, Tenali, Guntur Dist. and published from 8-386, Jivaka Bhawan, Angalakuduru Post, Tenali Mandal, Guntur Dist. - 522211. Editor: Dr. SAMALA RAMESH BABU (9848016136), RNI-APTEL/2015/62362

# విద్యారంగంపై సెమినార్





ప్రజా వికాస వేదిక ఆధ్వర్యంలో విజయవాడలోని ఎం.బి.భవన్‌లో 2023 అక్టోబరు 14న విద్యారంగంపై రాష్ట్రస్థాయిలో సెమినార్ జరిగింది. ఉదయం 10 గంటలకు జరిగిన మొదటి సమావేశం శ్రీ ఎ.జగన్నాథరావు అధ్యక్షతన జరిగింది. డా.కె. చిన్నయ సూరి ప్రారంభోపన్యాసం చేశారు. శ్రీ వి.బాలసుబ్రహ్మణ్యం, శ్రీ కె.యస్.లక్ష్మణరావు, శ్రీ డి.రమేష్ పట్నాయక్, పాఠశాల విద్య, పాఠ్యప్రణాళిక, ఉన్నత విద్యారంగం స్థితిగతులపై ప్రసంగించారు.

కాగా, మధ్యాహ్నం 2గంటలకు జరిగిన రెండవ సమావేశంలో పాఠశాల విద్య-బోధనా సమస్యలపై శ్రీ కత్తి నరసింహారెడ్డి, పాఠశాల విద్య - భాషా విధానంపై డా.గుంటుపల్లి శ్రీనివాస్, విద్య-ఫిస్కల్ పాలసీపై ప్రొ.ఎం. సురేష్ బాబు ప్రసంగించారు.

వీటిలో 4 పత్రాలను మాత్రం ఈ సంచికలో ప్రచురించగలిగాము. 'అమ్మనుడి' పాఠకులు వీటివల్ల ప్రయోజనం పొందగలుగుతారని ఆశిస్తున్నాము.

# నిజాం వెంకటేశం సాహిత్య పురస్కారాల సభ



పురస్కార గ్రహీతలు వరుసగా గజ్జెల రామకృష్ణ, గోపగాని రవీందర్, డా॥ త్రివేణి, డా॥ ఎం. దేవేంద్ర, ఎస్. చంద్రశేఖర్

ప్రముఖ సాహితీవేత్త కీ.శే. నిజాం వెంకటేశం 75వ జన్మదిన సందర్భంగా నవంబరు 14న సికిందరాబాదులోని పద్మారావునగర్- బెల్వెడేర్ అపార్ట్‌మెంట్స్ ప్రాంగణంలో 'నిజాం వెంకటేశం సాహిత్య పురస్కారాల సభ' ఘనంగా జరిగింది. ప్రముఖ రచయితలు, సంపాదకులు సభలో పాలుపంచుకున్నారు. బి.యస్.రాములు, అెపు లక్ష్మీపతి, జూకంటి జగన్నాథం మున్నగు సాహితీవేత్తలు నిర్వహించారు. ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్, ఈనాడు డిప్యూటీ ఎడిటర్ శ్రీనివాస్, డా.పత్తిపాక మోహన్, డా.వాడ్రేవు చినవీరభద్రుడు మున్నగు ప్రముఖులు కార్యక్రమంలో ప్రసంగించారు.

అమ్మనుడి తెలుగుజాతి పత్రిక
AMMANUDI (Telugu Monthly)
October/November 2023 Vol :9, Issues: 8,9

Date of publication : 1st of every month
Date of posting : 3rd & 6th of every month

RNI-APTEL / 2015/62362
Postal Reg NO. TEN/14/2021-23

అభినందనలతో...

# బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్

## గుంటూరు

బి.టి.సి. హౌస్,
5వ వీధి, చంద్రమౌళి నగర్,
గుంటూరు - 522 007
ఫోన్ : 91-863 - 2357615
2357616
ఫ్యాక్స్ : 91-863-2351343

If not delivered, please return to : 'The Publisher, AMMANUDI Monthly,
8-386, Jivaka Bhavanam,ANGALAKUDURU (po),TENALI-522 211,Guntur (dt) A.P. Cell:94929 80244